డిసెంబర్
2024

224

సంపుటి : 20 సంచిక : 7

వెల రు. 15 /-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో ........

నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు

సనాతనవాదులకు మాక్స్‌ముల్లర్ అంటే ఎందుకంత ద్వేషం?

మధ్యయుగాలనాటి ఆర్థిక, సామాజిక జీవితం

ప్రకృతికి సంబంధించి కొత్త తాత్విక భావనలు

అదాని లాభాల కోసం ఆంధ్ర ప్రజలు భారాలు మోయాలా?

ఆంధ్రప్రదేశ్‌లో వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు

భారతదేశ అసమానతలు : తప్పుడు సిద్ధాంతాలు

మహిళా విముక్తి కోసం ఎనలేని కృషి చేసిన డా॥ముత్తులక్ష్మీరెడ్డి

స్ఫూర్తి

# మహిళా విముక్తి కోసం ఎనలేని కృషి చేసిన

# డా॥ ముత్తు లక్ష్మీరెడ్డి

పిబి చారి

డాక్టర్ ముత్తులక్ష్మిరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. పురుషుల కళాశాలలో అంటే కో-ఎడ్యుకేషన్‌లో చదువుకున్న మొదటి మహిళ. మెడికల్ కాలేజీలో చేరి, 1907లో ఎంబిబిఎస్ పూర్తిచేసిన మొదటి ఏకైక మహిళ, దేశంలో ప్రభుత్వ మెటర్నిటీ అండ్ ఆప్తాల్మిక్ ఆసుపత్రిలో పనిచేసిన మొదటి మహిళా హౌస్ సర్జన్. బ్రిటిష్ ఇండియాలోనే తొలి మహిళా శాసన సభ్యురాలుగా, శాసనమండలి తొలి ఉపాధ్యక్షురాలుగా పని చేశారు. 1954లో రాష్ట్ర సాంఘిక సంక్షేమం సలహా మండలికి మొదటి మహిళా చైర్‌పర్సన్‌గా నియమితులయారు. మహిళాభ్యున్నతికి, స్త్రీ పురుష సమానత్వం, స్త్రీలకు ఓటు హక్కు, బాల బాలికల అభ్యున్నతి కోసం కృషి చేశారు. విద్య, వైద్య రంగాలలో సంస్కరణలు, మహిళలకు సమాన ఆస్తి హక్కు, వితంతువుల పునర్వివాహం, బాల్యవివాహాలు, దేవదాసి వ్యవస్థ రద్దు కోసం పోరాడిన ధీరవనిత, మడమ తిప్పని మగువ, సంఘసంస్కర్త, విద్యావేత్త, రాజకీయవేత్త, స్త్రీ హక్కుల ఉద్యమనేత.

కాలం చెల్లిన సాంప్రదాయాలను, సామాజిక నిబంధనలను ఆనాడే ఎదిరించి పోరాడిన యోధురాలు డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి, సంఘసంస్కర్త. సంఘంలో సంస్కరణల గురించి పరితపించి, తిరుగుబాటు బావుటా ఎగురవేసిన ఉద్యమ శీలి. ఈ తరానికి పెద్దగా తెలియకపోవచ్చు. చరిత్ర పొరలను తొలుచుకుంటూ పోయి అక్కడ తేరిపార చూస్తే దొరికే ఆణిముత్యమే డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి.

1886 జులై 30న తమిళనాడులోని పుదుక్కొట్టైలో రామసామి అయ్యర్, చంద్రమ్మాళ్ దంపతులకు ముత్తులక్ష్మీరెడ్డి జన్మించారు. రామసామి అయ్యర్ మహారాజా కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసేవారు. రామసామి అయ్యర్ బ్రాహ్మణుడు, ఆయన భార్య చంద్రమ్మాళ్ దేవదాసి కుటుంబానికి చెందిన వనిత. రామసామి అయ్యర్ ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుల సాంప్రదాయాలను ఉల్లంఘించినందున ఆయన కుటుంబాన్ని వెలివేశారు. ముత్తులక్ష్మి తన తల్లి వైపువారితోనే సన్నిహిత సంబంధాలు పెంపొందించుకున్నారు. చిన్నప్పటి నుండి ముత్తు లక్ష్మిపై తల్లి ప్రభావం మెండుగా ఉండేది. తల్లి ద్వారా



ముత్తులక్ష్మి దేవదాసి స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చిన్నప్పుడే తెలుసుకున్నారు. దేవదాసి వ్యవస్థ, బాల్య వివాహాలు, పురుషాధిపత్యం, సమాజంలో ఒంటరి మహిళల అగచాట్లు ముత్తులక్ష్మిని కలవరపెట్టాయి. విరిసీ విరియని, ఊహ తెలియని ఆడపిల్లల్ని దైవ కైంకర్యం పేరుతో దేవుడికి పెళ్లి చేసి, గుడిలో నాట్యగత్తెగా చేస్తారు. అందిన వాళ్లు తమ కామార్తికి వాడుకునే అనాచారం దేవదాసీ విధానం. ఇలాంటి దురాచారాన్ని, దేవదాసి వ్యవస్థను రద్దు చేసే వరకు పోరాడాలని చిన్ననాడే సంకల్పించుకున్నారు ముత్తులక్ష్మి.

ఆనాటి సమాజంలో ఆడపిల్లల చదువుల మీద ఆంక్షలుండేవి. ఆడపిల్లలు నాలుగు గోడల మధ్య నలిగి పోవాల్సిందే కానీ అడుగు బయట పెట్టనివ్వని కాలం అది. అలాంటి ఆంక్షలను, సాంప్రదాయాలను ఉల్లంఘించి రామసామి అయ్యర్ ముత్తు లక్ష్మిని పాఠశాలకు పంపారు. ముత్తులక్ష్మి 13 ఏళ్ల వయసుకే 1902లో 10వ తరగతి పూర్తి చేశారు. ఇంటర్మీడియట్‌లో చేరటానికి మహారాజా కళాశాలలో దరఖాస్తు చేసుకున్నారు. అది పురుషుల కళాశాల. ఆమెను చేర్చుకోవడానికి వీల్లేదని ప్రిన్సిపాల్, ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు తిరిగారు. ఆమె దేవదాసి కుటుంబం నుండి వచ్చినందున మగ పిల్లలను వలలో వేసుకోవచ్చు అని అభ్యంతరం చెప్పారు. ముత్తులక్ష్మికి చదువుకోవాలని ఉన్న ఆకాంక్షను పుదుకోట్టై రాజా మార్తాండ భైరవ తోడర్మాల్ గుర్తించి, వివేకంతో ప్రగతిశీలంగా ఆలోచించి, మగపిల్లల తల్లిదండ్రులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను కొట్టివేస్తూ ఆమె కళాశాలలో చేరటానికి అనుమతించారు. ఆ విధంగా పురుషుల కళాశాలలో చేరిన మొదటి మహిళా విద్యార్థినుల్లో ముత్తు లక్ష్మి ఒకరు. ఆమె తరగతి గదిలో 40 మంది అబ్బాయిలు ముగ్గురు అమ్మాయిలు ఉండేవారు. ఆడ, మగ పిల్లలు ఒకరినొకరు చూసుకోకుండా మధ్యలో ఒక స్క్రీన్‌ను ఉంచేవారు. అలాంటి సమాజం ఆనాడు ఉండేది. 1907లో ఆమె ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అదే సంవత్సరం ఆమె మద్రాస్ మెడికల్ కాలేజీలో చేరారు. మెడిసిన్ చదువుకోడానికి డబ్బు కోసం పుదుకొట్టై మహారాజును ఆశ్రయించారు. ముత్తులక్ష్మికి చదువు మీద ఉన్న ఆసక్తికి ఆశ్చర్యపోయిన రాజావారు ఆమెకు 150 రూపాయలు స్కాలర్‌షిప్ ఇచ్చి ఆమెను ప్రోత్సహించాడు. ఆ సహాయం ఆమె జీవితాన్నే మార్చివేసింది. మెడిసిన్‌లో ముత్తు లక్ష్మి అద్భుతమైన రికార్డులను సాధించారు. ఏడు బంగారు పతకాలతో పాటు అనేక బహుమతులు కూడా పొందారు. 1912లో ఎంబిబిఎస్ పూర్తి చేసి దేశంలోనే మొదటి మహిళా వైద్యులలో ఒకరయ్యారు.

మెడిసిన్ చదివే రోజుల్లోనే సరోజినీ నాయుడుతో పరిచయం ఏర్పడింది. సరోజినీ నాయుడు ఏర్పాటు చేసిన సమావేశాలకు ముత్తు లక్ష్మీరెడ్డి హాజరయ్యే వారు. మహిళా హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేవారు. సరోజినీ నాయుడుతో పాటు మరో ఇద్దరు ఆమె జీవితాన్ని ప్రభావితం చేశారు. వారిలో ఒకరు మహాత్మా గాంధీ మరొకరు అనిబిసెంట్.

ముత్తులక్ష్మి తన మెడిసిన్ చదువు పూర్తి అయిన తర్వాత మద్రాసులోని ఎగ్మోర్‌లో స్త్రీలు, పిల్లల ప్రభుత్వ ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా పనిచేశారు. ఆ రోజుల్లో సంపన్న వర్గాల స్త్రీలు చాలా వరకు తమ సంతానానికి స్తన్యం ఇచ్చేవారు కాదు. నిమ్న జాతి మహిళలతో ఆ పసిబిడ్డలకు పాలిప్పించేవారు. డాక్టర్ అయ్యాక ముత్తులక్ష్మి ఈ అవివేక, అశాస్త్రీయ దురాచారాన్ని రూపుమాపేందుకు కృషి చేశారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకు యుక్త వయసు రాకుండానే పెళ్లిళ్లు చేసేవారు. ముత్తులక్ష్మికి పాతికేళ్ళు వచ్చినప్పటికీ ఇంకా పెళ్లి చేసుకోక పోవడంతో ఆమె బంధువులు సూటి పోటీ మాటలు అంటుండేవారు. ఎవరేమన్నా తన అభిప్రాయాలను గౌరవించే వ్యక్తి దొరికే వరకు వివాహం చేసుకోకూడదని

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. మహిళా విముక్తి కోసం ఎనలేని కృషి చేసిన డా॥ముత్తులక్ష్మీ రెడ్డి
పిబి చారి..........2

2. నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు
డా॥బి.రంగారావు......4

3. సనాతనవాదులకు మాక్స్‌ముల్లర్ అంటే ఎందుకంత ద్వేషం?
బొల్లోజు బాబా........12

4. మధ్యయుగాలనాటి ఆర్థిక, సామాజిక జీవితం
ఎంవిఎస్ శర్మ ........ 16

5. ప్రకృతికి సంబంధించి కొత్త తాత్విక భావనలు
. ఎస్.వెంకట్రావు........18

6. అదాని లాభాల కోసం ఆంధ్ర ప్రజలు భారాలు మోయాలా?
ఎ కోటిరెడ్డి........ 22

7. ఆంధ్రప్రదేశ్‌లో వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు
ఎన్.పురేంద్ర ప్రసాద్....... 24

8. భారతదేశ అసమానతలు : తప్పుడు సిద్ధాంతాలు
అశోక మోడీ........26



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# 'మోదానీ'

**భా**రత ప్రధాని నరేంద్ర మోడీ, కార్పొరేట్ దిగ్గజం గౌతమ్ అదానీల బంధం ఎంత గాఢంగా పెనవేసుకుపోయిందో చెప్పడానికి అమెరికాలో తాజాగా బయటపడ్డ 'అదానీ లంచాల పథకం' ఒక గొప్ప ఉదాహరణ. గత నవంబరు 20న న్యూయార్క్‌లోని అమెరికన్ న్యాయస్థానంలో గౌతమ్ అదానీ, ఆయన అన్న కుమారుడు సాగర్ అదానీ, మరో ఆరుగురిపై 'లంచం, అవినీతికర కార్యకలాపాలకు పాల్పడినట్లు' కేసు నమోదైంది. వీళ్లు ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోసహా పలు రాష్ట్రాల నాయకులకు, అధికారులకు 2,029 కోట్ల రూపాయల లంచం ముట్టజెప్పి సౌర విద్యుత్ ఒప్పందాలు చేయించుకున్నారని అభియోగం మోపబడింది. అమెరికా ప్రాసిక్యూటర్ల కథనం ప్రకారం, భారత దేశానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)కి సోలార్ విద్యుత్ సరఫరా చేసే కాంట్రాక్టులను అదానీకి చెందిన సోలార్ విద్యుత్ కంపెనీ, దాని అమెరికన్ పెట్టుబడిదారులు చేజిక్కించుకున్నారు. అయితే సెకీ దగ్గర విద్యుత్ కొనడానికి భారత దేశంలో ఎవరూ ముందుకు రాలేదు. దాంతో అదానీ స్వయంగా రంగంలోకి దిగి జగన్‌మోహన్ రెడ్డితో సహా ఆయా రాష్ట్రాల నాయకులను కలిసి లంచాలు ఎరవేసి తనకు అనుకూలమైన రేటుకు విద్యుత్ కొనుగోలు చేసేట్లు ఒప్పందాలు ఖరారు చేసుకున్నారు. ఈ లంచాల్లో పెద్ద మొత్తం, రూ. 1,750 కోట్లు ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రికి ముట్టినట్లు అమెరికన్ సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజ్ కమిషన్ వెల్లడించింది.

అదానీ మీద అవినీతి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ హిండెన్‌బర్గ్ తన పరిశోధనా పత్రంలో అదానీ కంపెనీ ఎలా స్టాక్‌మార్కెట్ అక్రమాలకు పాల్పడుతున్నదో వెల్లడించింది. అంతకు ముందు ఆస్ట్రేలియా నుండి అదానీ కంపెనీ దిగుమతి చేసుకున్న బొగ్గును అధిక ధరలకు రాష్ట్రాలకు అంటగట్టడానికి మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఎలా ఒత్తిడి తెచ్చిందో వెల్లడైంది. నిజానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు గుజరాత్‌లో చిన్న వ్యాపారిగా ఉన్న అదానీ ఈనాడు ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా ఎదగడం వెనుక ఆయనకు అడుగడుగునా మోడీ, ఆయన ప్రభుత్వ అండదండలున్నాయన్న విషయం జగమెరిగిన సత్యం.

ఇప్పుడు కూడా - అదానీ లంచాల కుంభకోణం ఇంతగా బయటపడిన తరువాత కూడా మోడీ ప్రభుత్వం అదానీని వెనకేసుకు రావడం సిగ్గుచేటైన విషయం. ఈ కుంభకోణం బయటపడ్డాక కెన్యా ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అదానీతో కుదుర్చుకున్న రూ. 21,000 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. శ్రీలంక పోర్టు అభివృద్ధికి అదానీ కంపెనీకి నిధులు సమకూర్చే విషయంలో అమెరికా అభివృద్ధి ఏజెన్సీ పునరాలోచన చేస్తోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంపై న్యాయపరమైన సలహాలు తీసుకుంటోంది. కానీ భారత దేశంలో మాత్రం మోడీ ప్రభుత్వం అదానీపై చర్యలు తీసుకోకపోగా దాన్ని రక్షించడానికి పూనుకుంది.


ఆంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కూడా మోడీ అడుగుజాడల్లోనే నడుస్తూ అదనీపై ఈగ వాలనీయడం లేదు. అదానీ వద్ద లంచాలు తిన్నందుకు మాజీ ముఖ్యమంత్రి జగనోమహన్ రెడ్డిని విమర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర నేతలు లంచాలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను నిలువునా దోచేయడానికి పథకం పన్నిన అదానీని మాత్రం ఏమీ అనకుండా మౌనం దాలుస్తున్నారు. ఆయనతో కుదిరిన విద్యుత్ ఒప్పందాల రద్దు ఊసే ఎత్తడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెకీతో మేము ఒప్పందం చేసుకున్నామే గాని మాకు అదానీతో సంబంధం ఏమిటి అని జగన్మోహన రెడ్డి బుకాయిస్తుంటే, ముడుపులు తీసుకున్నది రాష్ట్ర ప్రభుత్వాలు, దాంతో కేంద్రానికేమిటి సంబంధం అని మోడీ ప్రభుత్వం దబాయిస్తోంది. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు అవినీతికర పద్ధతుల్లో ప్రజల సంపద దోచుకోవడంలో వీళ్లందరూ భాగస్వాములుగా ఉన్నారన్న విషయం అర్థమవుతోంది,

బిజెపి ప్రభుత్వం, నరేంద్ర మోడీ అండదండలతోనే అదానీ ఇన్ని అక్రమాలకు పాల్పడుతూ దేశ ప్రజలనూ, వనరులనూ దోచుకుంటున్నాడని ఒకటి తరువాత మరొక ఘటన తేటతెల్లం చేస్తున్నాయి. మతోన్మాద బిజెపికి అదానీ అన్ని రకాలుగా వెన్నుదన్నుగా ఉన్నాడు. ఆయన డబ్బు, ఆయన మీడియా బిజెపికి దన్నుకాస్తుంటే మోడీ ప్రభుత్వం అదానీ అవినీతికి అన్ని రకాలుగా అండనిస్తోంది. భారత దేశంలో మతోన్మాదానికీ, ఆశ్రిత కార్పొరేట్ పెట్టుబడికీ మధ్య ఏర్పడిన లోతైన బంధంలో ఈ మోడీ-అదానీ (మోదానీ) బంధం ఒక భాగం. ఈ అక్రమ బంధాన్ని ఎండగట్టడం, కార్పొరేట్ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను కదిలించడం నేడు ఎంతైనా అవసరం.

ఈ మాసం ముఖ్యాంశం

# నిధుల్లేక కునారిల్లుతున్న స్థానిక సంస్థలు

**డా॥ బి గంగారావు**



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మహా విశాఖ నగర పాలక సంస్థ కార్పొరేటర్.

**5వ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గత వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం ప్రొ॥ ఎస్. రత్నకుమారి ఛైర్‌పర్సన్‌గా కమిటీని 18.3.2023న నియమించింది. ఈ కమిటీ త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులను సమర్పించనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక సంఘానికి కొన్ని ప్రతిపాదనలతో సమర్పించిన మెమోరాండం ఇది.**

సుపరిపాలన, స్వపరిపాలన, గ్రామ స్వరాజ్యం, ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ప్రణాళికలు రూపొందించటం, అమలు చేయటం, మౌలిక సదుపాయాలు, పౌర సేవలు కల్పించటం, అధికార వికేంద్రీకరణ, హేతుబద్ధమైన పన్నుల విధానం అనే ఉన్నత ఆశయాల ప్రాతిపదికన స్థానిక సంస్థల లక్ష్యాలు రూపొందించబడ్డాయి. ప్రతి ఐదేళ్లకొకసారి క్రమం తప్పకుండా పట్టణ, గ్రామ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించటం, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయటం, గ్రామసభలు, వార్డు కమిటీలు, వార్డు సభలు నిర్వహించటం, జిల్లా ప్రణాళికా, పట్టణాభివృద్ధి సంస్థలు వంటివి ఏర్పాటు కూడా వికేంద్రీకరణలో ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు.

ఈ విధులన్నిటిని నిర్వర్తించటానికి అవసరమైన ఆర్థిక వనరులు ఏర్పాటుకు రాష్ట్ర స్థాయిల్లో ఆర్థిక సంఘాలను నియమించాలని రాజ్యాంగంలో పేర్కొనబడింది. ప్రతి ఐదేళ్లకొకసారి క్రమం తప్పకుండా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలని రాజ్యాంగం ఆమోదించింది. స్థానిక సంస్థల అధికారాలు, విధులకు సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులు చేయాలి. అలాగే వాటి పరిధిలో వివిధ రకాల పన్నులు, పన్నేతర వనరుల ద్వారా ఆదాయాలు సమీకరించుకునేందుకు వివిధ రకాల పన్నుల బదలాయింపులను సిఫార్సు చేస్తుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయంలో స్థానిక సంస్థలకు న్యాయబద్ధమైన వాటా, గ్రాంట్లు, ప్రత్యేక అభివృద్ధి నిధులు తదితర రూపాల్లో ఎంతెంత బదిలీ చేయాలో ఆర్థిక సంఘం సిఫార్సులు చేస్తుంది. ఇది రాజ్యాంగ బద్ధ వ్యవస్థ. అలాగే దీనిని సెమీ జుడీషియరీ వ్యవస్థగా కూడా పేర్కొనొచ్చు.

1992లో భారత ప్రభుత్వం 73,74వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు కొన్ని అధికారాలు, విధులు, పన్ను విధింపు హక్కులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాల్లో కొంతభాగం స్థానిక సంస్థలకు బదిలీ చేసేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-జి, 243-ఎక్స్‌ల ద్వారా చట్ట బద్ధత కల్పించారు. షెడ్యుల్ 11లో 29 అధికారాలు గ్రామ పంచాయితీలకు,షెడ్యుల్ 12లో 18 అధికారాలు పట్టణ స్థానిక సంస్థలకు పొందుపర్చారు. ఈ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1994లను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రూపొందించి 1994 నుండి అమలులోకి తీసుకొచ్చింది. వీటితోపాటు హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ చట్టం -1955ను రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లకు వర్తింపజేసారు. అలాగే మున్సిపాలిటీలకు, నగర పంచాయతీలకు ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీస్ చట్టం-1965ను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలో ఆర్థిక వనరులు వికేంద్రీకరణ కొరకు ఆర్థిక సంఘాలను నియమించే ప్రక్రియ ప్రారంభమై నేటికి 30ఏళ్లు పూర్తి అయ్యింది. రాష్ట్రంలో తొలిసారిగా ఆర్థిక సంఘాన్ని 1994లో నియమించారు. వాస్తవంగా ఇప్పుడు రాష్ట్రంలో 6వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులో ఉండాలి. అలాగే 2024లోనే 7వ ఆర్థిక సంఘాన్ని సిఫార్సుల కొరకు ఆంధ్రరాష్ట్రంలో నియమించి ఉండాలి. ఆచరణలో ఇది గతి తప్పింది. వరుసగా మూడు ఆర్థిక సంఘాలను మాత్రమే నియమించారు. అదికూడ ప్రారంభ 15ఏళ్లలో కేవలం 8ఏళ్ళు మాత్రమే ఈ వరుస మూడు ఆర్థిక సంఘాల సిఫార్సులు అరకొరకగా అమలు చేయబడ్డాయి. 2010 నుండి నేటి వరకు ఆర్థిక సంఘాలు ఉనికిలో లేవు. కేవలం 4వ ఆర్థిక సంఘం ఇటీవలే సిఫార్సులు ఇచ్చింది. కాని అవి ఉపయోగంలో లేకుండా పోయాయి. ప్రస్తుతం 5వ ఆర్థిక సంఘం నియమించబడి త్వరలో సిఫార్సులు సమర్పించటానికి నియగ్నమై ఉంది.

2011 జనాభా ప్రకారం ఆంధ్ర రాష్ట్రంలో 4.96కోట్ల జనాభా ఉంది. 71శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలోను, 29శాతం ప్రజలు పట్టణ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. రాష్ట్రంలో మూడంచల స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థ కొనసాగుతున్నది. మొత్తం జనాభాలో 17.08శాతం షెడ్యుల్డ్ కులాలు,5.53శాతం షెడ్యూల్డ్ తెగలకు చెందిన జనాభా ఉంది. మొత్తం 13,371 గ్రామ పంచాయితీలు, 660 మండల ప్రజా పరిషత్‌లు, 13 జిల్లా పరిషత్‌లు నేడు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలు పునర్విభజన జరిగిన దానికి అనుగుణంగా జిల్లా పరిషత్‌లను కూడా భవిష్యత్‌లో కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే

రాష్ట్రంలో ప్రస్తుతం 17 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు కలిపి మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి.

**స్థానికసంస్థల పరిస్థితి**

ఆంధ్ర రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాలు, పౌరసేవల కొరత తీవ్రంగా ఉంది. నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 90శాతానికి పైగా గ్రామ పంచాయితీలు ప్రజలకు శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేయలేకపోతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అత్యధిక మున్సిపాలిటీల్లో రెండు లేదా మూడు రోజులకొకసారి మంచినీరు సరఫరా చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో విజయనగరం జిల్లా గుర్ల పంచాయితీ, దాని చుట్టూ ఉన్న గ్రామాల్లో కలుషిత మంచినీరు తాగి డయోరియాకు గురై 17మంది చనిపోయిన ఘోరఘటన రాష్ట్రంలోని గ్రామాల దుస్థితికి అద్దం పడుతున్నది. నేటికీ రాష్ట్రంలో చాలా స్థానిక సంస్థల పరిధిలో ఫ్లోరైడ్, ఉప్పునీటి సమస్యతో లక్షల మంది ప్రజలు బాధపడటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

గ్రామాల్లో మురుగునీటి కాలువలు లేని పరిస్థితి. రోడ్లమీదే మురుగునీరు ప్రవహించే స్థితి. ఇక మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో మురుగునీటి కాలువలు లేకపోవడం, ఉన్న కాలువలు మెయింటినెన్స్ లేక దుర్గంధంతో వీధులు కంపుకొట్టుకుపోతున్నాయి. ఫలితంగా ప్రజలపై దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. డెంగ్యూ, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, విరోచనాలు, వాంతులు ఇలా అనేక జబ్బుల భారిన ప్రజలు పడుతున్నారు. చెత్త సేకరణ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ లేదు. చెత్త డంపింగ్ యార్డులు లేక పట్టణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గ్రామాల్లో రోడ్లు చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయి. ఐదేళ్ళకొకసారైన గ్రామాల్లో అన్ని రోడ్లు వేయగలిగిన పరిస్థితి రాష్ట్రంలో లేదు.

స్థానిక సంస్థలు విద్యుత్ ఛార్జీల భారాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. వీధిలైట్లు, మంచినీటి సరఫరా వంటి పౌర సేవలకు ఎక్కువగా విద్యుత్ వినియోగించాల్సి వస్తున్నది. కాని వ్యాపార సంస్థలకు వసూలు చేసే విధంగా ఒక యూనిట్‌కి రూ॥7 నుండి రూ॥11 ల వరకు స్థానిక సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తున్నది. ఉదాహరణకు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) ఏడాదికి సుమారు రూ.150 కోట్లు విద్యుత్ ఛార్జీల బిల్లు ( వీధిలైట్లు, మంచినీటి సరఫరా తదితర వాటిమీద) చెల్లించాల్సి వస్తున్నది. ఈ సమస్య స్థానిక సంస్థలను తీవ్రంగా వేధిస్తున్నది.

> ❝ ఆంధ్ర రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాలు, పౌరసేవల కొరత తీవ్రంగా ఉంది. నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతు న్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 90శాతానికి పైగా గ్రామ పంచాయితీలు ప్రజలకు శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేయలేకపోతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అత్యధిక మున్సిపాలిటీల్లో రెం2డు లేదా మూడు రోజులకొకసారి మంచినీరు సరఫరా చేస్తున్నారు. ❞

5వ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామపంచాయితీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని గిరిజనులకు స్వపరిపాలన, వీరి సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, సహజవనరులపై స్వయం నిర్ణయాధికారం మొదలగు వాటిపై గిరిజన గ్రామాలకు అనేక హక్కులు కల్పించబడ్డాయి. ఇందుకోసం పంచాయితీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం 1996 (పెసా) ను తీసుకొచ్చారు. దీని ప్రకారం 5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన పంచాయితీలకు రాజ్యాంగంలోని 9వ విభాగంలోని నిబంధనలు వర్తించవు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ వనరులపై గ్రామపంచాయితీలు, గ్రామ సభల ఆమోదం లేకుండా ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయించేయకూడదు. అలాగే మైనర్ అటవీ ఉత్పత్తులపై కూడా వీరికి సర్వాధికారాలు కల్పించబడ్డాయి. కాని వీటినన్నింటిని ప్రభుత్వాలు ఉల్లంఘించేస్తున్నాయి. ఫలితంగా వీరి జీవన మనుగడకే ప్రమాదం ఏర్పడింది.

ఉత్తరాంధ్ర, రాయలసీమ, పశ్చిమ ప్రకాశం జిల్లా అనేక దశాబ్ధాల నుండి తీవ్ర వెనుకబాటుకు, కరవు, కాటకాలకు, విపత్తులకు గురౌతున్నాయి.రాష్ట్రంలో ఇతర ప్రాంతాలతో పోల్చుకున్నప్పుడు తీవ్ర అసమానతలు అన్ని రూపాల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజి నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం తో ఈ ప్రాంతాలు అభివృద్ధికి మరింత దూరమయ్యాయి.

రాష్ట్రంలో 11,158 గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో 3786 వార్డు సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో 1,26,728 మంది ఉద్యోగులు వివిధ బాధ్యతల్లో పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో 4.5లక్షల మందికిపైగా గౌరవ వేతనంపై వాలంటీర్లను నియమించారు. ప్రస్తుతం నిలిపివేసారు. స్థానిక సంస్థల పరిధిలోకి, పర్యవేక్షణలోకి వీటిని తీసుకురాకపోవటంతో, రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యక్షంగా మోనటరింగ్ చేయటంతో స్థానిక సంస్థలు బలహీన పడ్డాయి. స్థానిక సంస్థలపై సూపర్ పెత్తనం చేసే సంస్థలుగా మారాయి. అంతేకాక అధికారంలో ఉన్న పార్టీలకి సొంత ఏజెన్సీలుగాను, ప్రజలపై నిఘా సంస్థలుగా ఆచరణలో మారాయి.

శ్మశాన వాటికల నిర్వాహణ, క్రీడాస్థలాలు, మార్కెట్లు, గ్రంధాలయాలు, పార్కులు, రిక్రియేషన్, కుక్కలు, పందులు, దోమలు నుండి పౌరులను కాపాడటం, పబ్లిక్ పాయఖానాలు, కల్వర్టులు, వంతెనలు, చెరువుల నిర్వాహణ తదితర అనేక పౌర సదుపాయాలు ప్రజలకు స్థానిక సంస్థలు కల్పించాలి. అలాగే మరో 27రకాల ఐచ్ఛిక విధులు కూడా నిర్వర్తించాల్సి ఉంది. కానీ ఆచరణలో స్థానిక సంస్థల పరిధిలో ఇవన్ని నేటికీ కాగితాలకే పరిమితమై ఉన్నాయి.

ఇటీవల కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ దేశంలోని వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థలకు బదిలీ చేయబడ్డ విధులు, నిర్వాహణ, ఆర్థిక వనరుల బదిలీల అమలుపై అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో కేరళ దేశంలోనే అగ్రభాగంలో వుంటే, ఆంధ్రరాష్ట్రం మాత్రం చాలా దిగువ స్థాయిలో వుంది. నిధులు బదాలాయింపులో 14వ స్థానంలో, నిర్వహణ బాధ్యతలో 19వ స్థానంలో, విధుల బదాలాయింపులో 12స్థానంలో దేశంలో ఆంధ్ర రాష్ట్రం ఉండటం ఆందోళన కలిగిస్తుంది. ఆంధ్రరాష్ట్రంలో సుమారు 91శాతం అనగా 11,800 గ్రామ పంచాయతీ లకు సొంత భవనాలు లేవని పార్లమెంట్‌లో లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**❝ రాష్ట్ర విభజన తరువాత స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. గ్రామపంచాయితీలు, మండల, జిల్లా పరిషత్‌లు అన్నింటిని పూర్తిగా ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. చిన్న మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. 2014-18 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణసంస్థలకు ఇచ్చిన గ్రాంట్లు కేవలం రూ॥1491కోట్లు, గ్రామ పంచాయితీలకైతే రూ॥374కోట్లు మాత్రమే. ❞**

### దిగజారిపోతున్న స్థానిక సంస్థల ఆదాయాలు

రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 13.17 లక్షల కోట్లకు చేరింది. తలసరి ఆదాయంలో దేశంలో 8వ స్థానంలో రాష్ట్రం ఉంది. ఇప్పుడు చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఏడాదికి 15శాతం చొప్పున వృద్ధిరేటుతో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ రూపాయల జిడిపి సాధించాలని ప్రకటనలు చేస్తున్నది. కాని ప్రయోజనం ఏమిటి? స్థానిక సంస్థలకు ఒరిగేదేమిటి? స్థానిక సంస్థల ఆదాయాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. రోజు రోజుకి ఆర్థికంగా కునారిల్లి పోతున్నాయి. రాష్ట్ర ఖజానా నుండి స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారు.

రాష్ట్ర విభజన తరువాత స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. గ్రామపంచాయితీలు, మండల, జిల్లా పరిషత్‌లు అన్నింటిని పూర్తిగా ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. చిన్న మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. 2014–18 మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణసంస్థలకు ఇచ్చిన గ్రాంట్లు కేవలం రూ॥1491కోట్లు, గ్రామ పంచాయితీలకైతే రూ॥374కోట్లు మాత్రమే. 2019–2023 మధ్యకాలంలో పట్టణ స్థానిక సంస్థలకు ఇచ్చింది 813.66 కోట్లు కాగా గ్రామ స్థానిక సంస్థలకు అందులో సగం కూడా నిధులు ఇవ్వలేదు. గడిచిన 15ఏళ్ళలో రాష్ట్ర పన్నుల ఆదాయం నుండి స్థానిక సంస్థలకు ఒక్క శాతం కూడా నిధులు బదిలీ చేయబడ లేదు. ఇది పూర్తిగా రాజ్యాంగ దిక్కరణ చర్య.

స్థానిక సంస్థలకు బదలాయించబడ్డ పన్నులు, పన్నేతర ఆదాయ వనరులు కూడా తగ్గిపోతున్నాయి. గత 10ఏళ్ళలో స్థానిక సంస్థల సొంత ఆదాయాలు రాష్ట్ర స్థూలజాతీయోత్పత్తిలో 0.37శాతం నుండి 0.33 శాతానికి పడి పోయాయి. స్థానిక సంస్థలకు బదలాయించబడ్డ పన్నుల్లో ఆస్థిపన్ను, వృత్తిపన్ను, ప్రకటనలపన్ను, వినోదపు పన్ను, భూముల రిజిస్ట్రేషన్‌ల స్టాంపు డ్యూటీలపై సర్‌ఛార్జీ, భవన నిర్మాణ అనుమతుల ఫీజులు ముఖ్యమైనవి. గ్రామపంచాయితీలకు మాత్రం వీటిల్లో ఆస్థి పన్నే అత్యంత ముఖ్యమైన ఆదాయ వనరు. అదికూడా చాలా నామమాత్రం గానే వస్తుంది. ఇతరత్రా ఆదాయాలు ఏమీ ఉండవు. కొద్దిపాటి చిన్న చిన్న షాపులు మాత్రమే ఉంటాయి. ఫలితంగా గ్రామస్థానిక సంస్థలకు సొంత ఆదాయ వనరులు రోజువారి ఖర్చులను కూడా పూడ్చుకొలేని స్థితిలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్రాలమీదే ఆదాయ వనరుల కొరకు గ్రామ స్థానిక సంస్థలు ఆధారపడాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది. వృత్తిపన్ను, భూముల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీలపై విధించే సర్‌చార్జీ ఆదాయాలు గ్రామ స్థానిక సంస్థలకు ఎప్పటికప్పుడు బదిలీ చేయాలి. ఇవి స్థానిక సంస్థలకు చెందిన ఆదాయాలు. కానీ గత ఐదేళ్ళలో నాలుగేళ్లు ఇవ్వలేదు. అనేక ఏళు నుండి గ్రామ స్థానిక సంస్థల పరిధిలో ఉండే ఖనిజాలు, ఇతర మైనింగ్, ఇసుక, గ్రావెల్ వంటి వాటి నుండి ప్రభుత్వం వసూలు చేసే ఫీజులు, సినరేజ్ ఆదాయాల్లో స్థానిక సంస్థలకు వాటా చెల్లించడంలేదు. కనీసం వాటిని ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేటప్పుడు గ్రామ పంచాయతీల అనుమతులు కూడా తీసుకోవడంలేదు. ఈ పరిస్థితుల్లో గ్రామ స్థానిక సంస్థలకు విస్తృత పరిధిలో పన్ను, పన్నేతర ఆదాయ వనరులు బదిలీ చేయ బడాలి.

పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితి కూడా ఘోరంగా ఉంది. ఖర్చులకు, వచ్చే ఆదాయాలకు పొంతన లేకుండా ఉంది. అత్యవసర ఖర్చులు పెరిగిపోతున్నాయి. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, ఇతర సిబ్బందికి కూడా నెలవారీ వేతనాలు చెల్లించుకోలేని పరిస్థితులలోకి నెట్టబడుతున్నాయి. ఈవిషయంలో గ్రామ పంచాయితీల పరిస్థితి అత్యంత దయనీయంగా వుంది. ఈనేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా ప్రజలపై అనేక రకాల పన్నుల భారాలు వేశారు. ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధానాన్ని తీసుకొచ్చి భారీగా ఆస్తిపన్ను పెంచారు. ప్రతి ఏడాది 15శాతం చొప్పున ఆస్తిపన్ను పెంచే పద్ధతిని అమలులోకి తెచ్చారు. ప్రతి ఏడాది భూముల రిజిస్ట్రేషన్ రేట్లు పెంచుతూ ఆస్తి పన్నును మరింతగా పెంచే చర్యలకు పూనుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలపై పన్నుల భారం మోపారు. మంచినీటి ఛార్జీలు పెంచుతున్నారు. నీటి మీటర్లు బిగిస్తున్నారు. చెత్తపై యూజర్ ఛార్జీలు తీసుకొచ్చారు. పట్టణాల్లో మురుగునీటి ఛార్జీలు విధిస్తున్నారు. భవన నిర్మాణ ప్లానులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు భారీగా పెంచారు. మొత్తంగా ప్రజలపై వివిధ రకాల పన్నుల భారాలు మోపి స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచాలనే చర్యలు ఈకాలంలో అమలు చేశారు. ఆస్తి పన్నును ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ అలాగే ఆస్తిపన్నే స్థానిక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరుగా రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తున్నది. ఇది చాలా ప్రమాదకరమైన పోకడ.

గత 15ఏళ్ళలో రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయం నుండి ఒక్క శాతం ఆదాయం కూడా స్థానిక సంస్థలకు బదిలీ కాలేదు. తలసరి గ్రాంట్లు ఎగ్గొట్టారు. చట్టపరంగా ఇవ్వాల్సిన గ్రాంట్లు, ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇవ్వడం లేదు. గత కొన్నేళ్ల నుండి మోటర్ వెహికిల్ పన్నులో వాటాను కూడా స్థానిక సంస్థలకు ఇవ్వటంలేదు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ క్రింద చేపట్టిన పనులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా పట్టణ స్థానిక సంస్థల మీద భారం వేసింది.

స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను బదిలీ చేయకపోగా స్థానిక సంస్థల ఆదాయాలను బలవంతంగా తన అవసరాలకి వినియోగించుకుంటూ స్థానిక సంస్థల అభివృద్ధిని మరింత కుంగదీస్తున్నారు. కంప్రెహెన్సివ్ ఫైనాన్సియల్ మేనేజిమెంట్ సిస్టమ్ (సిఎఫ్ఎంఎస్) తీసుకొచ్చి స్థానిక సంస్థల సొంత ఆదాయాలన్నింటిని ఈ సంస్థకి లింక్ చేసారు. ఫలితంగా స్థానిక సంస్థలకు పౌరులు చెల్లించే వివిధ రకాల పన్నుల సేవల ఛార్జీలన్ని ఆన్‌లైన్ డిజిటల్

చెల్లింపుల ద్వారా సిఎఫ్ఎంఎస్ అకౌంట్‌కి వెళ్లిపోతున్నాయి. ఈసొమ్ముని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకి చెల్లించకుండా తన అవసరాలకి వినియోగించుకుంటూ స్థానిక సంస్థలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. అలాగే కేంద్ర ఆర్థిక సంఘం నుండి స్థానిక సంస్థలకు వచ్చే నిధులను, వివిధ పథకాల క్రింద వచ్చే మ్యాచింగ్ గ్రాంట్స్‌ను కూడా స్థానిక సంస్థలకి వెంటనే చెల్లించకుండా పర్సనల్ డిపాజిట్ అకౌంట్ (పిడి అకౌంట్స్)ల నుండి రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంగా తన అవసరాలకి వినియోగించుకుంటుంది. కొన్ని సందర్భాలలో విద్యుత్ బకాయిల పేరుతో స్థానిక సంస్థల సొమ్మును ఏకపక్షంగా విద్యుత్ సంస్థలకు చెల్లిస్తున్నది. గత పదేళ్ల నుండి ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలపై ఈ దౌర్జన్యం సాగిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయిలో ఉన్న అనేక ప్రభుత్వ ఏజెన్సీలు స్థానిక సంస్థల అధికారాలను, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్నాయి. స్థానిక సంస్థల అరకొర వనరులను కూడా దుర్వినియోగం చేస్తున్నాయి. ఉదాహరణకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ), డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటిసిపి), పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ (పిహెచ్ఎంఇడి), ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఇలా అనేక సంస్థలు పట్టణ స్థానిక సంస్థలపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. వారు ఆదేశించిన విధానాలు, పనులను తప్పనిసరిగా స్థానిక సంస్థలు అమలు చేయాలని ఆదేశిస్తున్నాయి.

2017లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టీ పట్టణ స్థానిక సంస్థల సొంత ఆదాయాలను తీవ్రంగా దెబ్బతీసింది. జిఎస్‌టీకి ముందు వినోదపు పన్ను, ప్రకటనలపై పన్నును పట్టణ స్థానిక సంస్థలు వసూలు చేసుకునేవి. ఈ రెండింటి నుండి వచ్చే పన్ను ఆదాయం చాలా మున్సిపల్ సంస్థలకు వాటి సొంత ఆదాయంలో 15 నుండి 20శాతంగా ఉండేది. జిఎస్‌టీ వీటినన్నింటిని స్థానిక సంస్థల నుండి తన పరిధిలోకి ఏకపక్షంగా లాగేసుకుంది. ఫలితంగా పట్టణ మున్సిపల్ సంస్థలు వందల కోట్లలో సొంత ఆదాయం కోల్పోతున్నాయి.

ఉదాహరణకు విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ వినోదపు పన్ను నుండి ఏడాదికి 60కోట్లు, ప్రకటనల పన్ను నుండి 20కోట్లు

**❝ రాష్ట్రంలో ఇటీవల సుమారు 20 పట్టణాభివృద్ధి సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఈ సంస్థలకు భూ బదాలాయింపు, లేఅవుట్ లా డెవలప్‌మెంట్ ఛార్జీలు, పార్కులు, రిక్రియేషన్, స్టేడియంలు, భవనాల అద్దెలు, ల్యాండ్ పూలింగ్, భూ అమ్మకాలు తదితర వాటి ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతున్నది. ఈ ఆదాయంలో చాలాభాగం రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటున్నది. ❞**

జిఎస్‌టీ వల్ల నష్టపోతున్నది. సినిమా థియేటర్‌లలో ప్రతి టికెట్ మీద 18 మరియు 28శాతం చొప్పున జిఎస్‌టీ వసూలు చేస్తున్నారు. ఇదంతా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ఆదాయం. ఈ నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూడ్చటంలేదు. అంతేగాక జిఎస్‌టీ పట్టణ స్థానిక సంస్థల నూతన ఆదాయ వనరుల అవకాశాలను కూడా కుదించివేస్తున్నది.

రాష్ట్రంలో ఇటీవల సుమారు 20 పట్టణాభివృద్ధి సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఈ సంస్థలకు భూబదాలాయింపు, లేఅవుట్ లా డెవలప్‌మెంట్ ఛార్జీలు, పార్కులు, రిక్రియేషన్, స్టేడియంలు, భవనాల అద్దెలు, ల్యాండ్ పూలింగ్, భూ అమ్మకాలు తదితర వాటి ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతున్నది. ఈ ఆదాయంలో చాలాభాగం రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు తమ ఆస్తులు, భవనాలకు ఆస్తిపన్ను చెల్లించటంలేదు. అలాగే ప్రైవేట్ పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు ఇస్తున్నాయి. భూములు కేటాయించేటప్పుడు రిజిస్ట్రేషన్ ఛార్జీలు, నాలా ఫీజులు, ఖాళీ స్థలాల పన్ను వంటివి మినహాయిస్తున్నాయి. దీనివల్ల స్థానిక సంస్థలు వేల కోట్లు ఆదాయం కోల్పోతున్నాయి. పైపెచ్చు కొన్ని పరిశ్రమలకు ఆస్థిపన్నుకూడా మినహాయిస్తున్నాయి. పట్టణ లేదా నగర పరిధిలో ఉన్న కొన్ని ప్రైవేట్ పరిశ్రమలను ఆ మున్సిపల్ భౌగోళిక ప్రాంతం నుండి మినహాయించి నోటిఫైడ్ ఏరియాగా మారుస్తున్నారు. ఉదాహరణకు విశాఖపట్నంలో ఉన్న ఆదానీ గంగవరం పోర్టును విశాఖపట్నం మున్సిపల్ పరిధి నుండి మినహాయిస్తూ నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించారు.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్‌పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఎన్ఇజెడ్‌లు, ఎపిఐఐసి, పారిశ్రామిక కారిడార్లు వీటన్నింటిని నోటిఫైడ్ ఏరియాలుగా మార్చేస్తున్నారు. దీనివల్ల ఆస్థిపన్ను స్థానిక సంస్థలు కోల్పోతున్నాయి. అలాగే పారిశ్రామిక క్లస్టర్‌లు, ఎస్టేట్‌లను పారిశ్రామిక స్థానిక ఏరియాల అథారిటీ (ఐలా) పేర ఆస్థిపన్ను నుండి మినహాయిస్తున్నారు. కొన్ని పరిశ్రమలకు సర్వీసు చార్జీల పేర కేవలం 33.5శాతానికి తగ్గించి ఆస్థిపన్ను చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. దీనివల్ల వందలకోట్లు ఆస్తి పన్నును స్థానిక సంస్థలు నష్టపోతున్నాయి.

నగరాల్లో మున్సిపల్ కౌన్సిల్స్‌కు సమాంతర వ్యవస్థలను నెలకొల్పే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికైన మున్సిపల్ కౌన్సిల్స్‌తో సంబంధం లేకుండా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) లపేర ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో ప్రత్యేక ఎకౌంట్‌లను ఏర్పాటు చేసి దాని ద్వారా వివిధ పథకాల ద్వారా వచ్చే నిధులను ఖర్చుచేస్తున్నారు. ఈ విధానాలు పట్టణ స్థానిక సంస్థల అధికారాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు 2015 నుండి స్మార్ట్ సిటీ పథకం విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, తిరుపతి నగరాల్లో అమలు జరుగుతున్నది. ఈ పథకం క్రింద చేపట్టే పనులకు ఎన్నికైన కౌన్సిల్‌కు సంబంధం లేకుండా చేశారు. విశాఖపట్నం స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసి దీనిద్వారా సుమారు వెయ్యికోట్లు నిధులు ఖర్చు పెట్టారు. కాకినాడ, తిరుపతిలలో కూడా ఈ లిమిటెడ్ సంస్థలను ఏర్పాటు చేసారు. ఎన్నికైన మేయర్లు, కౌన్సిల్స్‌కు ఈ ప్రాజెక్టులపైన, ఈసంస్థలపైన ఎలాంటి అధికారం లేదు.

కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా ఎక్కువ భాగం సంస్కరణలతో ముడిపెట్టి ఇస్తున్నది. ప్రజలపై భారాలు, పౌరసేవలు

> **"నిధుల బదిలీకి సంబందించి పరిశీలన చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘాలు చేసిన సిఫార్సుల్లో ఆమోదించిన వాటిని కూడా అనేక సిఫార్సులను ఆచరణలో అమలు చేయ నిరాకరించాయి. చివరికి బడ్జెట్‌లో పేర్కొన్న నిధులను కూడా స్థానిక సంస్థలకు బదిలీ చేయకుండా కోతలు పెట్టారు."**

ప్రైవేటీకరించాలని, పన్నులు పెంచాలని ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఆస్తిపన్నే ప్రధాన ఆదాయ వనరుగా ఉండాలని ఆదేశిస్తున్నాయి. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి ఈ ప్రమాదకర సంస్కరణలను అమలు పూనుకుంటున్నది. 2021 ఆస్తివిలువ ఆధారంగా ఆస్తిపన్ను విధానాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర పేర పారిశుద్ధ్యాన్ని ప్రైవేటీకరిస్తున్నారు. పట్టణ స్థానిక సంస్థల ఆమోదం లేకుండానే 42 పట్టణ స్థానిక సంస్థలో 2535 క్లాప్ వాహనాలను ప్రైవేట్ సంస్థల నుండి అద్దెకు తీసుకొని ఆభారాన్ని స్థానిక సంస్థల మీద రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దింది. చెత్తపై యూజర్ ఛార్జీల భారం ప్రజలపై ఏకపక్షంగా మోపింది. అమృత పథకంలో మ్యాచింగ్ గ్రాంట్స్‌ను కూడా స్థానిక సంస్థలపై మోపుతున్నారు. అలాగే అమృత పథకం పేర మంచినీటి చార్జీలు పెంచటం, నీటి మీటర్లు బిగించడం, నీటిసరఫరా మెయింటినెన్స్‌ను ప్రైవేట్‌పరం చేసే చర్యలకు వత్తిడి తీసుకువస్తున్నారు.

**రాష్ట్ర ఆర్థిక సంఘాల తీరుతెన్నులు - సిఫార్సులు - ప్రభుత్వాల వైఖరి**

ఉమ్మడి రాష్ట్రంలో మొదటి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని శ్రీ లక్ష్మణస్వామి ఛైర్మన్‌గా 22-6-1994న నియమించారు. 1997-2000 మధ్య కాలానికి సంబంధించి రాష్ట్రం నుండి స్థానిక సంస్థలకు బదిలీ చేయాల్సిన నిధులు, గ్రాంటులకు సంబంధించిన సిఫార్సుల రిపోర్టును 30.5.1997న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. 2000-2005 సంవత్సరాలకు ప్రొ॥ డి.ఎల్.నారాయణ ఛైర్మన్‌గా రెండో ఆర్థిక సంఘాన్ని 8.12. 1998న నియమించగా, 19.8.2002న కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఆ తరువాత ప్రొ॥ బి. సత్యనారాయణ ఛైర్మన్‌గా మూడవ ఆర్థిక సంఘాన్ని 2005-2010 మధ్యకాలానికి 29.1.2004న నియమించారు. నాగులుగేళ్ల తరువాత అనగా 29.1.2008న కమిటి రిపోర్టు ఇచ్చింది. ఈ కమిటి ఇచ్చిన రిపోర్టు ఏడాది కాలానికే పరిమితమయ్యింది.

నాల్గవ ఆర్థిక సంఘాన్ని 2010-2015 మధ్యకాలానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించాలి. కాని నియమించలేదు. రాష్ట్ర విభజన అనంతరం 4.1.2015న ప్రొ॥కె.ఎల్ కాంతా రావు ఛైర్మన్‌గా 2015-2020 మధ్యకాలానికి నాల్గవ ఆర్థిక సంఘాన్ని నియమించింది. ఛైర్మన్ మరణించడంతో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కమిటీని అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వ చివరి ఏడాదిలో అనగా 5.2.2018న ప్రొ॥ జి.నాంచారయ్య ఛైర్మన్‌గా మరోసారి 4వ ఆర్థిక సంఘాన్ని నియమించబడింది. 30.10. 2019 నాటికి 2000-2025 మధ్యకాలానికి నిధుల సిఫార్సులు ఇవ్వాలని ఆదేశించింది. 2019లో చంద్రబాబు ప్రభుత్వం ఓడిపోయి వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కమిటి సకాలంలోనే రిపోర్టు ప్రభుత్వానికి సమర్పించినప్పటికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈరిపోర్టును ఆమోదించకుండా ఉద్దేశ్యపూర్వకంగా పక్కనపెట్టింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో ఎన్నికల ముందు హడావుడిగా 2024 ఫిబ్రవరిలో నివేదికలోని కొన్ని ఆర్థికేతర సిఫార్సులను మొక్కుబడిగా ఆమోదించింది.

మొదటి రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ మొత్తం 84 సిఫార్సులు చేస్తే కేవలం 24 సిఫార్సులను మాత్రమే ప్రభుత్వం ఆమోదించింది. వాటిల్లో 70శాతం అమలు చేయలేదు. ఆర్థిక భారం లేని కొన్ని సిఫార్సులను కూడా అమలు చేయ నిరాకరించింది. రెండో ఫైనాన్స్ కమీషన్ 82 సిఫార్సులు చేస్తే 46కి మాత్రమే ఆమోదం తెలిపింది. మూడో రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ గ్రామ స్థానిక సంస్థలకు 44, పట్టణ సంస్థలకు 19, మొత్తం 63 సిఫార్సులు చేసింది. వీటిల్లో గ్రామ స్థానిక సంస్థలకు చెందిన 3 ఆర్థిక పరమైనవి. మరో 17 ఆర్థికేతర అంశాలకు ఆమోదం తెలిపింది. కాని ఆర్థికేతర 17 అంశాల్లో 8 అంశాలను అమలు చేయలేదు. పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి కేవలం ఒకే ఒక ఆర్థికపరమైన సిఫార్సుతోపాటు మరో 8 ఆర్థికేతర సిఫార్సులకు ఆమోదం తెలిపింది. మొత్తంగా 63 సిఫార్సుల్లో 29 సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

నిధుల బదిలీకి సంబందించి పరిశీలన చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘాలు చేసిన సిఫార్సుల్లో ఆమోదించిన వాటిని కూడా అనేక సిఫార్సులను ఆచరణలో అమలు చేయ నిరాకరించాయి. చివరికి బడ్జెట్‌లో పేర్కొన్న నిధులను కూడా స్థానిక సంస్థలకు బదిలీ చేయకుండా కోతలు పెట్టారు.

రాష్ట్ర నికర పన్నుల రాబడి నుండి కనీసం రూ.979.16 కోట్లు స్థానిక సంస్థలకు బదిలీ చేయాలని మొదటి ఆర్థిక సంఘం కోరినా నాటి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.434.42 కోట్లు మాత్రమే ఆమోదించింది. యివి కేవలం సిఫార్సు చేసిన నిధుల్లో 44.37శాతం మాత్రం. 1997-98 ఆర్థిక సంవత్సరంలో రూ. 100 కోట్లను గ్రామ స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఎగ్గొట్టింది. అలాగే పట్టణ స్థానిక సంస్థలకు రూ.70.47కోట్లు బడ్జెట్‌లో కేటాయించి విడుదల చేయలేదు.

రూ.1793.94 కోట్లను రెండో ఆర్థిక సంఘం సిఫార్సు చేయగా కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం ప్రతిపాధించిన నిధుల్లో 17 శాతం ఆమోదం తెలిపారు. పంచాయతీలకు ఆమోదించిన రూ.200 కోట్లలో 135 కోట్లు విడుదల చేసారు. 2005-06లో రూ.100కోట్లు, 2006-08లో రూ.91కోట్లు విద్యుత్ ఛార్జీల క్రింద ప్రభుత్వమే నేరుగా ఎపి ట్రాన్స్‌కి జమచేసింది.

2005-10 కాలానికి ఏడాదికి 3వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.1274.34 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.498.38 కోట్లు చొప్పున మొత్తం రూ.1774,72కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాని ప్రభుత్వం ఏడాదికి గ్రామ స్థానిక సంస్థలకు రూ.113.64 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.123.12 కోట్లు మాత్రమే ఆమోదం తెలిపింది.

నాల్గవ ఆర్థిక సంఘం గ్రామ స్థానిక సంస్థలకు 40, పట్టణ స్థానిక సంస్థలకు 51 సిఫార్సులు మొత్తం 91 సిఫార్సులను తన రిపోర్టు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. కాని ముఖ్యమైన ఆర్థిక సిఫార్సులను ఏ ఒక్క దానినీ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించకుండా తిరస్కరించింది. 2020- 2025 ఐదేళ్ల కాలంలో ఆదాయ ఖర్చుల మధ్య గ్రామ స్థానిక సంస్థలకు రు. 26,975 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రు. 13,568 కోట్లు మొత్తం సుమారు రు 40543 కోట్ల నిధుల కొరత ఉందని నిర్ధారించింది.

> **“ ఈ నిధులు స్థానిక సంస్థలకు బదిలీ కావాలంటే రాష్ట్ర పన్నుల వాటాలో గ్రామ స్థానిక సంస్థలకు 6.50శాతం, పట్టణ స్థానిక సంస్థలకు 3.26% మొత్తం 9.76% చొప్పున ప్రతి ఏడాది బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. కానీ ప్రభుత్వం ఈ రెండు సిఫార్సు లను నిర్ద్వందంగా తిరస్కరించింది. ”**

ఈ నిధులు స్థానిక సంస్థలకు బదిలీ కావాలంటే రాష్ట్ర పన్నుల వాటాలో గ్రామ స్థానిక సంస్థలకు 6.50శాతం, పట్టణ స్థానిక సంస్థలకు 3.26% మొత్తం 9.76% చొప్పున ప్రతి ఏడాది బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. కానీ ప్రభుత్వం ఈ రెండు సిఫార్సులను నిర్ద్వందంగా తిరస్కరించింది. గ్రాంట్లు, ప్రత్యేక అభివృద్ధి నిధుల సిఫార్సులను కూడా ఆమోదించలేదు. గ్రామపంచాయతీలకు రూ 8 నుండి రూ 25, మండల ప్రజా పరిషత్తులకు రూ 16 నుండి రూ 25లకు, జిల్లా ప్రజాపరిషత్తులకు రూ 8 నుండి రూ 25లకు, పట్టణ స్థానిక సంస్థలకు రూ 50లకు తలసరి గ్రాంట్లు పెంచే సిఫార్సులను కూడా ఆమోదించి అమలు చేయలేదు. గ్రామ స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్న సూచనను కూడా అంగీకరించలేదు. జీఎస్టీ వల్ల కోల్పోతున్న వినోదపు పన్ను, ప్రకటనల పన్ను తిరిగి స్థానిక సంస్థలకు జమ చేయాలన్న సిఫార్సులను అమలు చేస్తామని చెప్పలేదు. ఇక వృత్తి పన్ను, సీనరేజ్ ఫీజులు, మార్కెట్ యార్డుల పన్నుల్లో వాటా వంటివి స్థానిక సంస్థలకు బదిలీ చేస్తామని అంగీకరించి అమలు చేయ లేదు. అంతేగాక స్థానిక సంస్థలను పట్టిపీడిస్తున్న విద్యుత్ చార్జీల రేట్లు కమర్షియల్ నుండి డొమెస్టిక్‌కి మార్చి రేట్లు తగ్గించాలని కమిషన్ సిఫార్సును కూడా ఆమోదించకుండా దాటవేసింది.

2025-2030 కాలానికి 5వ ఆర్థిక సంఘాన్ని నియమించాలి. కాని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నియమించ నిరాకరించింది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. చివరికి హైకోర్టు తీవ్రంగా స్పందించటంతో విధిలేని పరిస్థితిలో 18.3.2023న ప్రొ॥ ఎస్.రత్నకుమారి ఛైర్‌పర్సన్‌గా 5వ ఆర్థిక సంఘాన్ని నియమించింది. కాని టర్మ్స్ ఆఫ్ రిఫరేన్స్‌ను కమిటికి వెంటనే ఇవ్వకుండా ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా జాప్యం చేసింది. 6 నెలల తరువాత 29.9.2023న టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ విడుదల చేసి 30.9.2024 నాటికి రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించాలని కమిటిని కోరింది. త్వరలో ఈ కమిటీ తన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నది.

ఐదవ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ నాల్గవ అంశంలో నాల్గవ క్లాజులో పౌర సేవలను వాణిజ్యపరం చేసేందుకు అవసరమైన సూచనలు చేయమని కోరారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర సేవలను ప్రైవేటీకరించాలని కోరారు. అలాగే ఈ సేవలపై యూజర్ చార్జీలు విధించడం, పన్నులు పెంచడం, ఫీజులు, లెవీలను పెంచటంపై తగిన సిఫార్సులు సూచించమని రాష్ట్ర ప్రభుత్వం కోరటం చాలా ఆందోళన కలిగిస్తున్నది. ప్రజా రవాణా వ్యవస్థను కూడా ప్రైవేటీకరించడానికి అవసరమైన సూచనలు చేయమని ప్రభుత్వం కోరింది. ఇవ్వన్ని చట్ట విరుద్ధం.

కొత్తగా ఆంధ్ర రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం - జనసేన కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం అరకొరకగా ఆమోదించిన 4వ ఆర్థిక సంఘం సిఫార్సులను కూడా అమలుకు పూనుకోవటం లేదు. మాటలు తప్ప స్థానిక సంస్థలకు రాష్ట్ర ఆదాయం నుండి ఒక రూపాయి కూడా నిధులను ఈ ఐదు నెలలో బదిలీ చేయలేదు. ఇటీవల ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో కూడ స్థానిక సంస్థలకు ప్రత్యేకంగా నిధులు కూడ కేటాయించలేదు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రాష్ట్రంలో స్థానిక సంస్థలు నిధుల లేమితో ఉత్సవ విగ్రహాలుగా, ప్రజల మీద భారాలుమోపే సంస్థలుగా మారిపోయే ప్రమాదం ఏర్పడనుంది.

**5వ రాష్ట్ర ఆర్థిక సంఘానికి సమర్పించిన కొన్ని ప్రతిపాదనలు**

**రాష్ట్ర సొంత ఆదాయంలో 30శాతం స్థానిక సంస్థలకు కేటాయించాలి:**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఆదాయాలు, అవసరాలు, వ్యయాల మధ్య తీవ్ర అంతరం కొనసాగుతూ ఉన్నది. బడ్జెట్ పత్రాల్లో ప్రభుత్వం తెలియజేసిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను, పన్నేతర ఆదాయం 2022-23లో 83,505కోట్లు వచ్చింది. అలాగే 2023-24లో 1,18,051 కోట్లు, 2024-25 అంచన ప్రకారం 1,23,937 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. 2024-25 సం॥ ఆదాయ అంచనాలను పరిగణలోకి తీసుకొని స్థానిక సంస్థలకు రాష్ట్ర సొంత పన్ను, పన్నేతర ఆదాయంలో కనీసం 30శాతం ఆదాయాన్ని బదిలీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ప్రాతిపదికన అనగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 37,181కోట్లు స్థానిక సంస్థలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది కనీసం 10శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం నుండి స్థానిక సంస్థలకు 2030 వరకు బదిలీచేయాలి. ఈ నిధుల్లో సాధారణ నిధుల క్రింద 6.5శాతం, మెయింటినెన్స్ నిధుల క్రింద 7.5శాతం, డెవలప్‌మెంట్ నిధుల క్రింద 15శాతం చొప్పున రాష్ట్ర ప్రభుత్వ పన్నుల నుండి నిధులు బదిలీ ఉండాలి. అలాగే ఈ నిధుల్లో జనాభా ప్రాతిపదికన 70శాతం గ్రామ స్థానిక సంస్థలకు, 30శాతం పట్టణ స్థానిక సంస్థలకు నిధుల పంపిణి ఉండాలి.

**మౌలిక సదుపాయాలకు 5 వేల కోట్లు -క్యాపిటల్ వ్యయం క్రింద 8 వేల కోట్ల గ్రాంటు** : రాష్ట్ర ప్రభుత్వ కన్‌సాలిడేటెడ్ ఫండ్ నుండి స్థానిక సంస్థలకు గ్రాంట్స్ రూపంలో ఏడాదికి 5 వేల కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు క్యాపిటల్ వ్యయం క్రింద 8 వేల కోట్లు ఇవ్వాలని సిఫార్సు చేయాలి. గత రెండు

> " స్థానిక సంస్థలకు బదిలీ చేయబడిన వివిధ రకాల పన్నులు, పన్నేతర ఆదాయాలపై తప్పని సరిగా స్థానిక సంస్థలకే అధికారం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం గాని, ఆ నిధులను తన అవసరాలకు వినియోగించుకోవడం గాని చేయరాదు. "

దశాబ్దాల నుండి రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగా నిధులు బదిలీ చేయకపోవడంతో స్థానిక సంస్థలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపధ్యంలో గ్రాంట్లు, అభివృద్ధి నిధులు 2023-24 మరియు 2024-25 ఆర్థిక సంవత్సరాలకు కూడా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**తలసరి గ్రాంటు :**నాల్గవ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన తలసరి గ్రాంటు పెంపును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. దీనిని నేటి అవసరాలకు తగిన విధంగా, ఇతర రాష్ట్రాలను కూడా పరిగణ లోకి తీసుకొని తలసరి గ్రాంటును పెంపుదల చేయాలి. కనీసం గ్రామ పంచాయతీలకు తలసరి గ్రాంటు రూ. 25 నుండి రూ.150లకు, మండల ప్రజాపరిషత్తులకు రూ.50 నుండి రూ.150లకు, జిల్లా ప్రజాపరిషత్తులకు రూ.25 నుండి రూ.150లకు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.50 నుండి రూ.200లకు పెంచుతూ ఆదేశాలు ఇవ్వాలి. స్థానిక సంస్థలకు విద్య, ఆరోగ్య గ్రాంట్స్ కూడా కేటాయించాలి.

**మంచినీరు - భూగర్భ డ్రైనేజ్:** నిర్ధిష్టకాల పరిమితితో రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయితీలకు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో మంచినీరు, భూగర్భ మురుగునీటి కాలువల వ్యవస్థ ఏర్పాటుకు, అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సిఫార్సు చేయాలి. ప్రతి ఇంటికి నీటి కుళాయి కనక్షన్‌తో పైపు లైన్ ద్వారా శుద్ధి చేసిన మంచినీరు అందించాలి. ప్రతి ఇంటికి రోజుకు 750 లీటర్ల మంచినీటి సరఫరా గ్యారెంటీ చేయాలి. నెలకి 25 వేల లీటర్లు వరకు ఉచితంగా మంచినీరు సరఫరా చేయాలి. ఫ్లోరైడ్, ఉప్పునీరు సమస్య ఉన్న గ్రామాలకు, ఉద్దానం ప్రాంత గ్రామాలకు సురక్షిత మంచినీరుకు ప్రత్యేక గ్రాంటు కేటాయించాలి.

**సొంత ఆదాయాల పెంపు :** స్థానిక సంస్థలకు బదిలీ చేయబడిన వివిధ రకాల పన్నులు, పన్నేతర ఆదాయాలపై తప్పని సరిగా స్థానిక సంస్థలకే అధికారం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం గాని, ఆ నిధులను తన అవసరాలకు వినియోగించుకోవడం గాని చేయరాదు. స్థానిక సంస్థల పరిధిలో ప్రజల మీద పన్నుల భారాలు మోపకుండా అదనపు ఆదాయ వనరుల బదిలీలను పరిశీలించి కనీసం ప్రస్తుత స్థానిక సంస్థల సొంత ఆదాయాల మెరుగుదలకు తగిన సిఫార్సులు చేయాలి. స్థానిక సంస్థల పరిధిలో ఉండే ఇసుక, ఖనిజాలు, గ్రావెల్ తదితర సహజవనరులను ఇతరులకు కేటాయించేటప్పుడు తప్పని సరిగా స్థానిక సంస్థల ఆమోదం తీసుకోవాలి. వాటి నుంచి వచ్చే ఆదాయంలో కనీసం 25శాతం స్థానిక సంస్థలకు వాటాగా ఉండాలి.

**పెసా చట్టం -గిరిజన ప్రాంతం- వెనుకబడిన ప్రాంతాలు :**రాష్ట్రంలో 5వ షెడ్యూల్ ఏరియాల్లో నివాసం ఉంటున్న గిరిజన పంచాయితీలకు, గ్రామాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలి. పెసా చట్టాన్ని తప్పని సరిగా అమలు చేయాలి. మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు కూడ ఈ గ్రాంటు వర్తింపు జేయాలి. అలాగే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, పశ్చిమ ప్రకాశం జిల్లాలకు కూడా ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలి. వెయ్యిలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు ఏడాదికి 10లక్షల చొప్పున అదనపు గ్రాంట్లు ఇవ్వాలి.

**వినోధపు, ప్రకటన పన్ను - జిఎస్‌టి:** నోధపు పన్ను, ప్రకటనల పన్నును జీఎస్‌టీ లో విలీనం చేయుటం వల్ల వందల కోట్ల రూపాయలు స్థానిక సంస్థలు నష్టపోతున్నాయి. ఈ పన్నులను పూర్తిగా స్థానిక సంస్థలకు తిరిగి ఇవ్వాలి. లేదా నష్టపరిహారంగా స్థానిక సంస్థలకు ఆ పరిధిలో వసూలు అయ్యే జిఎస్‌టిలో కనీసం 5 శాతం స్థానిక సంస్థలకు చెల్లించాలి. 2017-18 ఆర్థిక సంవత్సరం నుండి వసూలైన వినోదపు, ప్రకటనల పన్ను ఆదాయాన్ని మొత్తాన్ని స్థానిక సంస్థలకు చెల్లించాలి.

**వృత్తి పన్ను :** వృత్తి పన్ను పూర్తిగా స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. 2018 నుండి నేటి వరకు బకాయి పడ్డ వృత్తి పన్నును పూర్తిగా 2025-26 సం॥లో చెల్లించాలి.

**సర్‌ఛార్జీ :** భూముల బదలాయింపులపై వసూలు చేసే రిజిస్ట్రేషన్ & స్టాంపు డ్యూటీలపై విధించే సర్‌ఛార్జీలు గత నాలుగేళ్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటంలేదు. ఈ బకాయిలను వెంటనే స్థానిక సంస్థలకు చెల్లించాలి. వసూలు అయ్యే సర్‌ఛార్జీ ఆదాయాన్ని స్థానిక సంస్థలకు ప్రతినెల చెల్లించాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయ్యేతర భూమిగా మార్చేందుకు (నాలా చట్టం ) వసూలు చేసే పన్ను ఆదాయంలో స్థానిక సంస్థలకు 50శాతం ఇవ్వాలి.

**మోటర్ వెహికిల్ పన్ను :** రాష్ట్ర ప్రభుత్వం మోటర్ వెహికిల్ రిజిస్ట్రేషన్‌లపై విధించే పన్ను ద్వారా వేలకోట్ల రూపాయిలు ఆదాయం పొందుతుంది. చట్ట ప్రకారం ఈ ఆదాయంలో కొంతభాగం స్థానిక సంస్థలకు ఎప్పటికప్పుడు బదిలీ చేయాలి.

**పరిశ్రమలపై ఆస్తిపన్ను :** ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు, ఎస్.ఇ.జెడ్‌లు, ఎపిఐఐసిలు, ఇతర సర్వీసుల మీద ఆస్తిపన్ను విధించే పూర్తి అధికారం స్థానిక సంస్థలకు ఇవ్వాలి. ప్రసుత్తం ప్రభుత్వ రంగ సంస్థలు కూడా కొన్ని అనగా రైల్వే, ఎయిర్ పోర్టులు, డిఫెన్స్ వంటి అనేక సంస్థలు ఆస్తిపన్ను చెల్లించటంలేదు. 33శాతం సర్వీసు ఛార్జీ వసూలు చేయాలనే ప్రభుత్వ నిబంధనను రద్దుచేయాలి. 100 శాతం ఆస్తిపన్ను చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ ఆస్తిపన్ను రాయితీ ఇస్తే స్థానిక సంస్థలకు జరిగే నష్టాన్ని నష్టపరిహారంగా జమ చేయాలి. పరిశ్రమలను నోటిఫైడ్ ఏరియాలుగా ప్రకటించే చర్యలు ఉపసంహరించాలి.

**సిఎఫ్ఎంఎస్ నుండి స్థానిక సంస్థల మినహాయింపు:** రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కాంప్రహెన్సివ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సిఎఫ్‌ఎంఎస్) నుండి స్థానిక సంస్థలను మినహాయించాలి. స్థానిక

సంస్థల పన్ను, పన్నేతర ఆదాయాలు పూర్తిగా స్థానిక సంస్థల అకౌంట్స్‌లోనే జమ అవ్వాలి. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, ఇతర మ్యాచింగ్ గ్రాంట్స్ వచ్చిన 15రోజుల లోపు స్థానిక సంస్థల అకౌంట్లకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను ఎట్టి పరిస్థితుల్లోను తన బడ్జెట్ అవసరాలకు వినియోగించుకోరాదు.

**అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్ :** స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్, ఇతర సిబ్బంది అందర్నీ పర్మినెంట్ చేయాలి. వీరందరికి 010 పద్దు క్రింద వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. స్థానిక సంస్థలపై ఆర్థిక భారం లేకుండా చూడాలి. అలాగే ప్రస్తుతం ఈ తరగతి కార్మికులపై చెల్లించే వేతనాలపై సర్వీస్ ఛార్జీ క్రింద 18% వసూలు చేస్తున్నారు. దీనిని తక్షణం రద్దు చేయాలి.

**నష్టపరిహార చెల్లింపులు :** రాష్ట్ర ప్రభుత్వం వివిధ పరిశ్రమలకు, ఇతర వ్యాపార, వాణిజ్య, సర్వీస్ సంస్థలకు, ఇతర అనేక పేర్లతో భూములను కేటాయిస్తున్నది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఆస్తుల బదాలాయింపుపై రిజిస్ట్రేషన్ చార్జీలు, భూ బదలాయింపు ఛార్జీలు రద్దు చేస్తున్నది. ఇలాంటివి అనేకం. వీటి వల్ల స్థానిక సంస్థలు నష్టపోయే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నష్టపరిహారంగా చెల్లించాలి.

**అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీలు :** రాష్ట్రం లో సుమారు 20 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలున్నాయి. పట్టణాల్లో టౌన్‌ప్లానింగ్ డిపార్ట్‌మెంట్స్‌తో సమన్వయం

ఉండాలి. ఈ సంస్థలు రియల్ ఎస్టేట్‌లే ఆవుట్స్ ప్లాన్‌ల అనుమతి లేని లేఅవుట్‌ల క్రమబద్దీకరణ, ల్యాండ్‌పూలింగ్ ప్రాజెక్టులు, గృహ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల అమ్మకాలు, పార్కులు, స్టేడియంలు, వాణిజ్య సముదాయాలు, లీజులు, ఫీజులు తదితర వాటి ద్వారా వందల కోట్ల రూపాయల ఆదాయాలు ఆర్జిస్తున్నాయి. ఈ ఆదాయంలో కనీసం 25శాతం స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. అలాగే ఈ సంస్థల నుండి వచ్చే ఆదాయాన్ని ఆయా ప్రాంత పరిధిలో స్థానిక సంస్థలతో సమన్వయంతో ఉమ్మడి నిర్ణయంతో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించాలి.

**సబ్‌ప్లాన్ గ్రాంట్స్ :** ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ క్రింద నిధులు వారి జనాభా ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి. అలాగే ప్రణాళిక గ్రాంట్స్ నుండి కూడా ఈ పద్దుకు నిధులు ఇవ్వాలి. 2019-2024 కాలంలో ఆనాటి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ క్రింద నిధులు మంజూరు చేసి స్థానిక సంస్థలకు ఇవ్వలేదు. వీటిక్రింద చేసిన వ్యయాన్ని స్థానిక సంస్థలే భరించాయి. ఈ నిధుల బకాయిలను తప్పనిసరిగా 5వ ఆర్థిక సంఘం కాలంలో స్థానిక సంస్థలకు ఇవ్వాలి.

**విలువ ఆధారిత ఆస్తిపన్ను :** 2021లో ప్రవేశపెట్టిన క్యాపిటల్ విలువ ఆధారిత ఆస్తి పన్నును రద్దు చేయాలి. అద్దె ఆధారిత ఆస్తి పన్నును పునరుద్దరించాలి. ప్రతి ఏడాది ఆస్తిపన్ను 15% పెంచే నిర్ణయం రద్దు చేయాలి. ఆస్తి పన్నుకు మంచినీటి చార్జీలకు లింకు పెట్టి మంచినీటి చార్జీల ధర నిర్ణయించే పద్ధతి రద్దు చేయాలి. 60 చదరపు మీటర్లు స్థలంలో ఉన్న పేదల ఇంటి పన్నును పూర్తిగా రద్దు చేయాలి. 60 నుండి 75 చదరపు మీటర్ల స్థల విస్తీర్ణంలో ఉండే పేదల ఇళ్లకు ఆస్తిపన్నులో 50శాతం రాయితీ ఇవ్వాలి. బడ్జెట్ ప్రయివేట్ విద్యాసంస్థలకు ఆస్తి పన్నులో రాయితీ కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఆస్తి పన్ను, నీటి ఛార్జీలు తప్పనిసరిగా చెల్లించాలి.

**(మిగతా వచ్చే సంచికలో)**

# అదాని లాభాల కోసం ఆంధ్ర ప్రజలు భారాలు మోయాలా?

**(23వ పేజీ తరువాయి)**

రించింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అవసమైన విద్యుత్‌లో 10 శాతం సౌర విద్యుత్‌ను పెద్ద ప్లాంట్ల నుండి కొనుగోలు చేయాలని, ధర ఎక్కువైనా కొనాల్సిందేనని కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ చట్ట విరుద్ధమైన ఆదేశాలు జారీ చేయటం ద్వారా ఈ అవినీతికి అవకాశం కల్పించింది.

ఇపుడు చిత్రమైన పరిస్థితి నెలకొంది. మనదేశంలో అదాని, ఆయన సంస్థకు చెందిన అధికారులు అవినీతికి పాల్పడ్డారని అమెరికా అధికారులు కోర్టులో కేసు దాఖలు చేసినా, మనదేశంలో, మన రాష్ట్రంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని బాధ్యులు ఎవరూ అదాని అవినీతిని గురించి మాట్లాడటం లేదు. అదానితో తమకు సంబంధం లేదని, సెకితోనే తాము ఒప్పందం చేసుకన్నామని బుకాయిస్తున్నారు. జగన్మోహనరెడ్డి గారైతే తాను తక్కువ ధరకు విద్యుత్ కొన్నందుకు తనకు సన్మానం చేయాలని చెబుతున్నాడు. అదాని అవినీతిని కప్పిపెట్టి, అధికధరల భారాన్ని ప్రజలపై మోపటానికి అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి కుమ్మక్కైనాయి. ఇతర విషయాలలో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నట్లుగా నటిస్తూ, అదాని విషయంలో ఐక్యంగా వ్యవహరించటం వీరిరువురూ కలిసి రాష్ట్ర ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో తెలుపుతున్నాయి.

### ఇంత అధిక ధరలతో ఒప్పందాలు జరుగుతుంటే ఇఆర్‌సి ఏం చేస్తున్నట్లు?

విద్యుత్ రెగ్యులేటరి కమిషన్ ప్రజలపై భారాలు మోపటానికి మినహా ధరలను క్రమబద్దీకరించటానికి కాదని అనుభవం స్పష్టం చేస్తున్నది. థర్మల్, సౌర, వాయు, జల విద్యుత్ ఉత్పత్తికి ఎంత ఖర్చు అవుతున్నది, ఆ రంగాలలో వస్తున్న మార్పులేమిటి, ధరలు ఎంత మేరకు తగ్గుతున్నాయన్న అంశాలపై కమిషన్‌కు అవగాహన ఉండాలి కదా. అటువంటి అవగాహన లేకపోతే విద్యుత్ ధరలను ఎలా నిర్ణయిస్తారు? మరి అవగాహన ఉంటే అదాని విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేయటానికి కమిషన్ ఎలా అంగీకరించింది? అధిక ధరలకు కొనుగోలు చేసేటపుడు అభ్యంతరం చెప్పకుండా ఇపుడు ఆ భారాన్ని వినియోగదారులపై మోపటానికి పూనుకోవటం కమిషన్‌కు ఉన్న నైతికతను తగ్గిస్తున్నది.

పాలకుల చేతికి మట్టి అంటకుండా ప్రజలపై విద్యుత్ భారాలు మోపటానికి ఇఆర్‌సి సాధనం మినహా, ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించటానికి ఏ మాత్రం ఉపయోగపడదని రుజువు చేసుకుంటున్నది.

ఇటువంటి పరిస్థితులలో సెకితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, అదాని వద్ద ముడుపులు తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపివేయాలని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయటానికి పూనుకోవాలి. రాష్ట్రంలోని పాలకపార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీ అవినీతి ఒప్పందాలపై ఎటువంటి చర్యలు తీసుకోవటానికి సిద్ధం కాని పరిస్థితులలో ప్రజలే చొరవతో వ్యవహరించటం ద్వారా పాలకులకు బుద్ధి చెప్పాలి.

చర్చ

# సనాతనవాదులకు మాక్స్ ముల్లర్ అంటే ఎందుకంత ద్వేషం?

బొల్లోజు బాబా



రచయిత ప్రముఖ కవి, రచయిత. కాకినాడలో జువాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. సాహితీ యానం అనే బ్లాగు నిర్వహిస్తున్నారు.

**మా**క్స్ ముల్లర్ (1823–1900) జర్మనీలోని డెస్సౌ అనే ఊర్లో, 1823 డిశంబరు 6న జన్మించాడు. 1843లో సంస్కృతం, గ్రీక్, లాటిన్ ప్రాచీనభాషల అధ్యయనం లో లీవ్‌జిగ్ యూనివెర్సిటీనుండి డిగ్రీ పొందాడు. ప్రొఫెసర్ బ్రోఖాస్ వద్ద సంస్కృతం నేర్చుకొని 1844 లో మొదటగా హితోపదేశ అనే సంస్కృత గ్రంథాన్ని ఇంగ్లీషులోకి అనువదించాడు. వేదాలను అనువదించటం కొరకు రాతప్రతులను సేకరించటం మొదలుపెట్టాడు.

### ముల్లర్ ఏం చేసాడు?

మాక్స్ ముల్లర్1848 లో ఆక్స్‌ఫర్డ్ లో స్థిరపడ్డాడు. ఆక్స్ ఫర్డ్ యూనివెర్సిటీలో ప్రాచీన భారతీయ భాషల అధ్యయన కేంద్రానికి ఇతను వ్యవస్థాపకుడు. ఋగ్వేద అనువాదం మొదటి సంపుటిని “ఋగ్వేద సంహిత” పేరుతో 1849 లో వెలువరించాడు. కొన్నేళ్ళకు మరో ఐదు సంపుటాలు తీసుకొచ్చాడు. 1874 నాటికి ఋగ్వేద అనువాదం పూర్తయింది. ఇతర వేదాలపై వ్యాసాలు రాసాడు తప్ప పూర్తి అనువాదం చేయలేదు.

ముల్లర్ రచనల ద్వారా యూరోపియన్ సమాజంలో హిందూమతం పట్ల ఆసక్తి పెరిగింది. సంస్కృత భాషపై ముల్లర్ చేసిన రచనలలో “సంస్కృత అధ్యయన హాండ్‌బుక్”, “సంస్కృత–ఆంగ్ల డిక్షనరీ, గ్రామర్” లాంటి పుస్తకాలు అప్పట్లో సంస్కృతం నేర్చుకోవాలనుకొనే వారికి ఎంతగానో ఉపయోగపడేవి.

సంస్కృత సాహిత్యాన్ని సరైన దృక్పథంతో అధ్యయనం చేస్తే గొప్పమానవీయ విలువలు కనిపిస్తాయి. గ్రీకు సాహిత్యం కూడా మనకు బోధించలేని పాఠాలు దానిలో దాగి ఉన్నాయి అని ముల్లర్ సంస్కృత వాఙ్మయాన్ని ప్రశంసించే వాడు.

హిందు, బౌద్ధ, జైన, ఇస్లామ్ మతాలకు చెందిన గ్రంథాలను “తూర్పు దేశాల పవిత్ర గ్రంధాలు” అనే పేరుతో 50 సంపుటాలుగా ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ తీసుకొని వచ్చింది. వీటికి ముల్లర్ ఎడిటర్గా వ్యవహరించాడు.

మాక్స్ ముల్లర్ ప్రపంచ మతాల తులనాత్మక అధ్యయనానికి ఆద్యుడు. 1856లో “తులనాత్మక పురాణ శాస్త్రాలు” పేరుతో ముల్లర్ ప్రతిపాదించిన కొత్త రీసెర్చ్ ప్రక్రియకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరు వచ్చింది. వివిధ సంస్కృతుల మధ్య సంబంధాలను, వాటి పరిణామక్రమాన్ని తులనాత్మక విశ్లేషణ చేయటం ద్వారా వాటి చారిత్రిక సంబంధ బాంధవ్యాలను అంచనా వేయవచ్చు అనేది అతని ఆలోచన. ఉదాహరణకు ఈ పద్దతిలో, భిన్న నాగరికతలలో సూర్యుడిని ఏ విధంగా దర్శించారో గమనించటం ద్వారా ఆయా నాగరికతల చారిత్రిక పరిణామాన్ని పోల్చవచ్చుననేది ఇతని ప్రతిపాదన.

ముల్లర్ ద్వారా భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రపంచానికి పరిచయం అయ్యాయి. భాష, పురాణాలు, మతం ఈ మూడింటి ద్వారా మానవ ఆలోచనా పరిణామాన్ని పట్టుకోవటానికి ఇతను ప్రయత్నించాడు. ఋగ్వేద అనువాదం ముల్లర్‌కు గొప్ప పేరు తీసుకొచ్చింది.

### వేదాల్లో ఏమున్నాయి?

వేదాలను ప్రమాణంగా అంగీకరించేవారు, వేదాలను వ్యతిరేకించేవారు అనే రెండు సమూహాలుగా ప్రాచీన భారతదేశం విడిపోయింది. వేదాలను అంగీకరించినవారిని వేదావలంబులు/హిందువులు అని, తిరస్కరించిన బౌద్ధ, జైన, ఆజీవిక, చార్వాక, కాపాలిక విశ్వాసులను “వేద బాహ్యులు” అనీ విభజించారు. వేదాలు మనుష్యులెవరూ రాయనివి అంటారు.

వేదాలు నాలుగు. ఋగ్వేదంలో దేవతల కీర్తనలు, యజుర్వేదంలో యజ్ఞముల నిర్వహణా విధానం, సామవేదంలో పాడుకొనేందుకు వీలుగా మలచిన కీర్తనలు, అథర్వణవేదంలో క్షుద్రశక్తులకు సంబంధించిన మంత్రాలు ఉన్నాయి.

ఈ నాలుగు వేదాలనే మరలా నాలుగు భాగాలుగా చేసారు. అవి సంహితలు (మంత్రాలు), బ్రాహ్మణాలు (క్రతువుల విధానాలు), ఆరణ్యకాలు (వేదాంత చర్చలు) ఉపనిషత్తులు (ఆధ్యాత్మిక బోధనలు). ఇవీ వేదాలలో ఏమున్నాయి అనే ప్రశ్నకు పండితులు ఇచ్చే స్థూల వివరణ.

వేదాలను దళిత బహుజన దృక్పథంతో తరచి చూసినపుడు ఈనాటి అనేక సామాజిక అవ్యవస్థలకు మూలాలు వేదసాహిత్యంలో ఉన్నాయని అర్ధమౌతుంది. వాటిలో...

### 1. నిచ్చెన మెట్ల వర్ణవ్యవస్థ:

వేదాలపై ప్రధాన విమర్శ నిచ్చెనమెట్ల వర్ణవ్యవస్థను ప్రతిపాదించి, సమాజంలో దానిని స్థిరపరచటం. ఋగ్వేదంలో పురుష సూక్తంలో భగవంతుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజములనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు ఉద్భవించారని చెప్పబడింది. దీని ఆధారంగా సమాజం భిన్న అంతస్థులుగా విభజింపబడింది. శూద్రులు పై మూడు వర్ణాలవారిని సేవించుకోవాలని చెప్పబడింది. ఈ నాలుగు వర్ణాలకు వెలుపల చంఢాలురు (అస్పృశ్యులు) ఉంటారు. నేటికీ కూడా సమాజంలో అవే విభజనలు కొనసాగటానికి వేదాలే కారణమని డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా పూలే లాంటి ఆధునిక కుల వ్యతిరేక మేధావులు విమర్శించారు.

**2. కర్మకాండలకు ప్రాధాన్యత:**

వేదాలలో యజ్ఞయాగాదులకు, కర్మ కాండలకు విపరీతమైన ప్రాధాన్యత ఉండటం, ఆ ప్రక్రియలో జరిగే అసంఖ్యాకమైన జంతు బలులలో ఉండే హింసను, అశాస్త్రీయతను– బౌద్ధం, ఆజీవికం, చార్వాకం లాంటి మతాలు వ్యతిరేకించాయి.

**3. స్త్రీలు, శూద్రులకు స్థానం లేదు:**

ఈ వైదిక కర్మకాండలలో స్త్రీలకు, శూద్రులకు ఏ రకమైన పాత్ర లేకపోవటం కూడా వేదాలపట్ల ఒక విమర్శ.

**4. అనార్యప్రజలపై దాడి, వారి నగ రాల దహనం:**

వేదాలు ఆర్యుల సాహిత్యం. ఆర్యులు క్రీ.పూ. 2000 కాలంలో పొంటిక్ స్టెప్పీ (ఉక్రెయిన్, రష్యా, కజకిస్తాన్) ప్రాంతాలనుంచి భారతదేశంలోకి ప్రవేశించిన సంచార జాతులు. వీరు భారతదేశం రావటానికి ముందే ఇక్కడ స్థానిక ప్రజలు వేల సంవత్సరాలుగా హరప్పా నాగరికతను నిర్మించుకొన్నారు. ఇది మూలవాసుల సంస్కృతి.

ఈ ఆర్యులు తాము రాసుకొన్న వేదాలలో శత్రువుల పురాలను/మూలవాసుల నగరాలను నాశనం చేయమని ఇంద్రుని ప్రార్థించే సూక్తాలు అనేకం ఉన్నాయి. ఇంద్రునికి పురందరుడు (నగరాలను ధ్వంసం చేసేవాడు) అని పేరు. ఈ దేశ మూలవాసులైన అనార్య స్థానిక తెగలకు చెందిన వ్యక్తులను అసురులు, దస్యులు అని వేదాలలో పిలిచారు

ఇంద్రుడు 30 వేలమంది దాసుల్ని., వృత్రాసురుడిని చంపినట్లు ఋగ్వేదంలో ఉంది. (4.30.210). మధ్య ఆసియానుంచి వలస వచ్చిన ఆర్యులు స్థానిక హరప్పా నగరాలను, ప్రజలను ధ్వంసంచేయటంగా ఈ ఉదంతాలను అర్థం చేసుకోవాలి.

శత్రువుల గర్భంలోని పిండాలను కూడా నాశనం చెయ్యాలని దేవతలను కోరుతూ ఆర్యులు రాసిన సూక్తులు వేదాలలో ఉన్నాయి. అనార్య రాజైన శంబరాసురుడు తమ సంస్కృతిని కాపాడుకోవటం కొరకు ఇంద్రునితో పోరాడినట్లు వేదాలలో ఉంది.

ఆవిధంగా ఆర్యులు స్థానిక అనార్యులపై సాగించిన దండయాత్రలు వేదాలలో విపులంగా వర్ణించబడ్డాయి. ఆర్యులు స్థానికులపై దండయాత్ర జరిపినట్లు చెప్పటానికి వేదాలే గొప్ప సాక్ష్యం. వారి వంశవృక్షాన్ని సూచించే "ఆర్‌ఐ హాప్లో గ్రూప్"జన్యువు పై సాగించిన ఆధునిక ప్రయోగాలు కూడా ఆర్యుల వలస జరిగినట్లు నిర్ధారిస్తున్నాయి.

> **" హిందూ పండితులు వేదాలను, సంస్కృ త భాషను దాదాపు మూడు వేల సంవత్స రాలనుండి కాపాడుకొంటూ వచ్చారు. వేదా లను శూద్రుల ఎదుట చదవరాదని, ఎవరైనా శూద్రుడు వేదాలను వింటే వారి చెవుల్లో సీసం పొయ్యాలని లాంటి ఆంక్షలు విధించి వేదా లను తమకు మాత్రమే చెందిన రహస్యసొత్తుగా నిలుపుకొన్నారు. 1783 లో సుప్రీమ్ కోర్టు జడ్జ్ విలియం జోన్స్ సంస్కృతం నేర్చుకోవటానికి ప్రయత్నిం చగా, బ్రాహ్మణులు ఎవరూ నేర్పటానికి అంగీక రించలేదు. "**

**సనాతన పండితుల అభ్యంతరాలు ఏమిటి?**

**1. రహస్యం బట్టబయలు:**

హిందూ పండితులు వేదాలను, సంస్కృత భాషను దాదాపు మూడు వేల సంవత్సరాలనుండి కాపాడుకొంటూ వచ్చారు. వేదాలను శూద్రుల ఎదుట చదవరాదని, ఎవరైనా శూద్రుడు వేదాలను వింటే వారి చెవుల్లో సీసం పొయ్యాలని లాంటి ఆంక్షలు విధించి వేదాలను తమకు మాత్రమే చెందిన రహస్యసొత్తుగా నిలుపుకొన్నారు.

1783 లో సుప్రీమ్ కోర్టు జడ్జ్ విలియం జోన్స్ సంస్కృతం నేర్చుకోవటానికి ప్రయత్నించగా, బ్రాహ్మణులు ఎవరూ నేర్పటానికి అంగీకరించలేదు. అతను ఒక అబ్రాహ్మణ వైద్యుని వద్ద నేర్చుకొన్నాడు. 1786 నాటికి సంస్కృత గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించగలిగే ప్రావీణ్యాన్ని సంపాదించగలిగాడు. మనుస్మృతిని జోన్స్ ఇంగ్లీషులోకి తానే అనువదించాడు.

వేదాలను అనువదించటం ద్వారా ఈ గుట్టును బట్టబయలు చేసాడు మాక్స్ ముల్లర్. హిందూమతానికి ఆయువుపట్టైన ఈ వేదాలలో ఏముందో ప్రజలందరూ తెలుసుకొని బ్రాహ్మణులు ఇన్ని శతాబ్దాలుగా ఈ సమాజంపై తమ ఆధిపత్యం నిలుపుకోవటం కొరకు ఎన్నెన్ని పన్నాగాలు పన్నారో అందరికీ తెలిసిపోయింది. ఈ అవమానకర పరిస్థితులను ఎదుర్కోవటానికి– మాక్స్ ముల్లర్ వేదాలను తప్పుగా అనువదించాడని, వలసవాదుల కోణంలోంచి చూస్తూ పవిత్రమైన వేదాలకు, అందులోని రహస్యాలకు వక్రభాష్యం చెప్పాడని, లక్షల సంవత్సరాల భారతీయ చారిత్రిక కాలక్రమాన్ని తప్పుగా చూపాడని సనాతన పండితులు వాదించటం మొదలుపెట్టారు.

వేదాలలో గొప్ప గొప్ప సంగతులు ఉన్నాయని, ఆధునిక బహుజన మేధావులు చెబుతున్నట్లు అందులో అనార్యుల అణచివేత, వర్ణవ్యవస్థమూలాలు లాంటి విషయాలు ఏమీ లేవని ఇంకా వంచించేందుకే సనాతన పండితులు ఇలాంటి వాదనలు చేస్తున్నారని సులువుగానే అర్థం చేసుకొనవచ్చును.

**2. వేదాలలో అన్నీ ఉన్నాయష:**

వేదాలలో ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన అనేక అంశాలు శ్లోకాల రూపంలో ఉన్నాయని సనాతన పండితులు ప్రచారం చేస్తారు. పైథాగరస్ సిద్ధాంతము, అణుబాంబు తయారీ, కాంతివేగము, పుష్పక విమానాల తయారీ, కాస్మాలజీ, క్వాంటం థీరి, ఖగోళ భౌతిక శాస్త్రము, ఆధునిక వైద్యం, గణితశాస్త్ర సిద్ధాంతాలు లాంటి అనేక శాస్త్రీయ విషయాలు సంకేతరూపంలో వేదశ్లోకాలలో నిక్షిప్తం చేయబడ్డాయి అని వాదిస్తారు. మాక్స్ ముల్లర్ అనువాదాలలో ఇలాంటి అంశాలపై కనీస ప్రస్తావనలు లేకపోవటం ఇతని పట్ల సనాతన పండితుల ఓర్వలేనితనానికి ఒక కారణం కావొచ్చు.

అలాగని ఈ పండితులు వేదాలలో ఉన్నట్లు చెబుతున్న ఈ అంశాలపై సైంటిఫిక్ జర్నల్స్‌లో పేపర్స్ రాసి అంతర్జాతీయ శాస్త్రవేత్తల అంగీకారం పొందారా అంటే అదీ లేదు. ఈనాటికి కూడా వేదాలలో అన్నీ ఉన్నాయి అంటూ మాటలు చెబుతారు

**3. మాక్స్ ముల్లర్ వలసవాద ఏజంటా?**

మాక్స్ ముల్లర్ పై సనాతన పండితులు చేసే మరొక అభియోగం ఏమిటంటే– వేదాలపై భారతీయులకు విశ్వాసం కోల్పో యేలా అనువదించటానికి బ్రిటిషర్స్ ముల్లర్‌ను నియమించారని. దీనికి ఆధారంగా ముల్లర్ తన భార్యకు 1867, డిసెంబర్ 9న రాసిన ఒక లేఖలో "వేదాలపై హిందువులకు విశ్వాసం తగ్గిపోయే విధంగా వాటిని అనువదించడానికి నన్ను నియమించారు" అని రాసినట్లు ఒక అబద్ధాన్ని చెబుతారు.

నిజానికి ఆ లేఖలో పైన చెప్పిన వాక్యాలు లేవు. It is the root of their religion, and to show them what that root is, I feel sure, the only

**❝ వేదాలకు మాక్స్ ముల్లర్ చేసిన అనువాదం మొదటిదీ కాదు, చివరదీ కాదు. రాజారామ్మోహన్ రాయ్ ముల్లర్ కన్నా ముందే 1835 నాటికే వేదాలలోని కొన్ని భాగాలను ఇంగ్లీషు లోకి అనువదించాడు. మాక్స్ ముల్లర్ తరువాత, రాల్ఫ్ గ్రిఫ్ఫిత్, ఎ.బి. కీత్, అరబిందో, దయానంద సరస్వతి, ఎస్. రాధా కృష్ణన్, పి. లాల్, స్వామి ప్రభుపాద, వెండీ డోనిగెర్, స్వామి శివానంద లాంటి అనేక మంది వేదాలను పూర్తిగానో, కొద్ది భాగాలనో అనువదించారు. వీటిలో స్వదేశీయులు చేసి నవి కూడా ఉన్నాయి. ❞**

way of uprooting all that has sprung from it during the last 3,000 years అనే వాక్యాలు ఉన్నాయి. ఈ వాక్యాలలో – మూడువేల సంవత్సరాలుగా వేదాల చుట్టూ పేరుకొన్న అభూతకల్పనలని, చెత్తా చెదారాన్ని తొలగించి నిజమైన సత్యాన్ని భారతీయులకు చూపటమే నా లక్ష్యం అని ముల్లర్ భావంగా అర్థం చేసుకోవాలి. ఈ విషయం భారతీయులు తెలుసుకొనే సమయానికి నేను జీవించి ఉండకపోవచ్చును అని కూడా అంటాడు. అలాంటి ఉదాత్తమైన వాక్యాన్ని సనాతన పండితులు వక్రీకరించారు.

నిజానికి వేదాలను అనువదిస్తూ ముల్లర్ ఎంతో ఉద్వేగాన్ని ఆథ్యాత్మిక అనుభవాలను పొందినట్లు తనపుస్తకాల ముందుమాటలలో, ఉత్తరాలలో, ప్రసంగాలలో చాలా సార్లు చెప్పాడు. "భారత దేశం:మనకు నేర్పుతున్నదేమిటి?" (India, What can it Teach us, 1882) పుస్తకంలో సంస్కృత వాఙ్మయం గ్రీకు కన్న గొప్పది అని ప్రశంసించాడు. బున్సెన్ అనే మిత్రునికి రాసిన ఒక లేఖలో "వేదాలను చదువటం నాకెంతో ఆనందకరం. అవి నాకు ఉదయపు వెలుగులా, స్వచ్ఛమైన మలయమారుతంలా ఎంతో తేటగా, సత్యవాక్కులా అనిపిస్తాయి" అంటూ ముల్లర్ తాను వేదాలను చదవటంద్వారా పొందిన పరవశతను చెప్పాడు. ముల్లర్ ఈ పనిని వేదాలపై గౌరవంతో చేసాడు తప్ప ఎవరినో మోసగించటానికి కాదు.

**4. ముల్లర్ అనువాదం విశ్వసనీయ మైనది కాదా?**

ఈ వాదన చేసింది– ఆర్యసమాజ స్థాపకుడైన దయానంద సరస్వతి, బాలగంగాధర తిలక్, అరబిందో వంటి వారు. వీరు, వేదాలు అనేవి ఆథ్యాత్మిక అనుభవాలు. ప్రతీ శ్లోకం వెనుక అనేక పొరలలో అర్థాలు ఉంటాయి. వేదాలను ప్రాచీనమానవుని ప్రార్థనలుగానో, ఇంద్రుడు అగ్ని వాయు లాంటి దేవుళ్ళను ఉత్త ప్రాకృతిక శక్తులుగానో చూడరాదు అని వాదించారు.

ఈ సందర్భంగా ఎనిమిదోశతాబ్దపు జైనకవి అయిన ఉద్యోతన సూరి చెప్పిన "పదాలకు నానార్థాలతో, వాక్యనిర్మాణానికి వందల మెలికలతో అర్థం చేసుకోవటానికి కష్టంగా ఉంటుంది సంస్కృత భాష" అనే మాటలు ప్రస్తావనార్హం. భాష కారణంగా వేదాలకు భిన్న భాష్యాలు చెప్పే అవకాశం ఏర్పడింది. మూడువేల సంవత్సరాలుగా చేస్తున్న భిన్న వ్యాఖ్యానాల వల్ల వేదాలలో అన్నీ ఉన్నాయష అనే నానుడి స్థిరపడిపోయింది.

మాక్స్ ముల్లర్ వేదాలను భిన్నపొరలలో చూడలేదు. వాటిని "భౌతిక దృష్టితో చూసి చారిత్రిక కోణంలోంచి" అనువదించాడు. ఇది యురోపియన్ శాస్త్రీయ పద్ధతి. ఈ పని చేయటానికి ముల్లర్ తన పూర్తి జీవితాన్ని ధారవోసాడు. అలా శాస్త్రీయంగా వేదాలను అనువదించటం సనాతన పండితులకు నచ్చలేదు.

వేదాలకు మాక్స్ ముల్లర్ చేసిన అనువాదం మొదటిదీ కాదు, చివరదీ కాదు. రాజారామ్మోహన్ రాయ్ ముల్లర్ కన్నా ముందే 1835 నాటికే వేదాలలోని కొన్ని భాగాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. మాక్స్ ముల్లర్ తరువాత, రాల్ఫ్ గ్రిఫ్ఫిత్, ఎ.బి. కీత్, అరబిందో, దయానంద సరస్వతి, ఎస్. రాధా కృష్ణన్, పి. లాల్, స్వామి ప్రభుపాద, వెండీ డోనిగెర్, స్వామి శివానంద లాంటి అనేక మంది వేదాలను పూర్తిగానో, కొద్ది భాగాలనో అనువదించారు. వీటిలో స్వదేశీయులు చేసి నవి కూడా ఉన్నాయి.

వేదాలకు ఇన్ని స్వదేశీ అనువాదాలు ఉండగా మాక్స్ ముల్లర్ పేరు సనాతన పండితులు పదే పదే చర్చలోకి ఎందుకు తీసుకొని వస్తారంటే– మాక్స్ ముల్లర్ శాస్త్రీయ దృష్టితో అనువదించటమే కాక వేదాలకు చారిత్రిక కాలనిర్ణయం చేసాడు. వేదాలను రచించిన ఆర్యులు విదేశీయులు అని ప్రతిపాదించాడు. ఇవి రెండూ ముల్లర్‌ని నేటికీ ద్వేషించటానికి బలమైన కారణాలు. ఈ రోజు జన్యుపరీక్షలు అందిస్తున్న విజ్ఞానం ప్రకారం ఈ రెండు విషయాలు సత్యాలుగా నిరూపిత మవుతూండటం మాక్స్ ముల్లర్ ద్రష్టత్వానికి, మేధస్సుకు గొప్ప నిదర్శనం.

**ఆర్యుల దాడి సిద్ధాంతం, వేదకాల నిర్ణయం**

భాషలను, సంస్కృతులను, మతాలను ముల్లర్ తులనాత్మక అధ్యయనం చేసాడు. ఆ పరిజ్ఞానంతో వేదాలను రచించిన ఆర్యులు మధ్య ఆసియా నుంచి క్రీ.పూ. 1500లో భారత ఖండంలోకి ప్రవేశించి ఉంటారని ప్రతిపాదన చేసాడు. అలా వచ్చిన ఆర్యులు తమతో పాటు వేద సంస్కృతిని, సంస్కృత భాషను ఉత్తరభారతదేశంలోకి తీసుకొని వచ్చారని అన్నాడు. ఆ ప్రకారం చూసినప్పుడు వేదాలలో అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదం క్రీ.పూ. 1500–1200 మధ్య రాయబడి ఉంటుందని ముల్లర్ అభిప్రాయపడ్డాడు.

అది సనాతన పండితులకు అంగీకారం కాలేదు. ఎందుకంటే వేదాలు కనీసం క్రీ.పూ. 5000 నాటివి అని వీరి విశ్వాసం. అంతేకాక ఆర్యులు స్వదేశీయులు అని, బయటనుంచి వలస వచ్చిన వారు కారని వాదిస్తారు.

**ఆధునిక అవగాహన**

ఈ రోజు ఒక జన్యువు వివిధ జనాభాలలో వివిధ కాలాలలో ఎలా ప్రయాణం చేసింది అనే విషయం చాలా సులువుగా మేపింగ్ చేయగలుగుతున్నారు. ఈ ప్రాచీన డిఎన్ఎ అధ్యయనాల ద్వారా, క్రీ.పూ. 2000 కాలంలో పోంటిక్–కాస్పియన్ స్టెప్పీ (ఉక్రయిన్, రష్య, కజకిస్తాన్) ప్రాంతాలనుంచి భారతదేశంలోకి యామ్నాయ స్టెప్పీ సంచారజాతులు ప్రవేశించారని తెలుస్తున్నది. వీరు ఋగ్వేద ఆర్యులు.

మధ్య ఆసియా నుంచి ఆర్యులు కీ.పూ. 1500లో భరతఖండంలోకి వలస వచ్చారని చెప్పిన ముల్లర్ ప్రతిపాదనతో ఈ ఆధునిక ఆవిష్కరణలు దాదాపు సరిపోలుతున్నవి. ఈ ఆర్యులు గుర్రాలపై వచ్చారు. వేదాలలో గుర్రాలమీద 200 శ్లోకాలు ఉన్నాయి. గుర్రాలు భారతఖండానికి చెందిన ఇండిజినస్ జంతువులు కావు. ఎక్సోటిక్ జంతువులు. అందుకే హరప్పానాగరికతలో ఎక్కడా గుర్రాల ముద్రలు కానీ, తవ్వకాలలో గుర్రాల అస్థిపంజరాలు కానీ కనిపించవు. ఈ సత్యం కూడా ఆర్యులు బయటనుండి గుర్రాలపై వలస వచ్చిన వారు అని ఋజువు చేస్తుంది.

వేదాలు క్రీ.పూ. 1500–1200 మధ్య రచింపబడి ఉంటాయని ముల్లర్

ఊహించాడు. ఇది కూడా సత్యదూరం కాదని ఇండో యూరో పియన్ భాషల ఆధునిక అధ్యయనాల ద్వారా తెలుస్తున్నది.

మాక్స్ ముల్లర్ వివిధ భాషలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన వ్యక్తి. ఇతనికి మధ్య ఆసియా ప్రాంతపు అవెస్తా భాషకు, సంస్కృత భాషకు గల పోలికలను గమనించాడు. వాటి ఆధారంగా సంస్కృత బాషమాట్లాడే ఆర్యులు, మధ్య ఆసియానుండి వలస వచ్చి ఉండవచ్చు అని ఊహించాడు. వేదాల లోపలి ఆధారాలు భీకరమైన దండయాత్రలను సూచించటాన్ని గుర్తించాడు. ఈ రెండు దృగ్విషయాలను కలిపి "ఆర్యుల దండయాత్ర" సిద్ధాంతంగా చెప్పాడు.

మాక్స్ ముల్లర్ కాలానికి జన్యుశాస్త్రం లేదు. జనాభాలలో జన్యువుల కదలికలను అంచనావేసే టెక్నాలజీ లేదు. భిన్నభాషల పదాల మధ్య సామ్యాలను వేగంగా పోల్చిచూడ గలిగే కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. అయినప్పటికీ ముల్లర్ వేదకాలం, ఆర్యుల దాడి సిద్ధాంతాల గురించి 90% సరైన ఊహ చేసాడు. జన్యు ఆధారాలనుబట్టి దీన్ని ఆర్యుల వలసగా నేడు అందరూ అంగీకరించినా, వేదాలలోని అంతర్గత ఆధారాలనుబట్టి దీన్ని ఆర్యుల దాడిగా సామాజిక శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. వేదాలను భౌతిక దృష్టితో శాస్త్రీయ అధ్యయనం చేయటం వల్ల ఇది సాధ్యమైంది. ఇది ముల్లర్ మేధోశ్రమకు సంకేతం.

### ఆర్యుల వలస సిద్ధాంతంతో ఏంటి సమస్య?

ఆర్యులు విదేశీయులైతే ఈ సనాతన పండితులు కూడా టర్కీనుంచి వచ్చిన తురకలతో సమానమౌతారు. భరతఖండం అంటే మేమే అని ఇన్నాళ్ళూ చెప్పుకొన్న వారికి ఇది చాలా అవమానకరమైన స్థితి. కనుక ఆరు నూరైనా నూరు ఆరైనా ఆర్యులవలస సిద్ధాంతం తప్పు అని నిరూపించటానికి పందేలుగా ప్రయత్నిస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా మాక్స్ ముల్లర్‌ను పంచింగ్ బాగ్‌లా వాడుకొంటూ ఆర్యులదాడి సిద్ధాంతాన్ని ఖండిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా హరప్పాలిపిలో సంస్కృత ఛాయలు ఉన్నాయని, హరప్పా సంస్కృతి వేద సంస్కృతే అని ప్రచారం ఎత్తు కొన్నారు.

రోజు రోజుకీ ఆధునిక జన్యుశాస్త్ర పరిశోధనల వలన ఆర్యుల వలస జరిగిందనే సత్యం బలంగా ఆవిష్కరింపబడుతున్నది. ఇది నేటి సనాతన పండితులకు మింగుడుపడక, "భారత్ బయట సిద్ధాంతం" (Out of India Theory) పేరుతో ఓ అబద్ధపు

> **" మాక్స్ ముల్లర్ కాలానికి జన్యుశాస్త్రం లేదు. జనాభాలలో జన్యువుల కదలికలను అంచనావేసే టెక్నాలజీ లేదు. భిన్నభాషల పదాల మధ్య సామ్యాలను వేగంగా పోల్చిచూడ గలిగే కంప్యూటర్ పరిజ్ఞానం లేదు. అయినప్పటికీ ముల్లర్ వేదకాలం, ఆర్యుల దాడి సిద్ధాంతాల గురించి 90% సరైన ఊహ చేసాడు. జన్యు ఆధారాలనుబట్టి దీన్ని ఆర్యుల వలసగా నేడు అందరూ అంగీకరించినా, వేదాలలోని అంతర్గత ఆధారాలనుబట్టి దీన్ని ఆర్యుల దాడిగా సామాజిక శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. "**

సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చి, ఆర్యులు భరతఖండంలో పుట్టినవారే, ఇక్కడనుంచి మధ్య ఆసియాకు వలస వెళ్ళి మరలా తిరిగి క్రీ.పూ. 1500లో భరతఖండంలోకి వెనక్కు వలస వచ్చారని గొప్ప అతి తెలివి వాదన ఒకటి మొదలుపెట్టారు.

హిందూ పండిత చరిత్రకారులు చెబుతున్న సిద్ధాంతాలను ప్రపంచవ్యాపిత ఇండాలజిస్టులు నమ్మటంలేదు. అదొక సంకట స్థితిగా మారింది సనాతనహిందూ చరిత్రకారులకు.

మరొక ఆశ్చర్యకరమైన అంశం– ఆర్యులుగా పిలవబడిన స్టెప్పీ వంశపారంపర్య (Steppe Ancestry) మూలాలు కలిగిన ప్రజలలో ఉండే ఆర్‌ఐ హాప్లోగ్రూప్ (R1 haplogroup) జన్యువు ఆధునిక భారత సమాజంలో బ్రాహ్మణులలో అధికంగాను క్రింది తరగతి ప్రజలలో తక్కువ శాతంగాను ఉన్నట్లు నేడు గుర్తించారు.

### ముగింపు

"మాక్స్ ముల్లర్ వశిష్ట మహాముని"– వివేకానందుడు.

వేదాలు రాసిన అత్యంత ప్రాచీనమైన తాళపత్ర రూపం 11 వ శతాబ్దానికి చెందినది. ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులైన విలియం జోన్స్, హెచ్. హెచ్. విల్సన్‌లు సేకరించి యురోపియన్ లైబ్రేరీలలో భద్రపరచిన ఋగ్వేద సంహిత అనే రాతప్రతి, 14 వ శతాబ్దపు సాయనాచార్యుడు ఋగ్వేదానికి చేసిన వ్యాఖ్యానాన్ని ప్రాతిపదికగా చేసుకొని ముల్లర్ తన అనువాదం సాగించాడు. తుదిప్రతి పరిష్కరణ సమయంలో భారతీయ సంస్కృత పండితుల సహాయం తీసుకొన్నాడు. మాక్స్ ముల్లర్ తన ముందుమాటలో – "వేదాలను అనువదించటానికి పాతికేళ్ళు కష్టపడ్డాను. ఆ అనువాదాన్ని పరిష్కరించి పుస్తకరూపంలో తీసుకురావటానికి ఇరవై ఏళ్ళు పట్టింది" అని చెప్పుకొన్నాడు. మొత్తం నలభై ఐదు ఏళ్ళు. అంటే మాక్స్ ముల్లర్ తన యావజ్జీవితాన్ని ఈ వేదాలను అనువదించటానికే వెచ్చించాడు.

వేదాలను అనువదించటానికి, ఒక పేజీకి నాలుగు పౌండ్ల చొప్పున మొత్తం 9 లక్షల రూపాయిలు ఈస్ట్ ఇండియా కంపనీ నుంచి మాక్స్ ముల్లర్ తీసుకున్నాడని, అది చాలా పెద్దమొత్తం అని సనాతనవాదులు ఆరోపిస్తారు. కానీ ఈ డబ్బు 45 ఏండ్లపాటు చేసిన విద్వత్సంబంధమైన పనికి పొందిన ప్రతిఫలం. దానిలోంచే పరిష్కరణ సమయంలో పెట్టుకొన్న సంస్కృత పండితులకు ఇచ్చిన జీతబత్యాలు ఖర్చు కూడా ఉంది.

స్వామి వివేకానంద 28, మే 1896 న మాక్స్ ముల్లర్ ను ఆక్స్ ఫర్డ్‌లో కలిసాడు. ఆ సమయంలో వారిరువురూ భారతీయ వేదాంతం, ఆధ్యాత్మికతలను చర్చించుకొన్నారు. అప్పటికే మాక్స్ ముల్లర్ వృద్ధాప్యానికి చేరుకొన్నాడు. వివేకానందకు ముల్లర్ పట్ల అపారమైన గౌరవం. అదే విధంగా ముల్లర్‌కు కూడా వివేకానందుడంటే అవ్యాజమైన ప్రేమ. వారి కలయికను వివేకానందుడు – "ఆ వృద్ధ దంపతులను చూస్తే ఏదో ఆశ్రమంలో నివసిస్తున్న వశిష్ఠుడు, అరుంధతిల వలే ఉన్నారు. మాక్స్ ముల్లర్ సాయనాచార్యుని పునర్జన్మ. నేను బయలుదేరినపుడు కనుల నిండా నీరు నింపుకొని ముల్లర్ నాకు వీడ్కోలు పలికారు. మాక్స్ ముల్లర్ తో సరితూగగల సంస్కృత పండితుడు భారతదేశంలో ఒక్కడు కూడా లేదు" అంటూ ఎంతో ఆర్ద్రంగా వర్ణించాడు.

మాక్స్ ముల్లర్, వివేకానందుడు సెక్యులరిజం అనే పదం వాడకపోయినా భారతీయ సమాజంలో సెక్యులరిజం అనే భావనలకు ఆద్యులు అంటారు.

నేటికీ సనాతన పండితులతో తిట్టించుకొంటున్న మాక్స్ ముల్లర్ తన జీవితకాలంలో ఇండియాకు రానే లేదు. తన పనంతా ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో ఉంటూ చేయటం ఒక కొసమెరుపు. చివరి దరహాసం ముల్లర్‌దే అవుతున్నది. ❋

చరిత్ర

# మధ్య యుగాలనాటి ఆర్థిక, సామాజిక జీవితం

## క్రీ.శ.800 -1200 మధ్య



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఎం.వి.ఎస్.శర్మ

మనం ఇంకా క్రీ.శ.1000, ఆ పైబడి చరిత్ర లోకి పోలేదు. అప్పటి రాజకీయ చరిత్ర ముందు ముందు తెలుసుకుందాం. కాని క్రీ.శ.800 నుండి 1200 మధ్య కాలపు ఆర్థిక, సామాజిక జీవితం, విద్య, మత విశ్వాసాలు వంటివి దాదాపు ఒకే తీరుగా ఉంటాయి. అందుచేత వాటిని ముందుగా తెలుసుకుందాం.

రాజకీయ జీవితంలో మార్పులు సాపేక్షంగా వేగంగా జరుగుతాయి. అదే ఆర్థిక. సామాజిక జీవితం, మత విశ్వాసాలు వంటివి అంత త్వరగా మార్పులు చెందవు. వాటిలో పాత కాలపు ధోరణులు కొనసాగుతూ వుంటాయి. అదే సమయంలో కొన్ని కొత్త ధోరణులు క్రమంగా చోటు చేసుకుంటాయి. అదే విధంగా క్రీ.శ.800 నాటి ఆర్థిక, సామాజిక జీవితంలో కూడా అంతకు పూర్వపు కాలంలోని ధోరణులు చాలావరకు కొనసాగాయి. అదే సమయంలో కొన్ని కొత్త ధోరణులు కూడా చోటు చేసుకున్నాయి.

**వర్తక వాణిజ్యాలు**

క్రీ.శ. 6వ శతాబ్దం వరకు పశ్చిమాన రోమన్ సామ్రాజ్యంతో భారత ఉపఖండపు రాజ్యాలకు వాణిజ్యం పెద్ద స్థాయిలో జరిగేది. అది లాభసాటిగా ఉండి బంగారం, వెండి పెద్ద మొత్తంలో భారతదేశానికి చేరేది. రోమన్ సామ్రాజ్యం మాదిరిగానే ఇరాన్ ప్రాంతంలో ఉండిన సస్సానిద్ సామ్రాజ్యంతో కూడా వాణిజ్యం బాగా సాగేది. ఇది కొంత భూభాగం గుండా, తక్కినది సముద్ర మార్గం గుండా సాగేది. క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి ఈ రెండు సామ్రాజ్యాలూ పతనం కావడంతో వాటితో జరిగే వాణిజ్యం బలహీనపడింది. బంగారు, వెండి నాణేలకు తీవ్రమైన కొరత ఏర్పడింది. దీని వలన దేశంలోని వ్యాపారం కూడా చిక్కుల్లో పడింది.

ఆ తర్వాత కాలంలో పశ్చిమాసియాలో, ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలో అరబ్బు సామ్రాజ్యాలు ఏర్పడి బలపడ్డాయి. ఆ ప్రాంతంలో బంగారం, వెండి బాగా లభించేది. దాంతో భారతీయ ఉత్పత్తులకు ఆ దేశాలలో మంచి గిరాకీ ఏర్పడింది. ముఖ్యంగా దుస్తులు, సువాసన ద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలకు బాగా గిరాకీ ఉండేది. దాంతో పశ్చిమ భారత ఉపఖండ సముద్ర తీరాన ఉండే రేవు పట్టణాలకు అరబ్బు వ్యాపారులు రాకపోకలు సాగించడం పెరిగింది. శ్రీలంక, జావా, సుమత్రా వంటి ఆగ్నేయ ఆసియా దీవులను అరబ్బులు 'సుగంధ దీవులు' అని పిలిచేవారు.

మన ఉపఖండంలో దక్షిణాదిన ఏర్పడిన రాజ్యాలు ఆగ్నేయ ఆసియాలోని దేశాలతో, చైనాతో వ్యాపారాన్ని బాగా పెంపొందించాయి. ఆ తర్వాత క్రమంగా ఉత్తరాది ప్రాంతంలోని రాజ్యాలు కూడా వాణిజ్యరీత్యా బలపడడం మళ్ళీ మొదలైంది. ముఖ్యంగా గుజరాత్, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలలో కొత్త పట్టణాలు సైతం ఏర్పడ్డాయి. ఈ ప్రక్రియను కాస్త వివరంగా తెలుసుకుందాం.

క్రీ.శ.7వ శతాబ్దం నాటికి భారత ఉపఖండం మొత్తం మీద జనాభా సుమారు 10 కోట్లు మాత్రమే. అత్యధిక భూభాగం అంతా అడవులతో, ఆటవిక జంతువులతో నిండివుండేది. ఆ అడవులలో ఆదిమ తెగల ప్రజలు జీవిస్తూండేవారు. ఆ అడవుల గుండా వర్తకులు తమ సరుకులతో ప్రయాణం చేసి తీర ప్రాంతాలనుండి ఉత్తర భారత ప్రాంతాలకు చేరడం చాలా పెద్ద సవాలుగా ఉండేది. ఎక్కువసార్లు ఆటవిక తెగల దాడులను వర్తకులు ఎదుర్కోవలసివచ్చేది. రోమ్ సామ్రాజ్యం పతనం తోబాటు ఈ కారణం కూడా ఉత్తర భారతంలో వాణిజ్యం క్షీణించడానికి దోహదం చేసింది.

వర్తకం క్షీణించడంతో వర్తకుల శ్రేణులు, లేదా సంఘాలు (పశ్చిమ యూరప్ లోని గిల్డుల మాదిరి) అంతకు పూర్వం ఉండిన ప్రాధాన్యతను కోల్పోయాయి. క్రమంగా ఈ శ్రేణులలో కొన్ని వైశ్యులలోని ఉపకులాలుగా మిగిలిపోయాయి. వ్యాపారులలో బలంగా వ్యాపించిన జైనం కూడా ఈ కాలంలో బలహీనపడింది.

వాణిజ్యం బలహీనపడడం కారణంగా ఆ ప్రభావం ఆనాటి మత ఆచారాలమీద, విశ్వాసాలమీద కూడా పడింది. ఉప్పు సముద్రాల మీద ప్రయాణం చేసినవారు, రాజ్య సరిహద్దులను దాటిన వారు భ్రష్టులుగా పరిగణించబడడం మొదలైంది. ఐతే, ఈ నిషేధాన్ని అందరూ పాటించారని చెప్పలేం. బ్రాహ్మణుల్లో ఎక్కువమంది దీనిని పాటించారు. కాని చాలామంది ఈ కాలంలో అరబ్బు దేశాలకు పర్యటించిన సందర్భాలు, వ్యాపారం చేసిన దాఖలాలు ఉన్నాయి. బహుశా తూర్పున బలంగా విస్తరించిన బౌద్ధం, పశ్చిమాన కొత్తగా తలెత్తిన ఇస్లాం మతాల ప్రభావంతో బ్రాహ్మణ మతం కొత్త సమస్యలను ఎదుర్కొంటుందన్న ఆందోళనలు ఈ నిషేధానికి వెనుక బాగా పని చేసివుండొచ్చు. ఆ మతాల భావజాలం ఇక్కడ ఉన్న కులవ్యవస్థను సవాలు చేస్తుందన్న సందేహాలు, దానివలన తమ ఆధిపత్యం దెబ్బ తింటుందన్న భయాలు పురోహిత వర్గాన్ని ఈ ఆంక్షలు విధించేలా ప్రేరేపించివుండాలి.

ఐతే దక్షిణాసియా, చైనాలతో విదేశీ వాణిజ్యాన్ని కొనసాగించడానికి ఈ ఆంక్షలేవీ ఆటంకంగా నిలవలేకపోయాయి. సముద్రాల మీద ఆనాటి వర్తకులు సాగించిన సాహసోపేత యాత్రలు, వారి ద్వారా వెల్లడైన ఆయా ప్రాంతాల భౌగోళిక వివరాలు, విశేషాలు సాహిత్యరూపంలో పొందుపరచడం జరిగింది. బృహత్కథాకోశం అన్న గ్రంథంలో

దక్షిణాసియా, చైనా ప్రాంతాల ప్రజల వేష భాషలు, అక్కడి వింతలు వివరించడం చూస్తాం. ఆ నాటి నావిక, వర్తకుల సాహస యాత్రలు తర్వాత కాలంలో వచ్చిన సింద్‌బాద్ సాహసయాత్రల కథలకు ప్రేరణగా నిలిచాయి. భారతీయ వర్తకులలో కొందరు ఈ దేశాలలో గిల్డులను ఏర్పాటు చేసుకున్నారు. మణిగ్రామ, నానాదేశి అనే రెండు గిల్డులు ప్రసిద్ధిచెందాయి. భారతీయ వర్తకులలో కొందరు స్థానికులనుండి మహిళలను పెళ్ళాడి అక్కడే స్థిరపడిపోయారు కూడా. వారి వెంటే పురోహితులు కూడా ఆ దేశాలకు తరలివెళ్ళారు. బౌద్ధ మతం తోబాటు హిందూ మతం కూడా ఈ ప్రాంతాలలో ప్రవేశించింది. మన ఉపఖండంలో పాటించే కొన్ని సాగు పద్ధతులను అక్కడి వ్యవసాయంలో ప్రవేశపెట్టారు. అన్నీ కలిసి అక్కడి ప్రాంతాల సంస్కృతిని, సమాజాన్ని ప్రభావితం చేశాయి.

(సంస్కృతి అనేది భౌగోళిక హద్దులకు పరిమితం అయి ఉండిపోదని, వివిధ ప్రాంతాల్లోని సంస్కృతులు ఆయా ప్రజల నడుమ పెంపొందే సంబంధాల ద్వారా కలిసి పరస్పరం ప్రభావితం అవుతాయని, సంస్కృతి ఒక్క మతంతోటే కట్టుబడివుండిపోదని చరిత్ర అనుభవాలు మధ్య యుగాలనాటికే స్పష్టం చేస్తున్నాయి. కాని ప్రస్తుత 21వ శతాబ్దంలో కూడా హిందుత్వ వాదులు ఒకే దేశం-ఒకే మతం-ఒకే సంస్కృతి వంటి అవాస్తవిక నినాదాలను ఇస్తూ ప్రజలలో భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. అంతటితో ఆగకుండా వాస్తవ చరిత్రనే తిరగరాస్తున్నారు. భవిష్యత్తు తరాల మీద ఈ దుష్ప్రభావం పడకుండా చూసుకోవడం కూడా అభ్యుదయవాదుల బాధ్యతే)

> “ జావా, సుమత్రా వంటి ప్రాంతాలకు నౌకలు ప్రధానంగా బెంగాల్‌లోని తామ్రలిప్తి రేవు నుండి రాకపోకలు సాగించేవి. ఇండోనేసియాను సువర్ణద్వీపం అని అప్పటి కథల్లో వర్ణించారు. మలయాలోని కేదాహను కటా2హ నగరం అనేవారు. భారత ఉపఖండాన్ని జంబూద్వీపం అని జావాలోని 14వ శతాబ్దపు రచయితలు వర్ణించారు. దక్షిణ భారతాన్ని కర్ణాటకం అని, బెంగాల్‌ను గౌడ అని వర్ణించారు. ”

జావా, సుమత్రా వంటి ప్రాంతాలకు నౌకలు ప్రధానంగా బెంగాల్‌లోని తామ్రలిప్తి రేవు నుండి రాకపోకలు సాగించేవి. ఇండోనేసియాను సువర్ణద్వీపం అని అప్పటి కథల్లో వర్ణించారు. మలయాలోని కేదాహను కటాహ నగరం అనేవారు. భారత ఉపఖండాన్ని జంబూద్వీపం అని జావాలోని 14వ శతాబ్దపు రచయితలు వర్ణించారు. దక్షిణ భారతాన్ని కర్ణాటకం అని, బెంగాల్‌ను గౌడ అని వర్ణించారు. గుజరాత్ నుండి కూడా వర్తకులు ఈ తూర్పు సముద్ర వ్యాపారంలో పాలు పంచుకున్నారు. రోమన్ సామ్రాజ్యం పతనం కావడంతో దెబ్బ తిన్న పశ్చిమ తీరపు సముద్ర వ్యాపారం తూర్పు తీర వ్యాపార ప్రాధాన్యతను పెంచింది. ఆఫ్రికా, పశ్చిమాసియా ప్రాంతాల నుండి వచ్చే సరుకులు ఎక్కువ భాగం మలబార్ ప్రాంతం వద్దే చెల్లిపోయేవి. అటు పశ్చిమాసియా, ఆఫ్రికా ప్రాంతాలకు, ఇటు ఆగ్నేయ ఆసియా, చైనా ప్రాంతాలకు నడుమ వాణిజ్య కేంద్రంగా దక్షిణ భారతం వ్యవహరించింది. ఋతుపవనాల గాలులు అనుకూలంగా ఉంటేనే సముద్రం మీద నౌకల ప్రయాణం సాగేది. నైఋతి, ఈశాన్య ఋతుపవనాలు వేరు వేరు దిశల్లో సాగుతాయి. అందుచేత పశ్చిమం వైపు నుండి తూర్పువైపు నేరుగా ఆఫ్రికా నుండి చైనాకు ఒకే ఊపులో ప్రయాణం చేయడం సాధ్యపడేది కాదు. రెండు ఋతుపవనాలకు మధ్య కాలంలో కొన్ని నెలల పాటు భారత ఉపఖండ రేవుల్లో ఓడలను నిలుపు చేయవలసివచ్చేది. ఇది అంత లాభసాటి కాదు. అందుచేత ఇతర దేశాల వర్తకులు దక్షిణ భారత రేవులను వాణిజ్య కేంద్రాలుగా ఉపయోగించవలసివచ్చింది. ఇందులో తమిళ, కళింగ, వంగ ప్రాంతాల వర్తకులు కీలక పాత్ర పోసించగలిగారు. మలబారు, బర్మా ప్రాంతాల అడవుల్లో లభించే టేకు కలపతో పటిష్టమైన నౌకలను నిర్మించగలిగే అవకాశం ఉండడం కూడా మన వర్తకులకు బాగా కలిసివచ్చింది.

చైనాలో లభించని అనేక సరుకులు ఈ వ్యాపారం వలన వాళ్ళు కొనుగోలు చేయగలిగేవారు. ఆగ్నేయ ఆసియా నుండి భారత దేశం నుండి సుగంధద్రవ్యాలు, లక్క, రకరకాల ఓషధులు, అగరొత్తులు, ఆఫ్రికానుండి ఏనుగు దంతాలు, పశ్చిమాసియా నుండి గాజు పరికరాలు కొనుగోలు చేసేవారు.

చైనాలో అప్పటి ప్రధాన ఓడరేవుల్లో కాంటన్ ఒకటి. బౌద్ధ పండితులు ఈ నౌకల ద్వారా చైనా-ఇండియాల మధ్య రాకపోకలు సాగించేవారు. చైనా రాజుల ఆస్థానాల్లో ఉన్న బౌద్ధపడింతులలో అత్యధికులు భారతదేశం నుండి వచ్చినట్టు క్రీ.శ. 10, 11 శతాబ్దాల నాటి చైనా రికార్డులు తెలియజేస్తున్నాయి. కాంటన్ పట్టణంలోనే బ్రాహ్మణ మతానికి చెందిన మూడు దేవాలయాలు ఉన్నట్టు తెలుస్తోంది. జపాన్ దేశానికి భారత ఉపఖండం నుంచి పత్తిని తెచ్చి పరిచయం చేసినది భారతీయ వర్తకులేనని, వాళ్ళు చైనాకు పయనమై, సముద్రపు గాలులు గతి తప్పినందున జపాన్ తీరానికి వచ్చారని, వారి ద్వారా జపనీయులు పత్తి వాడకం తెలుసుకున్నారని జపాన్ రికార్డులు తెలుపుతున్నాయి.

దక్షిణాదిన పల్లవ, చోళ ప్రభువులు బలమైన నౌకా దళాలను కలిగివున్నట్టు మనం ఇదివరకే చెప్పుకున్నాం. వీరితో బాటు బెంగాల్ తీరంలో పాల, సేన ప్రభువులు కూడా గట్టి నౌకా దళాలను కలిగివుండేవారు. దక్షిణ, తూర్పు సముద్ర తీరాలలో అనేక రేవు పట్టణాలతోబాటు నౌకా నిర్మాణ కేంద్రాలు కూడా ఉండేవి. అటు పశ్చిమాన గుజరాత్ ప్రాంతంలో కూడా ఉండేవి.

విదేశీ వాణిజ్యం ద్వారా పెద్ద మొత్తంలో బంగారం, వెండి తమ దేశం నుండి తరలి పోవడంతో చైనా చక్రవర్తులు ఆ తరలింపును నిరోధించడానికి పూనుకున్నారు. ఇటు అరబ్బులు, అటు చైనీయులు నౌకా నిర్మాణం మీద ఎక్కువ కేంద్రీకరించి పెద్ద, పటిష్టమైన ఓడలను నిర్మించారు. దాదాపు వెయ్యి మంది పట్టే అనేక అంతస్తుల ఓడలను చైనీయులు నిర్మించగలిగాచు. దిక్సూచి యంత్రాన్ని కనుగొని దాని సహాయంతో చైనీయులు తమ సముద్ర ప్రయాణ సామర్ధ్యాన్ని బాగా పెంచుకోగలిగారు. క్రమంగా ఈ సాంకేతికత అటు అరబ్బులకు కూడా అందింది. ఐతే మధ్యలో భారత ఉపఖండంలో ఈ కాలంలో శాస్త్ర సాంకేతికత పురోగమనానికి ఇక్కడి సామాజిక నిబంధనలు, ఆంక్షలు ఆటంకం కావడంతో మనం వెనుకబడిపోయాం. ఆ విధంగా సముద్ర వాణిజ్యం మీద మన ఆధిపత్యం తగ్గుముఖం పట్టడం జరిగింది.

(మిగతా 36వ పేజీలో)

సైన్సు, సమాజం-2

# ప్రకృతికి సంబంధించి కొత్త తాత్విక భావనలు

*(2023 డిసెంబర్ 23-25 తేదీల్లో విజయవాడలో జరిగిన సైన్సు వర్క్‌షాపులో ప్రవేశపెట్టిన పత్రం నుండి)*



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

ఈ శకంలో తొలుత కోపర్నికస్ తరువాత కెప్లర్, గెలీలియోలు అంతకుముందు 2000 సంవత్సరాలుగా మానవులు ఊహిస్తూ వచ్చిన విశ్వ చిత్రాన్ని ఛేదించడం ద్వారా కొత్త ఆలోచనా క్రమానికి పునాది వేశారు. టొలెమీ సృష్టించిన భూకేంద్ర విశ్వం స్థానంలో భూమి కూడా ఇతర గ్రహాల మాదిరిగా సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుందని చెప్పే నేటి విశ్వ రూపాన్ని కోపర్నికస్ ఆవిష్కరించారు. అయితే ఈ ఆవిష్కరణ తీవ్రమైన సామాజిక వాదోపవాదాలు, సవాళ్ళు, ప్రతి సవాళ్ళకు దారి తీసింది. చివరికి జైలు శిక్షలు, మరణశిక్షలకు గురైన శాస్త్రవేత్తల త్యాగాలతో గాని అది ముగియలేదు.

విశ్వచిత్రాన్నే కాదు మానవ శరీర చిత్రానికి సంబంధించి అప్పటి వరకు ఉన్న భావాలు, నమ్మకాలు కూడా ఈ కాలంలో ఛేదించబడ్డాయి. వెసాలియస్, విలియమ్ హార్వే ఈ పని చేశారు. దీనిమీద కూడా తీవ్రమైన వాదోపవాదాలు, చర్చోపచర్చలు జరిగాయి.

సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు తొలి దశ, ఈ విశ్వాసాన్ని గురించీ, ప్రకృతిని గురించీ, మానవ శరీరాన్ని గురించీ అంతకుముందు చెప్పిన దానికి భిన్నమైన కోణం నుంచి వివరించే క్రమంతో ఆరంభమైంది. 1543లో కోపర్నికస్ రాసిన రివల్యూషనీబస్ ఆర్బియమ్ కొలెస్టియం, *(De Revolutionibus Orbium Colestium)*, వెసాలియస్ వ్రాసిన ఇ హ్యూమాని కార్పొరిస్ ఫాబ్రికా *(De Humani Corporis Fabrica)* గ్రంథాలు విశ్వానికీ, మానవ శరీరానికీ సంబంధించిన పాత భావాలపై యుద్ధం ప్రకటించాయి. వీరి గ్రంథాలకూ, వీరి భావాలకూ ప్రజల నుండి మంచి స్పందన లభించింది. అయితే ఈ భావాల రాజకీయ ప్రభావాన్ని గుర్తించిన ఫ్యూడల్ పాలకులు వాటిపై కత్తికట్టారు. విధి నిషేధాలు ఆరంభమైనాయి.

భూమి, ఇతర గ్రహాలూ తమ చుట్టూ తాము తిరుగుతూ సూర్యుని చుట్టూ విభిన్న కక్ష్యలలో తిరుగుతున్నాయన్న కోపర్నికస్ వివరణను కొందరు నమ్మలేదు. కొందరు గ్రహాలు పడిపోకుండా అలా శూన్యంలో ఎలా తిరగగలుగుతాయని ప్రశ్నించారు. ఇంకా లోతుకు వెళ్ళిన మరికొందరు శాస్త్రవేత్తలు భూమి వేగంగా పరిభ్రమిస్తూ ఉంటే భూమి మీద బ్రహ్మాండమైన గాలి దుమారాలు లేవాలి గదా అని ప్రశ్నించారు.

కోపర్నికస్ సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు అంగీకరించకపోయినప్పటికీ ప్రజలలో తీవ్ర చర్చనీయాంశమైంది. భూమి మీద నూతన ప్రపంచం - అంటే అమెరికా ఖండం - అప్పుడే కనుగొనబడింది. భూమి మీదనే నూతన ప్రపంచం ఉన్నప్పుడు ఆకాశంలో ఇలాంటి నూతన ప్రపంచాలు ఉండవని ఏమిటి? అని ప్రశ్నించాడు గియార్డానో బ్రూనో. మొత్తం ప్రపంచం ఒక స్థిరమైన చట్రంలో బిగించబడిందనీ, గ్రహాలు, నక్షత్రాలు దేవుని చేత సృష్టించబడి నడపబడుతున్నాయనీ నమ్ముతున్న వారికి బ్రూనో భావాలు నచ్చలేదు. బ్రూనో యూరప్ అంతా తిరుగుతూ కోపర్నికస్ భావాలు ప్రచారం చేస్తుండటమే కాదు అనేక పుస్తకాలు ప్రచురించాడు. ఆయన తన వాదనా పటిమతో సామాన్యులనూ, శాస్త్రవేత్తలనూ ఒకేలాగ ఆకర్షించేవాడు. చివరికి 1592లో ఆయనను వెనిస్‌లో మతగురువులు పట్టుకొని చిత్రహింసలు పెట్టారు. ఎనిమిదేళ్ళ చిత్రహింసలకు కూడా ఆయన చలించకపోవడంతో చివరికి సజీవ దహనం చేశారు. ఆ విధంగా నూతన శాస్త్ర విజ్ఞాన ఆవిష్కరణలను స్వేచ్ఛగా ప్రచారం చేసుకొనే హక్కు కోసం ప్రాణాలను కూడా అర్పించిన శాస్త్రవేత్తగా బ్రూనో అమరుడైనాడు.

బ్రూనో అమరత్వం కోపర్నికస్ సిద్ధాంతానికి మరింత ప్రచారం తెచ్చింది. మత ఛాందసులు దాన్ని ఎంతగా ఆపాలన్నా ఆపలేకపోయారు. అయితే అదే సమయంలో కోపర్నికస్ సూర్యకుటుంబంలోని గ్రహ కక్ష్యల గురించి సరైన వివరణ నివ్వలేకపోయారు. ఆ పనిని తరువాతి కాలంలో వచ్చిన శాస్త్రవేత్త జోహాన్నస్ కెప్లర్ (1571 - 1630) నిర్వర్తించారు. కోపర్నికస్ చెప్పినట్లు గ్రహాలు వృత్తాకారంలో కాకుండా దీర్ఘ వృత్తాకార కక్ష్యలలో సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లు కెప్లర్ గణిత సూత్రాల ద్వారా నిరూపించాడు. కెప్లర్ సిద్ధాంతంతో ఖగోళ శాస్త్ర పరిశోధనలు ఊపందుకున్నాయి. గణిత సూత్రాల ద్వారానే కాదు భౌతికంగా ఖగోళాన్ని దర్శించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆ ప్రయత్నాల నుండే టెలిస్కోప్ ఆవిర్భవించింది.

టెలిస్కోప్‌తో మొట్టమొదటిసారి విశ్వాన్ని వీక్షించిన వ్యక్తి ఇటలీలోని పాడువా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అయిన గెలీలియో గెలీలి (1564 - 1642). ఆయన తన కొద్ది రోజుల ఆకాశ వీక్షణంలో అనేక విషయాలు మొట్టమొదటగా కనుగొన్నాడు. చంద్రుని మీద నీళ్ళులేని సముద్రాలు, పర్వతాలను వీక్షించాడు. శుక్రగ్రహానికి చంద్రుని మాదిరిగానే కృష్ణపక్షం, శుక్లపక్షం వున్నట్లు గ్రహించాడు. శనిగ్రహం చుట్టూ వలయాలు చూశాడు. బృహస్పతికి ఉ

పగ్రహాలు ఉన్నట్లు కనుగొన్నాడు. గెలీలియో తరువాత చాలామంది ఈ దృశ్యాలను కళ్ళతో స్వయంగా చూశారు. కోపర్నికస్ చెప్పిన గ్రహ వ్యవస్థను గెలీలియో ఆ విధంగా ప్రత్యక్షంగా చూపించేసరికి ఈ నూతన ఆవిష్కరణకు బ్రహ్మాండమైన ప్రచారం లభించింది. గెలీలియో 1610లో వ్రాసిన 'సిడెరెయస్ నున్సియస్' (నక్షత్రాల నుండి వార్తాహారుడు) అన్న గ్రంథం ఆనాడు హాట్ కేకుల్లా అమ్ముడుపోయింది. అందులో ఆయన తన పరిశీలనలను గురించి అత్యంత సరళంగా, సూటిగా వివరించాడు. అయితే గెలీలియో పరిశోధనకు ఎంత ప్రచారం లభించిందో ఛాందసుల నుండి అంత వ్యతిరేకత కూడా వచ్చింది. విజ్ఞాన వేత్తలలో కూడా ఛాందసవాదులు అసలు టెలిస్కోప్‌తో ఆకాశం వంక చూడబోమని భీష్మించుకున్నారు. ఆకాశంలో ఏం వుందో తర్కం ద్వారా మేము ఖచ్చితంగా గ్రహించగలం, ఈ బోడి టెలిస్కోపులో చూసి చెప్పేదేమిటి అన్నది వారి వాదన.

గెలీలియో టెలిస్కోపులో ప్రత్యక్షంగా గ్రహ వ్యవస్థను చూసి కోపర్నికస్ సిద్ధాంతం సరియైనదేనని చెప్పినప్పటికీ గతంలో కోపర్నికస్ వ్యతిరేకులు లేవనెత్తిన రెండు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పాల్సి వచ్చింది. అవేమిటంటే... నిజంగా భూమి మహా వేగంగా పరిభ్రమిస్తూ ఉంటే, భూమి మీద బ్రహ్మాండమైన గాలులు నిత్యం వీయాలి కదా! అలా జరగడం లేదే. రెండవది భూమి పరిభ్రమిస్తున్నట్లయితే ఒక వస్తువును గాలిలోకి ఎగరేస్తే అది తిరిగి అదే ప్రదేశంలో పడకూడదు కదా! ఎందుకంటే వస్తువు తిరిగి క్రింద పడేసరికి నేల కొంత దూరం జరుగుతుంది కదా! ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడం కోసం గెలీలియో పైనుండి కిందపడే వస్తువులు ''త్వరణం'' *(Accelaration)* పొందుతాయని కనుగొన్నాడు. నిజానికి త్వరణం అనే భావన రావడం, దాన్ని గణిత శాస్త్ర రీత్యా నిరూపించడం ఒక మహా అద్భుతమైన ఆవిష్కరణ. అంతేకాదు ఆయన వస్తువుల చలనానికి సంబంధించిన పాత భావాలను ప్రశ్నించి, ప్రయోగాల ద్వారా ఒక్కోదాన్ని పూర్వపక్షం గావించాడు. పై నుండి కిందపడే రెండు వస్తువులు పరిమాణంతో నిమిత్తం లేకుండా ఒకే సమయంలో కిందపడతాయని – పీసా టవర్ మీద ఎక్కి రెండు వస్తువులను కింద జారవిడిచి జరిపిన ప్రయోగం ద్వారా నిరూపించాడు. గెలీలియో పరిశోధనలు భౌతిక శాస్త్రంలో స్థితి శాస్త్రం *(Statics)*, గతి శాస్త్రం *(Dynamics)* అన్న రెండు శాస్త్రాల ఆవిర్భావానికి దారితీశాయి.

> **"అరిస్టాటిల్ - టొలెమి సృష్టించిన విశ్వచిత్రాన్నే కాదు వారి తాత్విక చింతనను కూడా గెలీలియో తాను రాసిన పుస్తకంలో పూర్వ పక్షం చేశాడు. 1632లో ఆయన రాసిన "టొలెమి - కోపర్నికస్‌లు ఇద్దరు ప్రపంచానికి సంబంధించి ప్రవేశపెట్టిన రెండు ప్రధాన వ్యవస్థలపై చర్చ" అన్న గ్రంథాన్ని పోప్‌కు అంకితమిచ్చాడు. దానికి కారణం గెలీలియో కాథలిక్ మతానుయాయి కావడమే."**

అరిస్టాటిల్ – టొలెమి సృష్టించిన విశ్వచిత్రాన్నే కాదు వారి తాత్విక చింతనను కూడా గెలీలియో తాను రాసిన పుస్తకంలో పూర్వ పక్షం చేశాడు. 1632లో ఆయన రాసిన "టొలెమి – కోపర్నికస్‌లు ఇద్దరు ప్రపంచానికి సంబంధించి ప్రవేశపెట్టిన రెండు ప్రధాన వ్యవస్థలపై చర్చ" అన్న గ్రంథాన్ని పోప్‌కు అంకితమిచ్చాడు. దానికి కారణం గెలీలియో కాథలిక్ మతానుయాయి కావడమే. సైన్సులో ఆయన విప్లవకారుడు, కాని సామాజిక విషయాల్లో కాదు. ఆ పుస్తకాన్ని ఆయన లాటిన్‌లో కాక సామాన్య ప్రజలు చదువుకోవడానికి వీలుగా ఇటాలియన్‌లో ప్రచురించాడు.

అయితే గెలీలియో ప్రచురించిన ఈ గ్రంథం మత బోధకుల్లోనూ, సాంప్రదాయవాదుల్లోనూ ఎంత ఆగ్రహం తెప్పించిందంటే ఆయనను తీవ్రంగా శిక్షించాలనీ, దైవదూషణ చేసినందుకు గాను చంపాలని పలువురు డిమాండ్ చేశారు. అంతకుముందే కోపర్నికస్ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన బ్రూనోను చంపారు. క్యాంప్‌నెల్లా (1568–1639) అనే శాస్త్రవేత్తకు దీర్ఘకాల కారాగార శిక్ష విధించారు. గెలీలియో బోధనలు చర్చి స్థిరత్వాన్ని, ప్రభుత్వ అస్తిత్వాన్నీ, ప్రజల నైతిక విలువలనూ దెబ్బ తీస్తున్నాయని, చివరికి స్వంత ఆస్తిని కూడా అస్థిరపరుస్తున్నాయని అభియోగం మోపారు. ఆయనపై విచారణ జరిపి జైలు శిక్ష విధించారు. జైలు జీవితంలోనే ఆయన తుదిశ్వాస విడిచాడు. అయినప్పటికీ ఆయన వెల్లడించిన శాస్త్ర విషయాలను గానీ, ఆయన అనుసరించిన ప్రయోగాత్మక పరిశోధనా పద్ధతిని గానీ వారు అడ్డుకోలేకపోయారు.

ఈ విశ్వానికి సంబంధించి కెప్లర్ రూపొందించిన సూత్రాలు, గెలీలియో గతి శాస్త్రం – రెండూ కలగలిసి 40 సంవత్సరాల తరువాత న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతంగా రూపు దిద్దుకున్నది. సర్ ఐజాక్ న్యూటన్ 1685–86లో ప్రచురించిన గ్రంథం "ఫిలాసఫీ నేచురలిస్ ప్రిన్సిపియా మాథమెటికా'' *(Philosophiae Naturalis Principia Mathematica)*లో గ్రహాల పరిభ్రమణ సూత్రాలను సవివరంగా చెప్పారు. గురుత్వాకర్షణ శక్తి ఈ విశ్వవ్యవస్థకు ఏ విధంగా ఆధారంగా ఉందో నిరూపించారు. అయితే ఈ విషయాన్ని ఆయన గతంలోలాగ తాత్విక ధోరణిలో కాక భౌతిక శాస్త్ర ప్రయోగాల ద్వారా నిరూపించాడు. ఈ విశ్వంలో నక్షత్రాలు, గ్రహాలకు గానీ, వస్తువులకు గానీ స్థిరంగా ఉండటం సహజ లక్షణమనీ, వాటిని చలనంలో పెట్టడానికి ఏదో శక్తి కావాలనీ, ఆ శక్తే దైవమనీ పూర్వపు విజ్ఞానుల భావం. కాని న్యూటన్ తన చలన సిద్ధాంతం ద్వారా వస్తువులకు చలనం సహజ లక్షణమని నిరూపించాడు. చలనం కల్పించడానికి శక్తి అవసరం లేదు. చలనంలో ఉన్న వస్తు స్థితిని మరో స్థితికి మార్చడానికి శక్తి కావాలని ఆయన చెప్పాడు. ఆ విధంగా ప్రపంచానికి సంబంధించిన పాత తాత్విక భావన స్థానంలో నూతన తాత్విక భావన – చలనశీలమైన భావన ప్రవేశపెట్టడానికి ఆయన సిద్ధాంతం దారితీసింది. న్యూటన్ కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో చలన శీలత న్యూటన్ ఆవిష్కరణలకు ప్రేరణకాగా మరోవైపు న్యూటన్ భావాల ప్రభావం ఆనాటి ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై తీవ్రంగా వుంది. న్యూటన్ నూతన భావన ఆర్థికరంగంలో స్వేచ్ఛా వాణిజ్యానికీ, రాజకీయ రంగంలో లిబరలిజానికి తావిచ్చింది. దాని ఫలితమే తరువాత జరిగిన ఫ్రెంచి విప్లవం.

### మానవ శరీరంపై కొత్త దృక్పథం

ఈ కాలంలో సామాజికంగా గొప్ప చర్చను లేవనెత్తిన మరో ఆవిష్కరణ మానవ శరీర ధర్మానికి సంబంధించినది. విశ్వంలో వివిధ గ్రహాలు, నక్షత్రాలు స్థిరమైన భూమి చుట్టూ తిరుగుతున్నాయని అరిస్టాటిల్ ఎలా నిర్ధారణ చేశాడో మానవ శరీర ధర్మానికి సంబంధించి కూడా గ్రీకు శాస్త్రవేత్త గాలెన్ అటువంటి

> **"సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు విజ్ఞాన శాస్త్ర విప్లవం - ఈ విశ్వానికీ, మానవ శరీరా నికి సంబంధించిన ఆలోచనలపై యుద్ధం చేసి సమూలమైన మార్పు తెచ్చినట్లే, పారిశ్రామిక విప్లవ కాలంలో సైన్సు - పదార్ధ లక్షణం, జీవుల ఆవిర్భావం, అభివృద్ధికి సంబంధించిన పాత భావాలపై యుద్ధం ప్రకటించి విజయం సాధించింది. ఈ కాలం మానవ విజ్ఞానం నూతన పుంతలు తొక్కిన కాలం. పరిశోధనా శాలల్లో విజ్ఞానం పరిశ్రమల రూపంలో మానవునికి నేరుగా చేరిన కాలం."**

చిత్రీకరణే చేశాడు. మానవ శరీరంలో కొన్ని ఆత్మలు వివిధ అవయవాలను నడిపిస్తున్నాయని గాలెన్ సూత్రీకరించాడు. ఈ సూత్రీకరణ, శరీరంలో వివిధ అంగాల కూర్పుపై గాలెన్ చెప్పిన విషయాన్నే వందల సంవత్సరాలు అందరూ నమ్మారు. కాని తొలిసారిగా సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు శాస్త్రవేత్త ఇటలీకి చెందిన ఆండ్రియస్ వెసాలియస్ తన "డి హ్యూమని కార్పోరిస్ ఫాబ్రికా" *(De Humani Corporis Fabrica )* అన్న గ్రంథంలో మానవ శరీరంలోని అన్ని అంగాలకు సంబంధించిన సంపూర్ణ వివరణను ఇచ్చాడు. అయితే ఆయన వివిధ అంగాల మధ్య సంబంధం ఎలా వుంటుందో, మానవ శరీరం మొత్తం ఎలా పనిచేస్తుందో వివరణ ఇవ్వలేదు. ఆ పనిని పాదువా విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన ఇంగ్లీషు శాస్త్రవేత్త విలియమ్ హార్వే (1578-1675) పూర్తిగా వించాడు. నాటి యాంత్రిక శాస్త్రంలో పంపులు, కవాటాలను మానవ శరీరానికి వర్తింపచేసి రక్త ప్రసరణ వ్యవస్థను హార్వే తొలిసారిగా కనుగొన్నాడు. శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ సర్వాంగాలకు ముఖ్యమనీ, ఈ వ్యవస్థకు గుండె ముఖ్యమని చెప్పాడు. మొత్తం శరీరాన్ని ఆయన ఒక హైడ్రాలిక్ యంత్రంతో పోల్చాడు. రక్తం గుండె నుండి శరీరాంగాలకు చేరుతుందని, శరీరాంగాల నుండి తిరిగి గుండెకు చేరుతోందని ఆయన చెప్పాడు. కాని ఎలా చేరుతుందో చెప్పలేక పోయాడు. మైక్రోస్కోపు కనుగొన్న తర్వాత సూక్ష్మ రక్తనాళాలు గురించి తెలుసుకున్న తరువాత మాత్రమే దానికి వివరణ లభించింది.

అయితే మానవ శరీరంలో కొన్ని ఆత్మలు వివిధ అవయవాలను నడిపిస్తున్నాయన్న గాలెన్ భావాన్ని హార్వే శరీర ధర్మశాస్త్రం పటాపంచలు చేసింది. ఈ విషయాన్ని సాంప్రదాయవాదులు అంగీకరించకపోయినప్పటికీ శరీర ధర్మశాస్త్రంలో ఆధునిక ప్రయోగాలను అడ్డుకోలేకపోయారు. అరిస్టాటిల్ సృష్టించిన విశ్వ చిత్రాన్ని కోపర్నికస్, కెప్లర్, గెలీలియో, న్యూటన్ ఏ విధంగా ఛేదించి నూతన చిత్రాన్ని ఆవిష్కరించారో మానవ శరీర నిర్మాణానికి సంబంధించి గాలెన్ చిత్రీకరణను వెసావియస్, హార్వే ఆ విధంగా ఛేదించి నూతన విప్లవాత్మక పరిశోధనపై ఆధారపడ్డ చిత్రాన్ని ఆవిష్కరిం చారు. ఆ విధంగా వారు శరీర శాస్త్రానికి సంబంధించి మానవుల ఆలోచనా గతినే మార్చేశారు.

**పారిశ్రామిక విప్లవ కాలం**

సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు విజ్ఞాన శాస్త్ర విప్లవం – ఈ విశ్వానికీ, మానవ శరీరానికి సంబంధించిన ఆలోచనలపై యుద్ధం చేసి సమూలమైన మార్పు తెచ్చినట్లే, పారిశ్రామిక విప్లవ కాలంలో సైన్సు – పదార్ధ లక్షణం, జీవుల ఆవిర్భావం, అభివృద్ధికి సంబంధించిన పాత భావాలపై యుద్ధం ప్రకటించి విజయం సాధించింది. ఈ కాలం మానవ విజ్ఞానం నూతన పుంతలు తొక్కిన కాలం. పరిశోధనా శాలల్లో విజ్ఞానం పరిశ్రమల రూపంలో మానవునికి నేరుగా చేరిన కాలం. ఆవిరి ఇంజన్, విద్యుత్, మోటారు యంత్రాల ప్రవేశం, పెద్ద పెద్ద పరిశ్రమలు, పెద్ద ఎత్తున వినియోగ వస్తువుల ఉత్పత్తి, నౌకాయానం, టెలిగ్రాఫ్, రేడియోల ద్వారా ప్రపంచంలోని అన్ని ఖండాలు ఏకం కావటం ఈ కాలంలో సైన్సు మానవునికి ప్రసాదించిన వరాలు.

అయితే వీటిలో మానవుని ఆలోచనా విధానం మీద విప్లవాత్మక ప్రభావం కలిగించిన అంశాలు రెండు వున్నాయి. అవి భౌతిక శాస్త్రంలో ఫారడే, మాక్స్‌వెల్‌ల పరిశోధనలు. జీవశాస్త్రంలో ఛార్లెస్ డార్విన్ పరిశోధనలు. మొదటిది శక్తి యొక్క సర్వ సంబంధాలను తెలియజేయగా, రెండవది జీవుల పుట్టుక, పరిణామానికి సంబంధించి పూర్తిగా నూతన దృక్కోణాన్ని ప్రసాదించింది.

ఉష్ణం గురించిన అధ్యయనం ప్రాచీన కాలంలోనే ప్రారంభమైనప్పటికీ ఉష్ణం విభిన్న రూపాలలోకి మారుతోంది అన్న విషయాన్ని కనుగొనడం మాత్రం పారిశ్రామిక విప్లవ కాలంలోనే జరిగింది. పారిశ్రామిక కార్యకలాపాలలో ఆవిరి యంత్రాలను విరివిగా వాడటం ప్రారంభమైన తరువాత ఐరోపాలోని పలు దేశాల శాస్త్రవేత్తల దృష్టి ఉష్ణం దాని లక్షణాల మీదకు మళ్ళింది. ఫ్రాన్స్‌కు చెందిన సాది కార్నట్ (1796–1832) ఆవిరి యంత్రంలోని ఉష్ణంలో కొంత భాగం పనిగా మారుతోందని కనుగొన్నాడు. ఎంత ఉష్ణంతో ఎంత పని జరుగుతుందో కూడా ఆయన లెక్కగట్టాడు. అంటే ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మార్పు చెందుతోందని ఆయన తొలిసారిగా ప్రపంచానికి తన "రిఫ్లిక్షియాస్ సుర్‌లా పుయిస్సాన్స్ మోట్రిన్ డు ఫెయు" *(Reflexious Surla Puissance Motrice Du Few-1824)* అన్న గ్రంథంలో వెల్లడించాడు. తరువాత కాలంలో రాబర్ట్ మేయర్ (1814–87), జౌల్ (1818–89) వాన్ హెల్మ్‌హోల్ట్జ్ (1821–94) తదితరులు "ఉష్ణానికి సమానమైన యాంత్రిక శక్తిని" లెక్కగట్టారు.

తదనంతర కాలంలో రసాయన శాస్త్రం, విద్యుచ్ఛక్తి, అయస్కాంత క్షేత్రాలపై జరిగిన పరిశోధనలో ఉష్ణానికీ, విద్యుత్‌కూ, అయస్కాంతానికీ, యాంత్రిక శక్తికీ మధ్యనున్న సంబంధాన్ని తెలియజేశాయి. ముఖ్యంగా మైఖేల్ ఫారడే (1791–1867) విద్యుత్ వాహకాన్ని కనుగొన్న తరువాత యాంత్రిక చలనం ద్వారా విద్యుత్ తరంగాలను ఉత్పత్తి చేయవచ్చునని, అలాగే విద్యుచ్ఛక్తి ద్వారా యంత్రాలను నడపవచ్చుననీ స్పష్టమైంది. తరువాత క్లెర్క్ మాక్స్‌వెల్ (1831–79) విద్యుత్ అయస్కాంత తరంగాలను కనుగొన్నాడు. ఈ తరంగాలు దాదాపు కాంతి వేగంతో పయనిస్తున్నాయని కూడా కనుగొన్నాడు. ఈ పరిశోధనల ఫలితంగా ఉష్ణం, కాంతి, అయస్కాంతం, విద్యుత్, యాంత్రిక శక్తి – రూపాలు వేరు గాని శక్తి ఒక్కటే అనే నూతన భావన మానవునికి ఏర్పడింది.

అంతకు ముందు వేలాది సంవత్సరాలుగా మానవుడు ప్రకృతి శక్తులను పరిశీలించి పలు విధాలైన భాష్యాలు చెబుతూ వచ్చాడు. కానీ 18, 19వ శతాబ్దపు పారిశ్రామిక విప్లవ సైన్సు 'శక్తి నిత్యత్వ సూత్రాన్ని' కనుగొనడం ద్వారా విభిన్న రూపాలలోని శక్తి యొక్క ఏకత్వాన్ని ప్రపంచానికి తెలియజేసింది. అంతేకాదు ఇది ఆనాటి మొత్తం శాస్త్ర విభాగాలను ఏకం చేసింది. ఆనాడు బంగారం ఎలాగైతే విశ్వవ్యాపిత ద్రవ్యంగా చెలామణీ అవుతోందో అలాగే శక్తి కూడా తయారైంది.

> **❝ దక్షిణ అమెరికా ఖండంలోని గ్యాలపగోస్ దీవులలోని పక్షి జాతులు డార్విన్ దృష్టిని బాగా ఆకర్షించాయి. ప్రధాన భూభాగం లో గల తమ పూర్వీకుల నుండి వచ్చిన ఈ పక్షులు గ్యాలపగోస్‌లోని ఒక్కో దీవిలో ఒక్కోరకమైన భిన్న లక్షణాలను సంతరించు కున్నాయి. ఎందుకలా జరిగిందని డార్విన్ తర్కించాడు. అవి నివసిస్తున్న దీవుల పరిస్థితికీ, ఈ పక్షులలో అభివృద్ధి చెందిన లక్షణాలకూ సంబంధం ఉండి ఉండ వచ్చునని భావించాడు. ❞**

విభిన్న ద్రవ్యాలను బంగారం ద్వారా కొలిచినట్లే విభిన్న శక్తి రూపాలను శక్తితో పోల్చి కొలవడం ఆరంభమైంది. ఉష్ణాన్ని కాలరీలలోనూ, పనిని ఫుట్ ఫౌండ్‌లలోనూ, విద్యుత్‌ను కిలోవాట్ గంటలలోనూ కొలవడమే కాకుండా శక్తి వాటి మధ్య మార్పిడికి సాధనమైంది. దాంతో మొత్తం మానవ కార్యకలాపాలు – పరిశ్రమలు, రవాణా, విద్యుత్ కాంతులు, చివరికి ఆహారం, జీవితం మొత్తంగానే "శక్తి" అనే ఏకైక దృగ్విషయంపై ఆధారపడిపోయింది.

"శక్తి నిత్యత్వ సూత్రం" భౌతిక శాస్త్రంలో సంచలనం సృష్టించగా అంతకంటే సంచలనం సృష్టించిన ఆవిష్కరణలు జీవశాస్త్ర రంగంలో జరిగాయి. వీటిలో ప్రధానమైనవి చార్లెస్ డార్విన్ కనుగొన్న పరిణామ వాదం, లూయిా పాశ్చర్ కనుగొన్న సూక్ష్మజీవులు.

నిజానికి శక్తి నిత్యత్వ సూత్రం శాస్త్ర ప్రచారంలో సంచలనం కలిగించినప్పటికీ తీవ్రమైన వాదోపవాదాలకు మాత్రం దారి తీయలేదు. కాని డార్విన్, పాశ్చర్‌ల సిద్ధాంతాలు సామాజికంగా విపరీతమైన వివాదాన్ని లేపాయి.

పారిశ్రామిక విప్లవ కాలంలో చార్లెస్ డార్విన్‌కు ముందే జీవశాస్త్రంలో అనేక నూతన ఆవిష్కరణలు జరిగాయి. కార్ల్ లిన్నేయస్ (1707–78) వర్గీకరణ సిద్ధాంతాన్ని కనుగొన్నాడు. జీవుల పరిణామం గురించి లామార్క్ (1744–1829) సిద్ధాంతం వెలువ డింది. రైల్వేలు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందడంతో అనేక చోట్ల కొండలు తొలచి గుహలు ఏర్పాటు చేయడం, అడవులు, నదుల మీదుగా రైల్వే లైన్లు వేయడం జరిగేది. ఈ పనులు భూగర్భ శాస్త్రంతో బాటు భూగర్భంలో నిక్షిప్తమైన పురాతన జీవుల పట్ల కూడా ఆసక్తి రేపాయి. ఇప్పుడు మనకు కనిపిస్తున్న జీవ జాతులు, అంతకు పూర్వం నివసించిన జీవ జాతుల నుండి ఆవిర్భవించాయనే భావన ముందుకు వచ్చింది. ఈ భూమి మీద మానవునితో సహా ఇప్పుడున్న జీవ జాతులు యథాతథంగా సృష్టించబడ్డాయన్న భావనను ఈ కొత్త ఆవిష్కరణలు, వాటి నుండి ఉద్భవించిన కొత్త భావనలు సవాలు చేశాయి. అయితే జీవులు పరిణామం (ఇవల్యూషన్) ద్వారా ఆవిర్భవించా యనే భావననే సాంప్రదాయకులు తిరస్కరించేవారు. కాని చార్లిస్ డార్విన్ తన ''జాతుల ఆవిర్భావం'' *(Origion of Species)* అన్న గ్రంథంలో పరిణామం ద్వారా జీవులు ఆవిర్భవిస్తాయని చెప్పడమే కాకుండా జీవ పరిణామానికి 'ప్రకృతి వరణం' *(Natural Selection)* కారణమని సూత్రీకరించాడు.

బీగిల్ అనే నౌకలో డార్విన్ ప్రకృతి పరిశోధన నిమిత్తం ప్రపంచ యాత్ర చేశాడు. దక్షిణ అమెరికా ఖండంలోని గ్యాలపగోస్ దీవులలోని పక్షి జాతులు ఆయన దృష్టిని బాగా ఆకర్షించాయి. ప్రధాన భూభాగంలో గల తమ పూర్వీకుల నుండి వచ్చిన ఈ పక్షులు గ్యాలపగోస్‌లోని ఒక్కో దీవిలో ఒక్కోరకమైన భిన్న లక్షణాలను సంతరించుకున్నాయి. ఎందుకలా జరిగిందని డార్విన్ తర్కించాడు. అవి నివసిస్తున్న దీవుల పరిస్థితికీ, ఈ పక్షులలో అభివృద్ధి చెందిన లక్షణాలకూ సంబంధం ఉండి ఉండవచ్చునని భావించాడు.

ఆయనలో ఈ భావం రావడానికి కారణం డార్విన్ నివసించిన సామాజిక పరిస్థితి. ఛార్లెస్ డార్విన్ పుట్టి పెరిగిన కాలం ఇంగ్లండ్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్న కాలం. మానవుల ఆర్థిక జీవనంలో విపరీతమైన పోటీతత్వం ఆనాడు ఉంది. నాటి పెట్టుబడిదారీ ఆర్థికవేత్త పార్సన్ మాల్థస్ చెప్పిన దాని ప్రకారం "జీవితం అంటే ఒక పోరాటం. అందులో ఉత్తమమైన వాడే మనుగడ సాధిస్తాడు. పోరాటానికి ప్రతిఫలాలు సంపద, అధికారం. ఆయా కాలాల్లో ఉన్న ఆహార సరఫరా కన్నా మించి జనాభా పెరగకుండా చేసే సాధనాలే రోగం, యుద్ధం..." మాల్థస్ చెప్పిన ఈ విషయాలనే జీవ ప్రపంచానికి ఆపాదిస్తే ఎలా ఉంటుందో చూశాడు డార్విన్. అప్పుడాయనకు లభించిన జవాబే తరువాత జీవ పరిణామ సిద్ధాంతానికి దారి తీసింది.

జీవులలో భిన్నత్వం ఉంటుంది. ఒక తల్లికి పుట్టిన బిడ్డల్లో కూడా భిన్నత్వం ఉ ంటుంది. అలాగే పుట్టిన బిడ్డలన్నీ బ్రతికి పెద్దవై మళ్ళీ బిడ్డలు కంటూ పోతే ఈ భూమి ఏ ఒక్క జాతికీ సరిపడ ఆహారం సరఫరా చేయలేదు. అందువల్ల బిడ్డల్లో చాలావరకు చనిపోతాయి. కొన్ని బ్రతుకుతాయి. ఏవి బ్రతుకుతాయి? తాము నివసించే పర్యావరణ పరిస్థితులకు అనుకూలమైన లక్షణాలు గల జీవులు బ్రతుకుతాయి. ఆ లక్షణాలను అవి తమ సంతతులకు కూడా ఇస్తాయి. ఈ విధంగా "ప్రకృతి వరణం" అనే సిద్ధాంతాన్ని ఆయన ప్రతిపాదించాడు. మనుగడ కోసం జరిగే పోరాటంలో ప్రకృతికి తట్టుకోగల జీవులు బ్రతుకుతాయి, మిగిలినవి నశిస్తాయి. ాబతీజఱఱఖుశ్రీ శీట్‌్ఞ్రవ టఱ్వర్ అనే సూత్రాన్ని ఆయన చెప్పాడు.

డార్విన్ పరిణామవాదానికి రెండు రకాలైన ప్రతికూల స్పందనలు వచ్చాయి. మొదటిది, పరిణామవాదాన్ని తిరస్కరించే సాంప్రదాయవాదుల నుండి, రెండవది, ఆనాడు ప్రపంచ వ్యాప్తంగా వలస దేశాల ప్రజలను దోపిడీ చేసుకొనేందుకు పరిణామ వాదాన్ని ఉపయోగించుకొనే ఆధునికుల నుండి.

సాంస్కృతిక పునరుజ్జీవన కాలపు సైన్సు – మత గ్రంథాలలో చెప్పిన విశ్వరూపాన్ని తిరస్కరించి నూతన విశ్వరూపాన్ని ఆవిష్కరించినప్పటికీ సాంప్రదాయవాదులు అంతగా భయపడిపోలేదు. కొంతకాలం వ్యతిరేకించినా న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం తరువాత ఆ భావాన్ని అంగీకరించక తప్పలేదు. నూతన విశ్వ చిత్రీకరణకు అనుగుణంగా తమ మత గ్రంథాలపై వ్యాఖ్యానాలు మార్చారు. అయితే డార్విన్ పరిణామ వాదం మాత్రం మత గ్రంథాలలో, ముఖ్యంగా బైబిల్‌లో జెనిసిస్ సిద్ధాంతాన్ని మౌలికంగానే తిరస్కరించడంతో మొత్తం చర్చి దీనిపై తీవ్రమైన వ్యతిరేకత కనబరిచింది. డార్విన్ పరిణామవాదాన్ని తిరస్కరించడమే కాదు. డార్విన్‌ను వ్యక్తిగతంగా కూడా పలువురు దూషించారు.

**(మిగతా 34వ పేజీలో)**

# అదాని లాభాల కోసం ఆంధ్ర ప్రజలు భారాలు మోయాలా?



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

అదాని ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని ప్రముఖులకు 2029 కోట్ల రూపాయలు లంచాలుగా ఇవ్వటం లేదా ఇవ్వటానికి వాగ్దానాలు చేశారని నేరారోపణ చేసిన అమెరికా న్యాయశాఖ అధికారులు కోర్టులో కేసు దాఖలు చేశారు. మనదేశంలో మాత్రమే కాక అదాని అక్రమాలు అమెరికాకు కూడా వ్యాపించాయని ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నది. ప్రభుత్వంలో ప్రముఖ స్థానాలలో ఉన్నవారికి, అధికారులకు సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం లంచాలు ఇవ్వజూపారని, అదాని కంపెనీలలో పెట్టుబడులు పెట్టే అమెరికా పౌరులను మోసం చేశారని నివేదిక లో పేర్కొన్నారు. ఈ మోసంలో అదానితో పాటు ఆయన కంపెనీలకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులు ఉన్నారని చెప్పారు. అమెరికా పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్‌లో ఈ అవినీతి ఆరోపణలను గురించి వార్తలు రావటం, అమెరికా అధికారులు కేసు నమోదు చేయటంతో ప్రపంచవ్యాపితంగా ఉన్న అదాని వ్యాపారాలపై ప్రభావం చూపింది. అదాని కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లు కెన్యా ప్రభుత్వం ప్రకటించింది. అదాని కంపెనీతో కుదుర్చుకున్న విద్యుత్ సరఫరా ఒప్పందాలను సమీక్షిస్తామని బంగ్లాదేశ్ ప్రభుత్వం తెలిపింది. అదాని గ్రూపు సంస్థలలో ఇక ముందు పెట్టుబడులు పెట్టబోమని ఫ్రాన్స్‌కు చెందిన టోటల్ ఎనర్జి కంపెని వెల్లడించింది. ఈ ప్రకటన తర్వాత అదాని గ్రీన్ ఎనర్జి లిమిటెడ్ షేర్లు 8 శాతం పతనమైనాయి. కంపెని పాల్పడిన అవినీతి చర్యలపై విచారణ జరుగుతున్నట్లు తమకు తెలియజేయలేదని టోటల్ ఎనర్జి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

అమెరికాలో సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) తమపై విచారణ జరుపుతున్నదని, 2023, మార్చి 17వ తేదీన అదాని కంపెనీపై ఎఫ్‌బిఐ దాడి చేసిందని అదాని గ్రూపు తమకు తెలియజేయలేదని టోటల్ ఎనర్జి ప్రకటన స్పష్టం చేస్తున్నది. తమ ప్రతిష్ఠను దెబ్బతీయటానికి, తమ వ్యాపారాలను నష్టపరచటానికి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని, తాము అవినీతి వ్యతిరేక చట్టాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని అదాని గ్రూపు అధికారులు ప్రకటనలు చేశారు. తమ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానిపై విచారణ జరుగుతున్న విషయం తమకు తెలియదని అబద్ధాలు చెప్పారు.

### యుఎస్ న్యాయశాఖ ఆరోపణలలో ముఖ్యాంశాలు

అమెరికా న్యాయశాఖ జారీ చేసిన సెర్చి వారంట్‌ను, విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తున్న సమన్లను తీసుకుని 2023, మార్చి 17వ తేదీన ఎఫ్‌బిఐ స్పెషల్ ఏజంట్లు అమెరికాలో ఉన్న సాగర్ ఎన్ అదానిని కలిశారు. వారంట్ కాపిని సాగర్ ఎన్ అదానికి అందజేశారు. విదేశీయులు పాల్పడే మోసాలను అరికట్టటానికి ఉద్దేశించిన (ఎఫ్‌సిపిఎ) చట్టాన్ని ఉల్లంఘించటం, సెక్యూరిటీలలో మోసాలు చేయటం, వైర్ మోసాల (వేరొకరిని మోసం చేయటానికి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించటం)తో పాటు గౌతమ్ ఎస్ అదాని, సాగర్ ఎస్ అదాని, వినీత్ ఎస్ జైన్, భారతదేశంలోని ప్రభుత్వ విద్యుత్ కంపెని సెకి దోషులుగా ఉన్నారని వారంట్‌లో న్యాయశాఖ పేర్కొంది. వ్యాపారంలో తమకు అనుకూలంగా వ్యవహరించటం కోసం భారతదేశంలోని మంత్రులు, అధికారులకు చెల్లించిన లంచాలు, ఇకముందు చెల్లించటానికి అంగీకరించిన వాటికి సంబంధించిన సాక్ష్యాలను కూడా సమన్లలో పొందుపరిచారు.

అదాని కంపెనీలు పాల్పడుతున్న అవినీతికి హద్దే లేదని, కేంద్రంలో మోడి ప్రభుత్వం ప్రాపుతో దేశ సంపదను దోచేస్తున్నారని అనేక సందర్భాలలో వెల్లడైంది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చి సంస్థ అదాని కంపెనీలు అనుసరిస్తున్న అవినీతి పద్ధతులను పేర్కొంటూ అరోపణలు చేసింది. స్టాక్ ధరలలో అక్రమాలకు పాల్పడుతున్నారని, అకౌంటింగ్‌లో మోసాలు చేస్తున్నారని చెప్పింది. పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలుగా ఉన్న దేశాలకు నిధులను తరలించటం, ఆ డబ్బుతో తమ సంస్థల షేర్లను కొనుగోలు చేయించటం ద్వారా ధరలను కృత్రిమంగా పెంచి, అక్రమంగా లాభాలు సంపాదిస్తున్నారు. నకిలీ కంపెనీలను ఏర్పాటు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు, ఈ విధమైన పద్ధతుల ద్వారా స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నారని హిండెన్‌బర్గ్ సంస్థ వెల్లడించింది. హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలు తీవ్రమైనవని, అదాని అక్రమాలు ఆర్థికవ్యవస్థతో పాటు దేశరక్షణపై కూడా ప్రభావం చూయిస్తాయని, కాబట్టి ఈ ఆరోపణలపై విచారణ జరిపించి, అదాని సంస్థలపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు డిమాండ్ చేశాయి. కాని కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్లపై ఏ మాత్రం స్పందించలేదు. ప్రభుత్వం, బిజెపి అదానిని వెనకేసుకొచ్చాయి. ఆర్ఎస్ఎస్ మౌనంగా అదానికి మద్దతిచ్చింది. కేంద్ర ప్రభుత్వం, బిజెపి మన దేశ అభివృద్ధికి అదానిని చిహ్నంగా చూయిస్తూ, దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంటే చూడలేని వారు, అభివృద్ధిని దెబ్బతీసి, దేశాన్ని వెనుకబడిన స్థితిలో ఉంచటం కోసమే అదాని సంస్థలపై ఆరోపణలు చేస్తున్నారని ఎదురుదాడికి పూనుకున్నాయి.

అదాని అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు. సెబి స్వతంత్రంగా వ్యవహరించటం లేదు కాబట్టి స్వతంత్ర సంస్థచేత

దర్యాప్తు చేయించాలని కూడా కోరారు. కాని సుప్రీంకోర్టు సెబియే దర్యాప్తు చేయాలని చెప్పింది. సెబి అదాని అక్రమాలను కప్పిపుచ్చటానికి పూనుకున్నది.

అమెరికా అధికారులు దాఖలు చేసిన పత్రంలో మన రాష్ట్రంలోని మంత్రులు, అధికారులకు ఇచ్చిన ముడుపులను గురించి కూడా పేర్కొన్నారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తికి అదాని కంపెని ప్రతినిధులు 1750 కోట్ల రూపాయలు లంచంగా ఇచ్చారని వెల్లడించారు. నేరపూరితమైన చర్యలకు పాల్పడిందని అమెరికా న్యాయశాఖ చేసిన ఆరోపణలు, సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్ చేసిన వెల్లడించిన విషయాలలోనూ సోలార్ ఎనర్జి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) అనుసరించిన విధానాలు కేంద్ర స్థానంలో ఉన్నాయి. పరాయి దేశం నుండి ఇంత తీవ్రమైన ఆరోపణలు వచ్చినా వాటిపై దర్యాప్తుకు ఆదేశించటం, వివరణలు ఇవ్వటం లేదా అమెరికా అధికారుల ఆరోపణలను తిరస్కరించటం కాని సెకి చేయలేదు. 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి' అన్న చందంగా మౌనమే సమాధానంగా సెకి వ్యవహరిస్తున్నది. ఈ అక్రమాలలో ఆ సంస్థ పాత్ర గురించి ఇది మరిన్ని సందేహాలను రేకెత్తిస్తున్నది.

**విద్యుత్ అధికధరలకు బాధ్యులెవరు?**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపు, సర్‌ఛార్జీలకు మీరంటే మీరు బాధ్యులని అధికారంలో ఉన్న టిడిపి, ఇంతకు ముందు అధికారంలో ఉన్న వైసిపి పరస్పరం విమర్శించుకొంటున్నాయి. అదాని విద్యుత్ సంస్థలతో తాము ఒప్పందం చేసుకోలేదని జగన్మోహన రెడ్డిగారు బుకాయిస్తున్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న టిడిపి ప్రభుత్వం, నాయకులు అదాని పేరెత్తటం లేదు. కాని అదాని విద్యుత్‌ను కొనుగోలు చేయటం వలన ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాలలోని ప్రజలు ఏ విధంగా అధిక ధరలు చెల్లించాల్సి వస్తున్నదో అమెరికా సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ కమిషన్ వివరంగా పేర్కొంది.

అదాని గ్రీన్ ఎనర్జి సంస్థ నుండి సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందాలు చేయించటం కోసం 2250 కోట్ల రూపాయలు ( 265 మిలియన్ డాలర్లు-) లంచాలుగా ఇవ్వటానికి గౌతం అదాని, సాగర్ అదానిల నాయకత్వంలో పథకాన్ని రూపొందించారని అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రైవేటు సౌర విద్యుత్ ఉత్పత్తి

> **"ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపు, సర్‌ఛార్జీలకు మీరంటే మీరు బాధ్యులని అధికా రంలో ఉన్న టిడిపి, ఇంతకు ముందు అధికారంలో ఉన్న వైసిపి పరస్పరం విమర్శిం చుకొంటున్నాయి. అదాని విద్యుత్ సంస్థలతో తాము ఒప్పందం చేసుకోలేదని జగన్మోహన రెడ్డిగారు బుకాయిస్తు న్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న టిడిపి ప్రభుత్వం, నాయకులు అదాని పేరెత్తటం లేదు."**



ఒకే తాను గుడ్డలు

దారుగా అభివృద్ధి కావటానికి ఈ ఒప్పందాలు అదాని గ్రూపుకు అత్యంత కీలకం. ఇందుకోసం అదాని గ్రీన్ ఎనర్జి 2021,సెప్టెంబరులో కార్పొరేట్ బాండ్ల ద్వారా 75 కోట్ల డాలర్లు -6375 కోట్ల రూపాయలు- రుణాలు సేకరించింది. ఇందులో 17.5 కోట్ల డాలర్లు -1487 కోట్ల రూపాయలు- అమెరికాలోని మదుపర్ల నుండి సేకరించారు. విదేశీయులు పాల్పడే మోసాలను అరికట్టే చట్టాన్ని అనుసరించి నిధులు సేకరించే వారు తాము లంచాలను నిరోధించే అమెరికా చట్టాలకు కట్టుబడి ఉన్నామని తప్పనిసరిగా డిక్లరేషన్ ఇవ్వాలి. సెకి నుండి విద్యుత్ కొనుగోలు చేసే విధంగా ఒప్పందాల (పిపిఎ)పై సంతకాలు చేయించటం కోసం విద్యుత్ పంపిణి సంస్థల-డిస్కాంలు-కు లంచాలు ఇవ్వటానికి పథకం రూపొందించిన తర్వాత కూడా అదాని గ్రూపు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చిందని అమెరికా రెగ్యులేటర్లు పేర్కొన్నారు.

అదాని గ్రీన్‌తో పాటు సెకి కాంట్రాక్టులు దక్కించుకున్న అజూర్ గ్లోబల్ పవర్ కూడా ఈ లంచాల భాగోతంలో భాగస్వామి కావటానికి అంగీకరించింది. లాభదాయకం కాదనే సాకుతో ఆంధ్రప్రదేశ్‌లో తాను దక్కించుకున్న ప్రాజెక్టును అదాని గ్రీన్‌కు అజూర్ అప్పగించింది. అదాని గ్రీన్‌కు వస్తున్న ఆదాయం 50 మిలియన్ డాలర్లు-425 కోట్ల రూపాయలు- మాత్రమే కావటం వలన ఆ కంపెనీకి లాభాలు రావటం లేదు. కాని సెకి చేసుకున్న ఒప్పందం ద్వారా అదాని గ్రీన్ ఎనర్జికి 100 కోట్ల డాలర్లు-8,500 కోట్ల రూపాయలు-లాభాలు వస్తాయని అమెరికా సెక్యూరిటీస్ ఎక్ఛేంజి కమిషన్ పేర్కొంది. కాని ఇందులో ఉన్న మతలబేమిటంటే అదాని విద్యుత్‌ను అధికధరలకు కొనేలా వివిధ రాష్ట్రాలలోని డిస్కాంలను సెకి ఒప్పిస్తేనే ఈ లాభాలు వాస్తవ రూపం దాలుస్తాయి. అపుడు మాత్రమే సెకి ఈ రెండు ప్రైవేటు సంస్థల నుండి విద్యుత్‌ను అధిక ధరలకు కొని, 25 సంవత్సరాల పాటు రాష్ట్రాలలోని పంపిణి సంస్థలకు అమ్మగలుగుతుంది.

అవినీతి పథకం అమలులోకి వచ్చే వరకు ఐదు రాష్ట్రాలు-ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గడ్, జమ్మూకాశ్మీర్, తమిళనాడు- అదాని విద్యుత్‌ను మార్కెట్ ధరల కన్నా అధికధరలకు కొనుగోలు చేయటానికి అంగీకరించలేదు. అదాని, అజూర్ విద్యుత్‌కు అధికధరలు చెల్లించటానికి సెకి అంగీకరించటం ఇందులో కీలకమైనది. ధరలు భరించగలిగేలా ఉంటాయ లేదా అన్నది చర్చించకుండా, రాష్ట్రాలను సంప్రదించకుండా ఇంత అధిక ధరలు చెల్లించటానికి సెకి అంగీకరించింది. సౌర విద్యుత్ ధరలు క్రమంగా తగ్గుతున్న పరిస్థితులలో ఇంత అధికధరలు చెల్లించటం వినియోగదారులను, పరిశ్రమలను దెబ్బతీస్తుంది.


అదాని గ్రీస్ సంస్థకు లాభాలు కట్టబెట్టటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహ

(మిగతా11వ పేజీలో)

**అధ్యయనం**

# ఆంధ్రప్రదేశ్‌లో వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు

**ఎన్ పురేంద్ర ప్రసాద్**



రచయిత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సోషియాలజీ విభాగాధిపతి

(గత సంచిక తరువాయి)

వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు మాత్రమే కాకుండా మధ్య తరగతి, పెద్ద రైతులు కూడా వలసలు పోతున్నారు. కొందరు రోజువారీగా, కొందరు ఆయా సీజన్లలో, కొద్దిమంది శాశ్వతంగా వలసలు పోతున్నారు. "బోరుబావులు పనిచేయకపోవటం వలన తాను ఆరు లక్షల రూపాయలు అప్పు చేసినట్లు, ఈ అప్పులను చెల్లించలేకపోతే తమకున్న ఒకే ఒక జీవనాధారమైన భూమిని అమ్ముకోవలసి వస్తుందని" ఎథోడ్ గ్రామస్తుడు ఎట్టెన్న చెప్పారు. గ్రామంలో బి టెక్ చదివిన 10 మంది నిరుద్యోగులుగా ఉన్నారు.

వారు కొద్ది నెలలు గ్రామంలో పనిచేసి, తర్వాత వలసలు పోతారు. పురుషులకు గ్రామంలో రోజుకు 120 రూపాయల కూలి ఇస్తారు. దగ్గరలోని చిన్న పట్టణం పుంగనూరులో 250 రూపాయలు ఇస్తారు. ఉదయం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు పని చేయాలి. మేం ఇంటికి చేరే సరికి రాత్రి 10 గంటలు అవుతుందని వారు చెప్పారు. గత మూడు సంవత్సరాల నుండి తాము పశవులను అమ్ముకొంటున్నట్లు అనేక మంది చెప్పారు. వలసలపై అనుసరించే వ్యూహంలో భాగంగా పనుల కోసం యువకులను బెంగళూరుకు పంపిస్తారు. స్త్రీ, పురుషులు పెద్దవారు దగ్గర ఉన్న పట్టణాలలో దిన కూలీ పనులకు పోతారు. పిల్లలను హాస్టళ్ళలో చేరుస్తారు. వృద్ధులను ఇంటి వద్ద వదిలేస్తారు. రెండు దశాబ్దాలుగా కరువు పరిస్థితులు ఉండటం, భూగర్భ జలాలు లోతుకుపోవటంతో వ్యవసాయ సంక్షోభం నూతనదశకు చేరింది. దీనితో వివిధ సమూహాలకు చెందిన వారు వలసలు పోవటం కోసం వ్యూహాలను రూపొందించుకుంటున్నారు.

వలసలు వెళుతున్న వారితో జరిపిన చర్చలలో కొన్ని విషయాలు వెల్లడైనాయి. ఒకటి, వలసలు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. వారిలో ఎక్కువ మంది కర్ణాటక, కేరళ వెళుతున్నారు. మధ్య తరగతి, పెద్ద రైతులు కూడా వలసలు వెళ్ళక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. పట్టణాలలో సెక్యూరిటీ గార్డులుగా, పెట్రోలు బంకులలోనూ వారు పనులు చేస్తున్నారు. రెండవది, గ్రామాలలో ఉన్న వృద్ధులతో కనీసం రోజువారీగా మాట్లాడటానికి కూడా ఎవ్వరూ ఉండటం లేదు. జీవించటం, పని పరిస్థితులు కఠినంగా మారటంతో ప్రజలు వలసలు పోవటానికి సిద్ధపడుతున్నారు. వంతెనల కింద, దేవాలయాలు, పాడుపడిన ఇళ్ళు, పేవ్‌మెంట్లపై వారు నివసిస్తారు. కేరళ వెళ్ళిన వారిలో కొందరు భిక్షాటన చేస్తున్నారు. ఆదివాసీలు, ముస్లింలలో వ్యభిచరించటం పెరిగింది. మూడవది, దండుపల్లిలో 40 ఎకరాల భూమి ఉన్న పెద్ద రైతు ఒకరు వలస వెళ్ళి, సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ ప్రాంతంలో 30-40 ఎకరాల భూమి ఉన్న రైతులు వలసలు పోవటం జరుగుతుంటుంది. గతంలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు మాత్రమే వలసలు పోయేవారు. గత 15 సంవత్సరాల నుండి పైకులాలలోని వారు కూడా వలసలు పోతున్నారు. వలసలు వెళ్ళిగా వచ్చిన ఆదాయంలో మిగిలిన మొత్తాన్ని వ్యవసాయంలో ఖర్చు చేస్తారు. వరుసగా కరువులు రావటం వలన పంటలు నష్టపోయినప్పటికీ వ్యవసాయంలో ఆదాయం వస్తుందని, అప్పులు తీర్చగలమని భావిస్తూ తిరిగి పెట్టుబడులు పెడుతున్నారు. ఇతర కులాలతో పోల్చుకున్నపుడు పై కులాలకు చెందిన వారు వ్యవసాయం సాగించక తప్పని పరిస్థితులలో ఉన్నారు.

వలసలు వెళ్ళినవారు పండుగలపుడు మాత్రమే తిరిగి వస్తారు. రాష్ట్ర ప్రభుత్వం బయో మెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత సబ్సిడి బియ్యం తీసుకోవటానికి వేలిముద్ర తప్పనిసరి అయింది. ప్రతి దానిని బయో మెట్రిక్ విధానంతో ముడిపెట్టారు. ఆరోగ్య కార్డు, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కార్డు, పంట రుణాల రద్దు, ఇన్స్యూరెన్స్, సబ్సిడీలు తదితర భవిష్యత్‌లో చేకూరే ప్రయోజనాలను పొందటానికి రేషన్‌కార్డు ప్రాతిపదికగా ఉంది కాబట్టి, బియ్యం అవసరం లేనప్పటికీ రేషన్ కార్డును కోల్పోవటానికి వారు అంగీకరించటం లేదు. వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, ఇతర ప్రయోజనాలు రాజకీయాలతో ముడిపడి ఉంటున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. వాస్తవ సమాచారం మాత్రమే కాక ఒక రాజకీయ పార్టీకి విధేయంగా ఉంటే ఈ ప్రయోజనాలు పొందటానికి వారి అర్హత పెరుగుతుంది.

వలసలు వెళున్నవారిలో అన్ని గ్రూపుల వారూ తమ పిల్లలను విద్యావంతులను చేయాలని ఆశిస్తున్నారు. ఈ ఆశతోనే వారు రోజువారీ జీవితంలో పోరాడుతున్నారు. విద్య, వైద్యాలను ప్రభుత్వం మరింతగా ప్రైవేటీకరిస్తున్నది. ఫలితంగా వీటిపై ఖర్చు అనేక రెట్లు పెరుగుతున్నది. విద్యపై ప్రతి కుటుంబం సగటున నెలకు 1000-3000 రూపాయలు ఖర్చు చేస్తున్నది. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరైనా రక్తపోటు, సుగరు, ఇతర దీర్ఘకాలిక రోగాలతో ఉన్నారు. దీనితో ప్రతి కుటుంబం ఆరోగ్యం కోసం 1000 రూపాయలు ఖర్చు చేస్తున్నది. వీటితో పాటు తల్లి, పిల్లల ఆరోగ్యం, గర్భవతులుగా ఉన్నవారు, ఇతరాలపై సంవత్సరంలో రెండుసార్లు 5000 నుండి 10,000 రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ కనీసం రెండు సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. వాటిపై నెలకు 500 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వంటగ్యాస్, కట్టెలు, పండుగలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు అయ్యే ఖర్చులకు ఇది అదనం. అభివృద్ధి క్రమంలో ఇవన్నీ అవసర ఖర్చులుగా మారిపోయాయి.

వ్యవసాయ ఖర్చులతో పాటు కరువులు, పెళ్ళిళ్ళు, సామాజికంగా అవసరమైన ఖర్చులు, ప్రమాదాలు, ఊహించని ఇతర ఖర్చుల కోసం ఎక్కువ వడ్డీరేట్లతో అప్పులు చేస్తున్నారు. అనేక కుటుంబాలలో నిరుద్యోగులు, పెళ్ళికాని పిల్లలు, వృద్ధులు, పనిచేసే శక్తిలేని వారి భారం పనిచేసి సంపాదించే వ్యక్తులు మోస్తున్నారు. కరువు, ఉత్పాతాలు, పంటలు పండకపోవటం మాత్రమే కాక, ఈ విధమైన అత్యవసర ఖర్చులు కూడా వలసలు పోక తప్పని పరిస్థితులను కల్పిస్తున్నాయి. అందువలన ప్రజలు సంఘటిత, అసంఘటిత రంగాలలో వివిధ రకాలైన పనుల కోసం అన్వేషిస్తున్నారు.

**❝ ఈ మూడు ప్రాంతాలలోనూ జరిపిన అధ్యయనంలో కొన్ని ధోరణులు అర్థమయ్యాయి. ఒకటి, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు భూములు తీసుకోవటం వలన చిన్న, సన్నకారు రైతులు భూములు లేనివారుగా, నిరుద్యోగు లుగా మారుతున్నారు. ప్రభుత్వం దళితుల కిచ్చిన అసైన్‌మెంట్ భూములను భూములున్న తరగతుల వారు ఆక్రమించుకోవటం లేదా ప్రజావసరాల పేరుతో ప్రభుత్వం తిరిగి స్వాధీ నం చేసుకోవటం పెరిగింది. ❞**

### చర్చ

వలస విధానం వ్యవస్థాగతంగా, వ్యక్తిగతంగా విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన క్రమంలో వలసలు పెరగటం అనివార్యం అని కొందరు పండితులు వాదిస్తున్నారు (బ్రెన్నన్, 1985, గిద్వాని, శివరామకృష్ణన్ కె, 2003, ఆల్పా షా 2006). గత రెండు దశాబ్దాలలో జరుగుతున్న పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రజల జీవనాధారాలపై దెబ్బకొట్టింది. ''యంత్రాలు, రసాయనాలు, ఇతర పద్ధతులలో నిరంతరం మార్పులు జరుగుతుండటంతో పాటు ఉత్పత్తిలో వినియోగించే సాంకేతికతలు, కార్మికుల పని, జీవన క్రమంలో కూడా మార్పులు తీసుకొస్తుంది'' అని పెట్టుబడిదారీ విధానానికి పరివర్తనపై మార్క్స్ చెప్పిన అంశాలను పాల్ స్వీజి ఉదహరించాడు. భూములను స్వాధీనం చేసుకోవటం ద్వారా పెట్టుబడులను పోగుచేసుకోవటం, శ్రామికులను తయారు చేయటం అన్న రెండంశాలు నయా ఉదారవాద అభివృద్ధి వ్యూహంలో భాగంగా అమలు జరుగుతున్నాయని మూడు ప్రాంతాలలోనూ జరిపిన క్షేత్రస్థాయి అధ్యయనంలో వెల్లడైంది. వలస కార్మికులు వివిధ రకాలుగా తీవ్రమైన దోపిడీకి గురవటానికి ఈ క్రమం దారితీసింది. యజమానులను రాజకీయాలలో భాగస్వాములను చేయటం ద్వారా పెట్టుబడి, రాజ్యం కూటమిగా కార్మికులను వివిధ రూపాలలో తీవ్రంగా దోపిడి చేస్తున్నాయని 2015లో గురియన్ చెప్పాడు.

ఈ మూడు ప్రాంతాలలోనూ జరిపిన అధ్యయనంలో కొన్ని ధోరణులు అర్థమయ్యాయి. ఒకటి, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు భూములు తీసుకోవటం వలన చిన్న, సన్నకారు రైతులు భూములు లేనివారుగా, నిరుద్యోగులుగా మారుతున్నారు. ప్రభుత్వం దళితుల కిచ్చిన అసైన్‌మెంట్ భూములను భూములున్న తరగతుల వారు ఆక్రమించుకోవటం లేదా ప్రజావసరాల పేరుతో ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవటం పెరిగింది. ఫలితంగా దిగువ తరగతులు, కులాల ప్రజలు వలసలు పోవటం మినహా గత్యంతరం లేని పరిస్థితులకు దారితీస్తున్నది. రెండవది, అన్ని అభివృద్ధి ప్రాజెక్టులలోనూ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కొద్దిమందిని శాశ్వత ఉద్యోగులుగా, మిగతా అత్యధికులను కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులుగా తీసుకొంటున్నారు. అన్ని పరిశ్రమలలోనూ స్థానిక ప్రజలను ఉద్యోగాలలోకి తీసుకోకపోవటం చట్టం లాగా అమలు జరుగుతున్నది. ఫలితంగా వారు మూడు ప్రాంతాలలోనూ వలస కార్మికులుగా మారుతున్నారు. మూడవది, అభివృద్ధి పేరుతో గత రెండు దశాబ్దాలలో వచ్చిన ప్రాజెక్టులన్నీ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. మనుష్యులు, పశుసంపదపై పర్యావరణ పరంగా వినాశకరమైన ప్రభావం కలిగిస్తున్నాయి. ఫలితంగా ఈ ప్రాంతాలలోని ప్రజలు అన్ని రకాలైన వ్యాధుల బారినపడటంతో అప్పులు చేయటం తప్పనిసరియై దరిద్రంలోకి దిగజారుతున్నారు. నాలుగవది, పరిశ్రమలు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటి, పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగితే బీమా లాంటి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయటం లేదు. మరోవైపున సబ్సిడి బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డు లాంటి పథకాల ద్వారా లబ్ధి పొందటం కోసం స్థానిక నివాసులుగా నమోదు చేయించుకోమని ప్రభుత్వం చెబుతున్నది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బయో మెట్రిక్ విధానం తమ గుర్తింపును నిలబెట్టుకోవటం కోసం నిరంతరం పరుగులు తీయాల్సిన పరిస్థితిని వలస కార్మికులకు కల్పించింది.

కేవలం బతకటం కోసం మాత్రమే కాక విద్య, ఆరోగ్యం, మంచినీరు తదితర పెరుగుతున్న వినియోగ అవసరాలను తీర్చుకోవటం కోసం కూడా పట్టణాలలో పని దొరుకుతుందనుకున్న చోట్లకు ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల నుండి కార్మికులు పరుగులు తీస్తున్నారు. పెట్టుబడిదారీ అభివృద్ధి ఒకవైపున ప్రజలను దరిద్రులుగా మార్చటం, వివిధ తరగతుల ప్రజలు వలసలు పోయేలా చేస్తూ, మరోవైపున ఎప్పటికీ తీరని అవసరాలను సృష్టిస్తున్నది. వలస కార్మికులు-స్థానిక కార్మికులు, నైపుణ్యం ఉన్న-నైపుణ్యం లేని కార్మికులు, కాంట్రాక్టు - పర్మినెంటు కార్మికుల మధ్య వైరుధ్యాలు తీవ్రం అవుతున్నాయి. ఈ విధానాలకు ఎదురౌతున్న ప్రతిఘటన అభివృద్ధి వ్యతిరేకమైనదని ప్రభుత్వం ముద్ర వేస్తున్నది. ఈ నేపథ్యంలో వలస విధాన సంక్లిష్టతను, ప్రస్తుత అభివృద్ధి సిద్ధాంతాలను సవాలు చేస్తున్న ప్రశ్నలను అర్థం చేసుకోవాల్సి ఉంది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

ఆర్థిక రంగం

# భారతదేశ అసమానతలు: తప్పుడు సిద్ధాంతాలు



అశోక్ మోడీ అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం నుండి ఈ మధ్యనే ఉద్యోగ విరమణ చేశారు. గతంలో ఐ.ఎం.ఎఫ్ ప్రపంచ బ్యాంక్ లలో పనిచేసారు. 'ఇండియ ఈజ్ బ్రోకెన్: ఎ పీపుల్ బెట్రేయ్డ్, ఇండిపెండెన్స్ టు టుడే' అన్న పుస్తకం (2023) వెలువరించారు.

**అశోక మోడీ**

**2005** జూన్ 4న గౌరవనీయ టాటాగారి వ్యాపారసంస్థ ఛత్తీస్‌ఘడ్ లోని బస్తర్‌లీ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకొన్నది. అదే రోజున బస్తర్‌లీ పెట్టుబడి దారుల ప్రయోజనాలు కాపాడడం కోసం 'సల్వాజుడుం' పేరిట ఒక ప్రైవేటు సైన్యం అవతరించింది. చత్తీస్‌ఘడ్ శాసనసభలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేంద్రకర్మ 'సల్వాజుడుం'ని నడిపిస్తూ, నియంత్రిస్తూ ఉన్నాడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం ఆదివాసీల హక్కుల పరిరక్షణకన్నా బడా వ్యాపారుల హక్కులు కాపాడే విషయంలో కాంగ్రెస్ పార్టీతో ఏకాభిప్రాయంతో కలిసి పనిచేసింది. బస్తర్‌లోకి కొత్త కొత్త పెట్టుబడి దారుల రాకతో సల్వాజుడుంకి దన్నుగా రాష్ట్ర పారా మిలిటరీ దళాలు కూడా నిలబడి ఆదివాసీలకు, ఆదివాసీల హక్కులకోసం పని చేస్తున్న నగ్జలైట్లకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించి రక్తం ఏరులై పారించాయి.

ఒక ఏడాది గడవకముందే 2006 ఏప్రిల్ నెలలో 13 రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రసంగిస్తూ 'స్వాతంత్ర్యం సిద్ధించాక దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద అంతర్గత ప్రమాదం నగ్జలిజమే' అని ప్రకటించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యని అంతర్గత భద్రతకు ప్రమాదకరమైన అంశం అని ప్రకటించడం ద్వారా ప్రధాని ఒక పక్షం తరపున వకాల్తా తీసుకున్నాడు. ఆయనలోని మేధోతనం, మానవీయతా కోణాలు ఒకప్పుడు 'భారత ప్రభుత్వం బాగా వెనుకబడిన ప్రాంతాలకు సామాజిక న్యాయం అందించడంలో విఫలమైనందునే అక్కడి ప్రజలు పరాయీకరణకు లోనయ్యారు' అని మాట్లాడించాయి. ఆయనలోని రాజకీయవేత్త మాత్రం 1960వ దశకంలో సామాజిక నిరసనలను అణిచివెయ్యడానికి శ్రీమతి ఇందిరాగాంధీ పోలీసు, మిలిటరీ బలగాలను ప్రయోగించిన తీరు నుండి స్ఫూర్తి పొంది శక్తివంతమైన వ్యాపార సామ్రాజ్యాల కొమ్ముకాసే పనికి ప్రేరేపించాయి.

రెండు దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన సల్వాజుడుం స్వాతంత్ర్యానంతర భారతదేశంలో, రాజ్యం-పెట్టుబడిదారుల ప్రయోజనాలు చిక్కగా, ఒకటిగా పెనవేసుకుపోయిన ఇవాళ్టి రోజుల్లో తిరిగి తలెత్తే పరిస్థితి దాపురించింది. పర్యావరణరీత్యా అతిసున్నితమైన పర్వత ప్రాంతాల్లో నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీలను వారి వారి నివాసప్రాంతాల నుండి నిరాశ్రయులను చేసే విధంగా బడా వ్యాపారసంస్థలకు అనుమతులు ఇవ్వడమే కాకుండా, వాటిప్రయోజనాలకు అనుగుణంగా బలప్రయోగం వినియోగించడానికి ప్రభుత్వం అర్ధ సైనిక, సైనిక బలగాలను మోహరించింది. ఈ అంశం మీద చర్చకు తావులేకుండా చెయ్యడానికి 'జాతీయ భద్రత రీత్యా' అన్న పాట ఎత్తుకున్నది. తిలకాష్ఠ మహిషబంధం వంటి 'జాతీయ భద్రత' అన్న పదబంధాన్ని ఉపయోగించాక దానికి వ్యతిరేకంగా ఎవరు మాత్రం ఏం వాదించగలరు?

ఈ మొత్తం వ్యవహారం భారతీయ తరహా మార్కెట్ సరళీకరణ పరాకాష్ఠకు కొండగుర్తు వంటిది. 1985లో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ఇచ్చిన పన్ను మినహాయింపులతో మొదలయిన ఈ సరళీకరణ 1991 వేసవి కాలం నాటికి ధనవంతుల సుంకాలను తగ్గించడం, పారిశ్రామిక నియంత్రణలు ఎత్తివెయ్యడం తదితర చర్యలతో ఊపందుకున్నది. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే సరళీకరణ పేరిట శ్రామికుల ప్రయోజనాలకన్నా పెట్టుబడి ప్రయోజనాలకు పెద్దపీట వేసే ప్రక్రియ స్థిరపడి పోయింది. సల్వాజుడుం అనేది ఈ ప్రక్రియలో అంతర్భాగమే. పెట్టుబడిదారీ అనుకూల సిద్ధాంతం నానాటికీ ప్రశ్నించ వీలులేని స్థాయికి క్రమంగా ఎదిగింది.

ప్రపంచవ్యాప్తంగానే శ్రామికులకు బదులు పెట్టుబడికి అనుకూలమైన విధానాలు అవలంబించే ధోరణులు బలపడ్డాయి. మన దేశ విధానరూపకర్తలు కూడా ఈధోరణిలోనే పడి కొట్టుకుపోతున్నారు. 1980వ దశకం తొలి నాళ్ళలో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ఏమాత్రం వెరపు లేకుండా ఈ విధానాలకు శ్రీకారం చుట్టాడు. అంతర్జాతీయ పరిభాషలో దీనినే 'నయా-ఉదారవాదం' అని ముద్దుగా పిలుచుకున్నారు. కానీ భారతదేశంలో ఈ పదాన్ని తిట్టుకింద భావిస్తారు. అందుకే నయా-ఉదారవాద విధానాలకు 'సరళీకరణ విధానాలు' అన్న పేరిట మనదేశంలో చలామణీలోకి తీసుకువచ్చారు. ఏ పేరు పెట్టినా ఈసిద్ధాంతం ఆడంస్మిత్ ప్రవచించిన స్వేచ్ఛా మార్కెట్లు, 'పోటీతత్వ పెట్టుబడిదారీ' విధాన సూత్రాలకు వ్యతిరేకమైనది. వాస్తవానికి ఇది 'కులీన అభివృద్ధి నమూనా'. ఇంకాస్త వివరంగా చెప్పుకోవాలంటే సమాజంలో అసమానతలు సృష్టించి, వాటిని తీవ్రతరం చెయ్యడానికి రాజ్యం అనుసరించే రాజకీయాధికార నమూనా ఇది.

ఈ కులీన అభివృద్ధి నమూనా మెజారిటీ ప్రజానీకానికి ఒరగబెట్టేది ఏం ఉండదు కాబట్టి పాలకులు మధ్యేమార్గాన్ని ఎంచుకున్నారు. దానికే మానవీయ పెట్టుబడిదారీ విధానం అన్న పేరు తగిలించారు. 1990 నుండి

2000 వరకు అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్, బ్రిటన్ ప్రధాని టోనీబ్లెయిర్‌లు ఈ మధ్యేమార్గాన్ని అనుసరించారు. మన్మోహన్‌సింగ్ కూడా తాను అదే బాటన నడుస్తున్నానని చెప్పేవారు. ఆయన సారధ్యం వహించిన యు.పి.ఎ ప్రభుత్వం వామపక్ష భావజాల ప్రేరేపిత 'సామాజిక న్యాయాన్ని' అందించే మొనగాడిగా ప్రచారం చేసుకుంది. 2005 ఆగస్టులో ఆదివాసీలకు వ్యతిరేకంగా 'సల్వాజుడుం' పేరిట ప్రైవేటు సైన్యాన్ని ఎగదోసిన ప్రభుత్వమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ముందు మహాత్మాగాంధీ పేరు తగిలించి మరీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని నమ్మించడానికి గట్టి ప్రయత్నమే చేసింది. వాస్తవానికి ఈ పథకం సదాశయంతో రూపొందించబడింది. కానీ ఈ పథకం తొలినాళ్ళ నుండి లోపభూయిష్టంగా అమలయ్యింది. ఈ పథకం కింద పనులు చేసినవారికి కొన్ని చోట్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన 'కనీసవేతనాల' కన్నా తక్కువ మొత్తాలు చెల్లించారు. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకం. అలాగే ఈ పథకానికి తగినన్ని నిధులు కేటాయించని మూలాన జీతాల చెల్లింపు చాలా ఆలస్యంగా జరిగేది.

ఈ విధంగా సామాజికన్యాయానికి అర్థ మనస్కంగా అంగీకరిస్తూనే సంపన్న వర్గాల ప్రయోజనాల కొమ్ముకాయడానికి మాత్రం ఎక్కడలేని ఆత్రం ప్రదర్శించారు. పైపెచ్చు త్వరితగతిన అభివృద్ధి సాధించడానికి ఇదే మార్గం అనే దబాయింపులకు దిగారు. 'ప్రజలు ఎప్పుడయితే వాళ్ళ వాళ్ళ స్వీయ భౌతిక ప్రయోజనాల కోసం పాటుపడతారో తద్వారా ఇతరుల బతుకులు మెరుగుపడడానికి కూడా తోడ్పడతారు' అన్న ఆడంస్మిత్ ఆర్థిక సూత్రాన్ని తప్పుడు రీతిలో అన్వయించుకున్నారు. సంపన్నవర్గాలకు అన్నివిధాలా సాయం అందిస్తే వాళ్ళు సమాజంలోని ఆర్థిక అంతరాలు సమసిపోయేందుకు దోహదపడతారు అన్న విధానాన్ని ఆచరణకు తెచ్చారు. 'సమాజంలోని అసమానతలు వృద్ధికి దోహదం చేస్తాయి' అన్న సిద్ధాంతం సరి కాదనడానికి కావల్సినంత చారిత్రక అనుభవాలు మన ముందు ఉన్నాయి. 'స్వార్థం' అనేది వ్యక్తిగత నైతికత, కష్టించి పనిచేసేతత్వం, స్వయం పోషకత్వానికి బాటలు వేస్తుంది అని కొత్త సిద్ధాంతం తీసుకొచ్చారు. ఈ లెక్కన పేదలు పనిబద్ధకస్థులు, నీతిలేని వాళ్ళకింద పరిగణించబడతారు.

కానీ ఆడంస్మిత్ వ్యక్తిగత నైతికతకు బదులు సమిష్టి నైతికత గురించి ఎక్కువగా నొక్కి వక్కాణించాడు. సమాజాలు ప్రజలందరి ప్రయోజనాలు పెంపొందించే రీత్యా సమిష్టి నైతికత పాటించాలని చెప్పాడు. 1776లో ఆడంస్మిత్ రాసిన 'వెల్త్ ఆఫ్ నేషన్స్' (దేశాలసంపద) పుస్తకంలో ఉమ్మడి సంక్షేమం పెంపొందించడం రాజ్యధర్మం అని స్పష్టం చేసాడు. ఇందుకు ప్రభుత్వమే విద్యాబుద్ధులు నేర్పించాలి, సరైన బాధ్యతాయుతమైన న్యాయ వ్యవస్థ ఉండాలి, యజమానుల ఆధిపత్యాన్ని నిలవరించడానికి కార్మిక సంఘాలకు చేదోడుగా నిలవాలి, పేదల రక్షణ కోసం తగిన చర్యలు చేపట్టాలి అని వివరించాడు.

బ్రిటీష్ మాజీ ప్రధాని గోర్డన్ బ్రౌన్ అయితే ఆడం స్మిత్ అసలు సిసలయిన సామాజిక ప్రజాస్వామికవాది అంటాడు. 'వెల్త్ ఆఫ్ నేషన్స్' పుస్తకం ప్రచురించి 250 సంవత్సరాలు గడిచిన తరువాత ప్రజా నైతికత అంటే ప్రభుత్వ వైద్యం, గృహవసతి కల్పన, మానవీయ నగరాల రూపకల్పనలతో పాటు పర్యావరణ హితం కోసం ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి అన్న విస్తృతార్థం ఏర్పడింది.

కానీ మనదేశంలో 'సోషల్‌డెమోక్రసీ' అనేది తిట్టు పదం. విద్య, వైద్యం సహా అన్ని రంగాలూ ప్రైవేటీకరించబడాలి అన్నది ప్రభుత్వ విధానంగా మారింది. ప్రైవేటీకరించ వీలులేని న్యాయవ్యవస్థ, పర్యావరణాలను డబ్బున్న వాళ్ళకే అందుబాటులో ఉండేలా చూడడం ఈ విధానం ప్రత్యేకత.

మనదేశం ఏనాడూ సామాజిక ప్రజాస్వామిక విధానాలను పాటించలేదు. భారతీయ పెట్టుబడిదారీ వర్గం నెహ్రూ ప్రవచించిన కుహనా సోషలిజాన్ని అడ్డం పెట్టుకుని దేశాన్ని 'ప్రజా సమిష్టి సంక్షేమ' విధానాల నుండి దూరం చేసింది. 1980వ దశకం నుండి సంపన్న రాజకీయ వర్గాలు, వ్యాఖ్యాతలూ విచిత్రంగా 'నెహ్రూ అనుసరించిన దారి తప్పిన భారీ పారిశ్రామికీకరణ విధానాలకు విరుగుడుగా – అంటే నిన్నా మొన్నటిదాకా సోషలిస్టు విధానాలు అని కీర్తించిన నోటితోనే అవధులు లేని పెట్టుబడిదారీ విధానాలను అనుసరించాలని ఇల్లెక్కిన కోడిలా కూస్తున్నారు.

❝ భారతీయ పెట్టుబడిదారీ వర్గం నెహ్రూ ప్రవచించిన కుహనా సోషలిజాన్ని అడ్డం పెట్టుకుని దేశాన్ని 'ప్రజా సమిష్టి సంక్షేమ' విధానాల నుండి దూరం చేసింది. 1980వ దశకం నుండి సంపన్న రాజకీయ వర్గాలు, వ్యాఖ్యాతలూ విచిత్రంగా 'నెహ్రూ అనుసరించిన దారి తప్పిన భారీ పారిశ్రామికీకరణ విధానాలకు విరుగుడుగా - అంటే నిన్నా మొన్నటిదాకా సోషలిస్టు విధానాలు అని కీర్తించిన నోటితోనే అవధులు లేని పెట్టుబడిదారీ విధానాలను అనుసరించాలని ఇల్లెక్కిన కోడిలా కూస్తున్నారు. ❞

భారీ పారిశ్రామికీకరణ దారి తప్పిన విధానం అయి ఉండొచ్చుగాక ప్రజాసంక్షేమాన్ని విస్మరించడం, నిర్లక్ష్యం చెయ్యడం ఏరకంగా సరైనది అవుతుంది. వాస్తవానికి నెహ్రూ భ్రమల నుండి బయటపడుతున్న దశలో తాను అనుసరించిన విధానాలకు సోషలిజానికి పొంతనే లేదు అని వగచాడు. నెహ్రూవిధానాలు పెట్టుబడిదారుల గుత్తాధిపత్యానికి దారి తీసాయి. ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ ప్రధానమంత్రి క్లెమెంట్ అట్లీ ఫేబియన్ సోషలిస్టు విధానాలు అవలంభించాడు. నెహ్రూ కూడా ఈ విధానాలనే అనుసరించానని చెప్పుకునేవాడుకానీ ఆచరణలో విధానాల పునాది లక్షణాలకు వ్యతిరేకమైన విధానాలు అవలంభించాడు. ప్రజల వాస్తవిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్లెమెంట్ అట్లీ విద్య, వైద్య రంగాలకు చాలా ప్రాధాన్యత ఇచ్చాడు. నెహ్రూ మానవవనరుల అభివృద్ధి, ఉపాధి కల్పన అవకాశాలను నిర్లక్ష్యం చేసాడు.

నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ అధికార దాహంగల అవినీతి రాజకీయవేత్త. ఆమె కూడా సోషలిజం జపం చేస్తూ పేదల పెన్నిదిగా తనని తాను చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకునేవారు. ఆమె అనుసరించిన 'సోషలిస్టు' విధానాలకు తలమానికంగా చెప్పుకునే బ్యాంకుల జాతీయకరణ ఆనతికాలంలో, విచ్చలవిడి అవినీతికి అవకాశంగా మారిపోయింది.

సరళీకరణ విధానాలు అమలుచేసి ఇప్పటికి మూడుదశాబ్దాలు గడిచింది. ఇప్పటికీ భారతదేశంలోని శ్రామికశక్తిలో సగం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయేతర రంగాల్లో ఆర్థికంగా, శారీరకంగా అత్యంత కష్ట భూయిష్టమైన ఉపాధి అవకాశాలు మాత్రమే లభిస్తున్నాయి. 'రాజ్యం అనుచిత జోక్యం పెరిగిపోతా ఉంది' అన్న

**❝ ప్రపంచ విఖ్యాతి గాంచిన ఆర్ధికవేత్త థామస్ పిక్కిటీతో కలిసి తాజాగా చేసిన అధ్యయనంలో భారతదేశంలో ఆదాయ, సంపద అసమానతలు 1990ల నుండి అనూహ్యంగా పెరిగి పోయాయని స్పష్టతమౌతున్నది. 1991-2014 మధ్య కాలంలో సాగిన వివిధ సంకీర్ణ ప్రభుత్వాల పాలనలో కూడా ఈ అసమానతలు పెరుగుతూ వచ్చాయి. 2014లో అధికారం లోకి వచ్చిన భాజపా ప్రభుత్వం అయితే ఏమాత్రం సడలని రాజకీయ ఏకాభిప్రాయంతో అచ్చంగా సంపన్నవర్గాల అనుకూల విధానాలను అవలంభి స్తున్నది. ❞**

వాదనతో ప్రజారోగ్యం, మానవవనరుల అభివృద్ధి రంగాలు రెండూ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. 'సోషలిజం' అవమానకరమైన మకిలి బారిన పడింది. రాజ్యాధికారం సంపన్నులు అత్యంత సంపన్నులు కావడానికి తోడ్పడింది. తీవ్రమైన అసమానతలకు దారి తీసింది. బడా కార్పొరేట్ కంపెనీలు భారీ, అతిభారీ, మెగా ప్రాజెక్టులలో మాత్రమే పెట్టుబడులు పెడుతున్నాయి. దాంతో ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉంటున్నాయి.

ప్రపంచ విఖ్యాతి గాంచిన ఆర్ధికవేత్త థామస్ పిక్కిటీతో కలిసి తాజాగా చేసిన అధ్యయనంలో భారతదేశంలో ఆదాయ, సంపద అసమానతలు 1990ల నుండి అనూహ్యంగా పెరిగి పోయాయని స్పష్టం అవుతున్నది. 1991–2014 మధ్య కాలంలో సాగిన వివిధ సంకీర్ణ ప్రభుత్వాల పాలనలో కూడా ఈ అసమానతలు అదేరీతిలో పెరుగుతూ వచ్చాయి. 2014లో అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం అయితే ఏమాత్రం సడలని రాజకీయ ఏకాభిప్రాయంతో అచ్చంగా సంపన్నవర్గాల అనుకూల విధానాలను అవలంబిస్తున్నది.

**రాజకీయ ఏకాభిప్రాయపు ఉక్కుపిడికిలి.**

2002తో మొదలయి కేంద్రంలో యు.పి.ఎ. ప్రభుత్వ పరిపాలన సమాంతరంగా కొనసాగిన పదేళ్ళ కాలంలో గుజరాత్ రాష్ట్రం జాతీయ కులీన అభివృద్ధికి మొరటు నమూనాగా అవతరించింది. 2002లో గుజరాత్‌లో ముస్లిం ప్రజానీకంపై సాగించిన నరమేధం నేపథ్యంలో రాహుల్ బజాజ్ వంటి వ్యాపార దిగ్గజాలు గుజరాత్‌కు పెట్టుబడులు రాకుండా అలమటింప చేస్తాం అని హెచ్చరించిన నేపధ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీ 'వైబ్రంట్ గుజరాత్' పేరిట పెట్టుబడి పిశాచాల (జాంబీ) ఆవాహనోత్సవం నిర్వహించాడు.

స్థానిక వ్యాపారవేత్తలు, ముఖ్యంగా ఆదానీ సహా అనేకమంది గుజరాత్‌లో పెట్టుబడులు కుప్పించడానికి ముందుకు వచ్చారు. కానీ మోడీ కన్ను రతన్ టాటా వంటి అంతర్జాతీయ వ్యాపారవేత్త మీద ఉన్నది. అప్పటికి రతన్ టాటా నందిగ్రాంలో నెలకొల్పుతానన్న నానో కార్ల తయారీ పరిశ్రమ ఆది నిష్టురాలు ఎదుర్కొంటున్నది. భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు నిరసన తెలుపుతున్నారు. రైతులతో రాజీ పడడానికి సిద్ధంగాలేని టాటా బెంగాల్ నుండి నానో కార్ల తయారీ పరిశ్రమను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. నరేంద్ర మోడీ 'గుజరాత్ కు స్వాగరం' అని పొట్టి సందేశం పంపారు. మోడీని టాటా నిరాశపరచలేదు. ఆ రోజునుండి టాటా మోడీకి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. సి.యన్.యన్ ఛానల్‌లో ప్రతి ఆదివారం ఫరీద్ జకారియా నిర్వహించే ఇంటర్వ్యూలో మోడీపై టాటా పొగడ్తల వర్షం కురిపించారు.

టాటాలకు 'సామాజిక నిబద్ధత' జాస్తి అన్న పలుకుబడి ఉన్నది. కానీ ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని జె.ఆర్.డి. సమర్ధిస్తే, ఆయన వారసుడు రతన్ టాటా బస్తర్‌లో తమ కంపెనీ పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉనికిలోకి వచ్చిన ప్రైవేటు సాయుధ ముఠాని స్వాగతించడంతో పాటు రక్తపంకిలమైన మోడీతో చేతులు కలపడం ద్వారా 'సామాజిక నిబద్ధత ' అనే పదం పెద్ద విరోధాభాసాలంకారం అని టాటాలు పదేపదే రుజువుచేసారు.

టాటాల 'సామాజిక నిబద్ధత' ఇంత అడుగుజారిపోయి ఉంటే ఇంకా మిగిలిన పెట్టుబడిదారుల సంగతి చెప్పుకోవడానికి ఏమి ఉంటుంది? భారత దేశ అగ్రశ్రేణి వ్యాపారవేత్త అయిన ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ అయితే మోడీని 'ప్రజల ఇలవేలుపు, నాయకులకే నాయకుడు, రాజులకే రారాజు' అని కీర్తించారు. రతన్ టాటా అయితే గుజరాత్‌లో తాము మరిన్ని పెట్టుబడులు పెట్టకపోవడం పెద్ద తప్పే అని ఇంకో అడుగు ముందుకు వేసి మరీ చెప్పారు.

గుజరాత్ తరహా అభివృద్ధి నమూనా ప్రచార పటాటోపం సన్నగిల్లాక చూస్తే ఆ పేరిట రాష్ట్ర వనరులను కార్పొరేట్ కంపెనీలు కొల్లగొట్టాయని తేటతెల్లమయ్యింది. భూమి కారుచౌకగా కట్టబెట్టారు, వడ్డీలేని రుణాలు అత్యధిక మొత్తంలో లభించాయి, పన్ను రాయితీల వర్షం కురిసింది. పర్యావరణ అనుమతులు వంటివి లెక్కలోకి తీసుకోలేదు. 'రిలయన్స్, ఎస్టార్ స్టీల్, ఆదానీ పవర్ వంటి బడా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అయాచిత లబ్ధి చేకూర్చింది' అని పి.టి.ఐ. వార్తా సంస్థ నివేదించింది.

ఈ రకంగా లబ్ధి పొందిన కార్పొరేట్ కంపెనీలు 'వైబ్రంట్ గుజరాత్' కు తగినట్లుగా అధిక మూల్యానికి పెట్టుబడి ఆధారిత పరిశ్రమలు అనేకం స్థాపించాయి. పెట్రోలియం, ఇనుము, రసాయనాలు, మందుల తయారీ కంపెనీలు నెలకొన్నాయి. వీటివ యాలంగా గుజరాత్ స్థూల జాతీయోత్పత్తి పెరిగింది కానీ ఉపాధి అవకాశాలు పరిమితంగా లభించాయి. ఈ పరిశ్రమల మూలంగా భూమి, నదులు కలుషితమై పోయాయి.

రాష్ట్ర బడ్జెట్లో బడా కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చే రాయితీల కోసం కేటాయింపులు ఎక్కువ చెయ్యవలసి రావడంతో విద్య, వైద్యం, ఇతర సామాజిక సంక్షేమ పథకాలకు కేటాయింపులు సన్నగిల్లాయి.

చికాగో యూనివర్శిటీ తత్వశాస్త్ర ఆచార్యులు మార్తా నుస్‌బాం "మానవాభివృద్ధి సూచికల రీత్యా గుజరాత్ దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మధ్యస్థంగా ఉన్నది. అసలుకి భారతదేశ మానవాభివృద్ధి సూచికలే అధ్వాన్నంగా ఉన్నాయనుకుంటే 'వైబ్రంట్ గుజరాత్' గా పేరు పడిన రాష్ట్రం ఈ సూచికలో మధ్యస్థంగా ఉండడం ఏం సూచిస్తుంది? ఒక పక్కన రాష్ట్రస్థూల ఉత్పత్తి పెరుగుతా వస్తుంది. కానీ ఆయుః ప్రమాణం, మహిళల అక్షరాస్యత వంటి అనేక కీలక మానవాభివృద్ధి సూచికలలో దిగజారి పోయింది" అని వివరించారు.

2014 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడడంతో దేశంలోని మేథావులు అనేక మంది గుజరాత్ తరహా అభివృద్ధి నమూనాపట్ల ఏకాభిప్రాయానికి వచ్చారు. వామపక్షవాదిని అని చెప్పుకునే ప్రతాప్ భానుమెహతా 'మోడీ నిర్ణయాత్మకశైలి'ని పొగిడితే, మితవాద పక్షానికి చెందిన జగదీష్ భగవతి అయితే 'పారిశ్రామిక

ప్రగతికి రాచబాటలు వేస్తున్న మోడీ' అని కీర్తించారు. 'ప్రభుత్వం ఒక సైతాను' పేరిట పుస్తకం రాసిన గురుచరణ్ దాస్ అయితే ఏ ప్రాతి పదికన లెక్క కట్టాడో తెలియదు గానీ మోడీ ఏటా 8 నుండి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని ప్రకటించేసాడు. గోల్డ్‌మాన్ సాక్స్ మాజీ ఉన్నతాధికారి జిమ్ ఓనీల్ అంతర్జాతీయ మేధావుల సమ్మేళనంలో మోడీ ఏకపక్ష ధోరణుల మీద నేను తీర్పులు ఇవ్వలేనుగానీ ఆర్థికవ్యవస్థకు తగ్గ మంచిమనిషి అని కితాబు ఇచ్చాడు.

> **❝ మన్మోహన్ సింగ్ మనదేశ ప్రధానిగా పదవీ భాధ్యతలు చేపట్టాక 'మానవీయ కోణంలో పెట్టుబడిదారీ విధానం' అనే నినాదాన్ని జనాలకు ఎక్కించాల్సిన బాధ్యతను మేధావులు తమ భుజస్కంధాల మీదకు ఎత్తుకున్నారు. ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు అన్నీ పెట్టు బడిదారులకు, కార్పొరేట్‌లకు, సమాజంలో శక్తిమంతులకు అనుకూలంగా తీసుకుంటూ బడుగు బలహీన వర్గాలకు ఉపాధి హామీ పథకం కల్పించి తమది పేదల సంక్షేమం కోరే ప్రభుత్వం అని చాటి చెప్పుకోవడానికి ప్రయ త్నించింది. ❞**

భారతీయ పెట్టుబడిదారులు సరళీకరణ పేరిట ముఖ్యంగా గుజరాత్ తరహా అభివృద్ధి నమూనాతో పెరిగిపోతున్న అసమానతలు ఆర్థికవృద్ధికి దారితీస్తాయి అన్న పుక్కిట విశ్వాసాల ఆధారంగా చేపట్టిన చర్యలు వికటించాయి. అసలు ఈ వాదనకు తగిన ఆధారాలు గానీ, గణాంక సాక్ష్యాలు గానీ లేవు. సంపన్నులు ఎంత అతిసంపన్నులయితే సమాజంలో అట్టడుగు జనం వరకూ ఆ అభి వృద్ధి ఫలాలు అందుతాయి అన్న సిద్ధాంతమే శుద్ధ తప్పు.

1935–1965 మధ్యకాలంలో అమెరికా అధ్యక్షులుగా ఉన్న ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ దగ్గర నుండి లిండన్ బి జాన్సన్ వరకూ పై సిద్ధాంతానికి భిన్నంగా అభ్యుదయ సామాజిక ప్రజాస్వామిక అజెండాను అనుసరించారు. ఈ మూడు దశాబ్దాలలో కార్పొరేట్ పన్నులు అధికంగా ఉండేవి. కార్మిక సంఘాలు బలంగా ఉన్నయి. విద్య, వైద్య రంగాలకు అత్యధిక కేటాయింపులు జరిగాయి. తద్వారా సాధించిన ఆర్థికాభివృద్ధి మూలంగా అక్కడి పౌర సమాజంలో అసమానతలు తగ్గుముఖం పట్టాయి.

ఆర్థికాభివృద్ధి తగ్గుముఖం పట్టినప్పుడల్లా అసమానతలు పెరిగిపోవడం అమెరికా అనుభవ పూర్వకంగా చవిచూసింది. 1981లో రోనాల్డ్ రీగన్ హయాంలో కార్పొరేట్ పన్నులు భారీగా తగ్గించాడు, కార్మిక సంఘాలను అణిచి వేశాడు, విద్యలో అప్పటివరకూ దేశం సగ ర్వంగా సాధించిన ఫలితాలు క్రమంగా అడు గంటిపోయాయి. లక్షలాది మంది ప్రజలకు ఆరోగ్యవసతి అందకుండా పోయింది, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ క్షీణించిపోయింది. సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. బిల్‌క్లింటన్ అధికారం చేపట్టాక మరో మార్గం ఎంచుకున్నాడు. మానవీయ కోణంలో పెట్టుబడి దారీ విధానాన్ని అనుసరించడం తన అభి మతం అని ప్రకటించాడు. ఈమొత్తం కాలంలో సంపన్నులు అపరకుబేరులుగా అవతరించారు. సాధారణప్రజానీకం జీవితాలు మసకబారి పోయాయి.

మన్మోహన్ సింగ్ మనదేశ ప్రధానిగా పదవీ భాధ్యతలు చేపట్టాక 'మానవీయ కోణం లో పెట్టుబడిదారీ విధానం' అనే నినాదాన్ని జనాలకు ఎక్కించాల్సిన బాధ్యతను మేధావులు తమ భుజస్కంధాల మీదకు ఎత్తుకున్నారు. ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు అన్నీ పెట్టు బడిదారులకు, కార్పొరేట్‌లకు, సమాజంలో శక్తిమంతులకు అనుకూలంగా తీసుకుంటూ బడుగు బలహీన వర్గాలకు ఉపాధి హామీ పథకం కల్పించి తమది పేదల సంక్షేమం కోరే ప్రభుత్వం అని చాటి చెప్పుకోవడానికి ప్రయ త్నించింది.

### న్యాయస్థానం తీర్పులు అంతిమం కానప్పుడు

2007లో సామాజిక కార్యకర్త నందిని సుందర్ ఇతర సహచరులతో కలిసి సల్వా జుడుంని రాజ్యాంగేతర శక్తిగా ప్రకటించాలని కోరుతూ సుప్రీంకోర్టులో దావా వేసింది. 2011 జూలై నెలలో ద్విసభ్యబెంచ్ ఈ వాజ్యంపై తీర్పునిస్తూ భారతదేశ అభివృద్ధి వ్యూహాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. ప్రణాళికా సంఘం విడుదల చేసిన నివేదికలలోని గణాంకాల విశ్లేషణ ఆధారంగా 'ఆదివాసీ ప్రాంతాలలో హింస అంతూదరీ లేకుండా సాగడానికి కారణం ఆధిపత్య కులీన వర్గాలు ఆదివాసీలకు చెందాల్సిన ప్రయోజనాలను స్వాహా చెయ్యడమే, దేశఅభివృద్ధికి పేదలు మూల్యం చెల్లించాల్సి రావడమే' అని తీర్పు చెప్పారు.

అభివృద్ధి ప్రాజెక్టుల ప్రయోజనాలు సమా జంలో అట్టడుగు వారికి చేరాల్సింది పోయి, పై తరగతుల వారికి చెందాయి. చట్టం ముందు అందరూ సమానమే. ప్రతి భారతీయుడికీ గౌరవప్రదంగా జీవించే హక్కు ఉంటుంది అన్న రాజ్యాంగ సూత్రాలను ప్రభుత్వం ఉల్లంఘి ంచింది అని ఆ న్యాయమూర్తులు ఇరువురూ నిర్ధారించారు. సల్వాజుడుం పై నిషేధం విధించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ఈ తీర్పుని ఖాతరు చెయ్యలేదు. వాడుకలో సల్వాజుడుం పదం అంతర్ధానం అయిపోయింది కానీ పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలు కాపాడడం కోసం ప్రభుత్వ ప్రాయోజిత రక్షకదళాలు మారుపేర్లతో సలాజుడుం చేసే పనులన్నీ చక్కబెట్టసాగాయి. 1832లో అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాక్సన్ ఆదేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపట్ల స్పందిస్తూ 'ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ ఈ తీర్పు ద్వారా తన నిర్ణయాన్ని వెలువ రించాడు కాబట్టి ఆయనే దాన్ని అమలు చెయ్యాలి' అని ప్రకటించి సుప్రీం తీర్పును ఖాతరు చెయ్యనట్లే ఛత్తీస్‌ఘడ్, కేంద్ర ప్రభుత్వాలు రెండు కూడా ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుని ఖాతరు చెయ్యలేదు. భారత వాణిజ్య వర్గాలు, రాజకీయ పాలకుల మధ్య ఉ న్న ఆ పవిత్రబంధాన్ని విడగొట్టడానికి ఉ ద్దేశించిన సుప్రీంకోర్టు ఆదేశాలను, తీర్పులను కేంద్రప్రభుత్వం విస్మరిస్తూ వచ్చింది. పర్యవసానంగా అక్రమ తవ్వకందారులు, మాఫియా – ఈ ఇద్దరి మధ్యన తేడా అంత స్పష్టంగా ఉండదు– రాజస్థాన్ లోని ఆరావళి కొండలలో తవ్వకాల మీద సుప్రీంకోర్టు విధించిన నిషేధాన్నీ యథేచ్ఛగా ఉ ల్లంఘించారు. మరీముఖ్యంగా ఇసుక తవ్వకాలపై విచ్చలవిడిగా వ్యవహరించారు. నిర్మాణ రంగంలో నెలకొన్న 'బూమ్' మూలంగా ఇసుకకు అంత గిరాకీ ఏర్పడింది.

గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవీ కాలంలో పడ్డ మచ్చలను మసిబూసి మారేడు కాయ చేసి ఎట్టకేలకు 2014లో మోడీ ప్రధాన పదవి చేజిక్కించుకున్నారు. ఆదానీ ప్రైవేటు విమానం ఎక్కి అహమ్మదాబాద్ నుండి ఢిల్లీకి చేరుకున్నారు. ఈ ప్రైవేటు విమానం మీద ఒక

**❝ జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో గొప్పదనం గురించి వేనోళ్ళ కీర్తిస్తూనే బహుళ ప్రయోజ నాలు సర్దుబాటు చెయ్యడం కోసం సంస్థాగత ంగా అడ్డొస్తున్న నిబంధనలు, నియంత్రణల పట్ల పెట్టుబడిదారు లు అత్యంత అసహన ధోరణులు ప్రదర్శిస్తుంటారు. నియంతృత్వ ప్రభుత్వాలు అయితేనే నిర్ణయాత్మకంగా వ్యవ హరించగలుగు తాయని, ఆర్థిక వ్యవస్థను అత్యు న్నత స్థాయికి చేరుస్తాయని వాళ్ళు బలంగా నమ్ముతారు. ❞**

పక్క అదానీ కంపెనీలోగో, మరో పక్కన జాతీయజెండా ముద్రించి ఉన్నాయి. స్టాక్ మార్కెట్లకు తగిన సందేశం అందింది. అదానీ కంపెనీల షేర్ల ధరలకు ఒక్కసారిగా రెక్క లొచ్చాయి.

మోడీ సంపన్నవర్గాల అనుకూల ఆర్థిక విధానాలను అమలు చెయ్యడంతో పాటు పరిపాలనలో నియంతృత్వ ధోరణులతో వ్యవహరించసాగారు. బహుశా ప్రతాప్ భాను మెహతా వంటివాళ్ళకు ఈ నియంతృత్వ ధోరణులే 'నిర్ణయాత్మక వైఖరి'గా భాసించి ఉండవచ్చు. 2014 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక 'మోడీలో ఉన్న మరీ పాక్షిక ఆకర్షణ ఏంటంటే భారతీయ ప్రజా స్వామ్యంలో ఉన్న నిబంధనలు, నియంత్ర ణలను త్రోసి రాజని మోడి తాను అనుకున్నది అనుకున్నట్లు మొండిగా, బలప్రయోగం ద్వారా అయినా సరే అమలు చేస్తారు' అని 'ఫైనాన్షి యల్ టైమ్స్' దినపత్రిక వ్యాఖ్యానించింది.

జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో గొప్పదనం గురించి వేనోళ్ళ కీర్తిస్తూనే బహుళ ప్రయోజ నాలు సర్దుబాటు చెయ్యడం కోసం సంస్థాగత ంగా అడ్డొస్తున్న నిబంధనలు, నియంత్రణల పట్ల పెట్టుబడిదారులు అత్యంత అసహన ధోరణులు ప్రదర్శిస్తుంటారు. నియంతృత్వ ప్రభుత్వాలు అయితేనే నిర్ణయాత్మకంగా వ్యవ హరించగలుగుతాయని, ఆర్థిక వ్యవస్థను అత్యు న్నత స్థాయికి చేరుస్తాయని వాళ్ళు బలంగా నమ్ముతారు.

అయితే నియంతృత్వ అధికార పాలనలో ఈ విధంగా ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరా లకు అభివృద్ధి చెందింది అనడానికి తగిన గణాంక అధ్యయన అధారాలు ఏమీ లేవు. ఉగాండాలో ఇడీ అమిన్, జైరేలో మొబుటు సెసెసీకో వంటి పచ్చి నియంతలనే గుర్తుకు తెచ్చుకోండి – వాళ్ళు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలని ఎంతలా ధ్వంసం చేసారో స్ఫురణకు వస్తుంది. పెట్టుబడిదారులు ఇలాంటి దేశాల ఉదాహరణలను పక్కన పెట్టి తూర్పు ఆసియా దేశాలు అభినందించదగ్గ స్థాయిలో ఆర్థికాభివృద్ధి సాధించిన మాట వాస్తవమే. అయితే ఈ మినహాయింపుకు కారణం ఏమిటని ప్రశ్నిస్తే మనకు మరిన్ని సందేహాలు ఎదురవుతాయి.

### తూర్పు ఆసియా దేశాల శ్లేష

తూర్పుఆసియా దేశాలు మెజార్టీ ప్రజా నీకాన్ని అణగదొక్కడంతో పాటూ సామాజిక ప్రజాస్వామిక ఆర్థిక విధానాలను అవలంబిం చాయి. ఆయాదేశాలు నాణ్యమైన విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాయి. అత్యంత చురుకైన దశలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారా ప్రజలలో ఆదాయ అసమానతలు తగ్గుముఖం పట్టాయి. ఈ వివరాలన్నీ 1993లో ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో ఉన్నాయి. ఒకపక్క నియంతృత్వ పాలన కొనసాగిస్తూ రెండో పక్కన ఈ దేశాలు సోషల్ డెమోక్రసీ విధానాలను ఎలా అవలంబించాయా అని చరిత్రకారులు ఇంకా చాలా కాలం పాటు కుస్తీ పడతానే ఉంటారు. ఈ విరోధభాస్‌లో కీలకపాత్ర పోషించింది సోషల్ డెమోక్రసీకి కీలక సాధనమైన విద్య. ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రోలాండ్ బెనబౌ "మానవ వనరులలో పెట్టుబడులు రెండు విధాలా ప్రయోజనకారి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడంతో పాటు సమాజంలోని బడుగు బలహీన వర్గాలకు ఇతోధిక అవకాశాలు కల్పించడం ద్వారా అసమానతలు తగ్గిస్తాయి" అని వివరిస్తాడు.

మనదేశంలోను, అంతర్జాతీయంగానూ తూర్పు ఆసియా దేశాల్లోని నిరంకుశత్వాన్ని ఆరాధించే పెట్టుబడిదారులు ఆయాదేశాలు అనుసరించిన సామాజిక ప్రజాస్వామిక ప్రజోపయోగ విధానాలను మాత్రం అవకాశ వాద దృష్టితో విస్మరిస్తుంటాయి. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు మున్ముందుకు సాగిపోతుంది అన్న భావనలో బందీ అయిపో యారే తప్ప మానవవనరుల నైపుణ్య లేమి మూలంగా దేశ ఆర్థిక, సామాజిక పురోగతికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయన్న వాస్త వాన్ని గమనించడానికి సిద్ధంగాలేరు. ఆఖరుకి ఎంతో పురోగమించిన రాష్ట్రంగా చెప్పుకునే తమిళనాడులో కూడా ఈవిషయంలో ప్రభు త్వం విఫలమయ్యింది. లాభాపేక్షతర సంస్థ ప్రథమ్ వార్షిక నివేదిక గానీ, ప్రభుత్వం తరపున యన్.సి.ఎ.ఆర్.బి. నిర్వహించిన సర్వేలోగానీ తమిళనాడు ప్రాథమిక పాఠశా లలలో శిక్షణా స్థాయి చాలా తక్కువస్థాయిలో ఉన్నాయన్న వాస్తవం బయటపడింది. అయితే ప్రజారోగ్య వ్యవస్థ మాత్రం చాలా పటిష్ఠంగా ఉండడం చాలా సానుకూలమైన అంశం. క్షేత్ర స్థాయి ఉద్యమాలద్వారా ప్రజాహితం గల ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసుకోవడం అభినందనీయమైన విషయమే కానీ మెరుగైన విద్య కోసం అలాంటి క్షేత్రస్థాయి ఉద్యమం ఇంకా ఊపందుకోలేదు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం కూడా సమిష్టి విలువల కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పర్యావరణ కాలుష్యం అంటే ఎంతకీ స్వచ్ఛమైన గాలి లభ్యత అన్న అంశం దగ్గరే భారతీయుల ఆలోచన ఆగిపోయింది కానీ అంతకన్నా ఆందోళనకరమైన అంశం దేశవ్యా ప్తంగా తరిగిపోతున్న మంచినీటి నిల్వలు, సురక్షితమైన తాగునీరు సరఫరా ప్రజల అవసరాలకు తగినంతగా లేకపోవడం. తమిళనాడు విషయాన్నే తీసుకుంటే కొయ్యంబ త్తూర్, తిరుప్పూర్‌లలో ఉన్న ఫ్యాక్టరీల నుండి విడుదలయ్యే విష రసాయనాలు, డిటర్జెంట్‌లు కొన్ని దశాబ్దాలుగా నొయ్యల్ నదిని కలుషితం చేస్తున్నాయి.

భారతదేశంలోని ప్రధాన నగరాలలో మాదిరిగానే చెన్నై మహానగరంలో చెరువులు, నీటికుంటలు వంటి సహజ నీటివనరుల ప్రాంతాలు అక్రమణలకు గురయి అక్రమకట్టడాలు విచ్చలవిడిగా నిర్మించడంతో పాటు నిర్మాణ శిథిలాలను నదులు, కాలువలలో కుమ్మరించడం మూలంగా నీటిపారుదల సజావుగా లేకుండా పోయి భారీ వర్షాలు కురిస్తే నగరం వరద నీటిలో మునిగే పరిస్థితి దాపురించింది. 2015 వరదలే ఇందుకు ప్రబలనిదర్శనం. ఇక ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డూ అదుపూ లేగుండా సాగుతున్నాయి. దీని మూలంగా నదులు భూగర్భ జలాలను పునఃసమీకృతం చేసుకునే శక్తిని కోల్పోతున్నాయి. సాగునీరు లభ్యత కరువై

> ❝ ప్రస్తుతానికి భారతదేశ అసమాన అభి వృద్ధి కొనసాగుతున్నది. రాజకీయ నాయకులు సమ్మిళిత అభివృద్ధి, సమానత్వాల గురించి కేవలం పైపై మాటలు చెబుతున్నారు. విద్య, వైద్యం, నివాసయోగ్యమైన నగరాలు, సరైన జవాబుదారీ న్యాయవ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలకమైన అంశాలపై ఏవో కొన్ని ఆలోచనలు ప్రకటిస్తున్నారు కానీ నిర్దిష్టమైన లక్ష్యాలుగానీ, రాజకీయ సంకల్పం గానీ ఉండడంలేదు. ❞

పంటలు దెబ్బ తింటున్నాయి. నీటి వనరులను సంరక్షించుకోలేక పోవడం మూలంగా పేదల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి.

తమిళనాడులో తీరప్రాంతం కోతకు గురవడం మూలంగా ఏర్పడే నష్టాన్ని ఎవరు భరించాలి అనేది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర పోర్టుల అభివృద్ధి సంస్థ, కోస్తా హైవే సంస్థలు అభివృద్ధి పేరిట అనుమతించిన భారీ మౌళిక సౌకర్యాల కల్పనా ప్రాజెక్టులు చేపల వేట మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని, వారి నివాస ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసాయి.

అలాగే సామూహిక విలువలు లోపించిన కారణంగా కేరళలో కూడా బలహీనవర్గాల ప్రజానీకం జీవనోపాధి దెబ్బతిన్నది. కానీ అదే కేరళ రాష్ట్రం అందరికీ విద్య, వైద్యం అందు బాటులోకి తీసుకురావడంలో అగ్రగామిగా నిలిచింది. మహారాజుల పరిపాలనా కాలం నుండి విద్య మీద శ్రద్ధ పెట్టడం, మాతృస్వామిక సంప్రదాయాల నేపథ్యం ఉండడం, స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వాలు సోషల్‌డెమోక్రసీ విలువలను అనుసరించడం మూలంగా ఈ ప్రగతి సాధ్య పడింది. అయితే సమీపగతం నుండి సమాజంలో నెలకొని ఉన్న సమిష్టి ప్రయోజన భావనలు బీటలు వారుతున్నాయి. తమిళనాడు రాష్ట్రం మాదిరే కేరళలో తీరప్రాంతం కోతకు గురికావడంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిన్నది. పశ్చిమ కనుమలలో ప్రాచీన అడవులను 'అభివృద్ధి'కి ఫణంగా పెట్టడంతో ఈ కనుమలలో నివసించే ప్రజలు తరచూ సంభవించే కొండచరియల విరుగుబాటు మూలంగా తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే మైనింగ్ కూడా కేరళ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నది.

కేరళ అసమాన అభివృద్ధికి దత్తపుత్రుడిగా విజింజమ్ పోర్టు నిర్మాణం ముందుకు వచ్చింది. 2015 ఆగస్టులో ఈ ప్రతిపాదిత పోర్టు ప్రాజెక్టు నిర్మాణానికి పిలిచిన టెండర్లకు కేవలం ఆదానీ పోర్ట్ అండ్ యస్.ఎ.జడ్. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఒక్కటే టెండరు దాఖలు చేసి ప్రాజెక్టు దక్కించుకుంది. ఆరోజున అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయంలో 2/3వ వంతు పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించింది. అయితే కేరళ ప్రభుత్వం కుదుర్చుకున్న ఆదాయ పంపిణీ ఒప్పంద మూలంగా ఆదానీ పోర్ట్స్‌కు అత్యధిక వాటా లభించి ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా నష్టపోనున్నదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక దుయ్యబట్టింది.

ఈ ప్రాజెక్టు మూలంగా తీరప్రాంతం మరింత కోతకు గురయి జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, ముఖ్యంగా మత్స్యకారుల జీవనోపాధి హరించుకుపోతుందని స్థానికులు, సామాజిక కార్యకర్తలు, చిరువ్యాపారస్థులు ఆందోళన వెలిబుచ్చారు. సముద్ర నీటి ప్రవాహానికి మానవ నిర్మిత ఆటంకాలు ఎదురయినప్పుడు కోతలు ఏర్పడడానికి, జలచరాల మనుగడకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని శాస్త్రీయ పరిశోధనలు నిగ్గుతేల్చాయి. గతంలో సి.పి.యం నాయకులు ఈ పోర్టు వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకున్నారు. కానీ అదే పార్టీ నాయకత్వంలో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక పోర్టు నిర్మాణానికి సహకరించాలని నిర్ణయించింది.

**కులీనవర్గాలు చిన్నగా జొరబడుతున్నాయి**

ప్రస్తుతానికి భారతదేశ అసమాన అభివృద్ధి కొనసాగుతున్నది. రాజకీయ నాయకులు సమ్మిళిత అభివృద్ధి, సమానత్వాల గురించి కేవలం పైపై మాటలు చెబుతున్నారు. విద్య, వైద్యం, నివాసయోగ్యమైన నగరాలు, సరైన జవాబుదారీ న్యాయవ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలకమైన అంశాలపై ఏవో కొన్ని ఆలోచనలు ప్రకటిస్తున్నారు కానీ నిర్దిష్టమైన లక్ష్యాలుగానీ, రాజకీయ సంకల్పం గానీ ఉండడంలేదు. ఇప్పటికీ మనదేశానికి అసమాన అభివృద్ధి పట్ల సొంత సిద్ధాంతం ఉన్నది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఇవాళ అసమానతలు ప్రోది చేసే రాజకీయ సిద్ధాంతాల హవా నడుస్తున్నది.

భారతదేశ రాజకీయాల్లో మోడీ గుజరాత్ ఆర్థికాభివృద్ధి నమూనాలో ఏ అంశాన్నయితే తెరమరుగున ఉంచాడో ప్రధానమంత్రి హోదాలో ఆ ముసుగు తొలగించేసారు. గౌతమ్ అదానీ చిరకాలంలోనే ప్రపంచ కుబేరులలో ఒకరిగా ఎదిగారు. అతని మౌళిక సౌకర్యాల కల్పనా ప్రాజెక్టుల సామ్రాజ్యం దేశంలో మూల మూలకి విస్తరించింది. అదానీ కంపెనీ షేర్ల ధరలకు రెక్కలొచ్చాయి. అమెరికాకు చెందిన షార్ట్–సెల్లర్ హిండెన్ బర్గ్, అదానీ అక్రమ ఆర్థిక లావాదేవీలకు పాల్పడ్డాడని ఒక నివేదిక వెలువరించడంతో అదానీ షేర్లు తీవ్ర నష్టాన్ని చవి చూసాయి. సదరు కుంభకోణం మీద సెబి, సుప్రింకోర్టుల విచారణలు నత్తనడకన సాగాయి. నియంత్రణా సంస్థలు, కోర్టుల తీరును బట్టి ఈ ఆరోపణలు తోసివెయ్యబడవచ్చు అన్న సందేశం అందుకున్న బ్యాంకర్లు, మదుపుదార్లు అదానీ షేర్లు తిరిగి పుంజుకోవడానికి తమ వంతు సహకారం అందించారు. అదానీ ప్రభ మరింత వెలిగిపోవడానికి హిండెన్ బర్గ్ తప్పుడు విధానాలకు పాల్పడ్డాడని నియంత్రణా సంస్థ ఎదురు ఆరోపణలు చేసింది. ఇందుకు ప్రతిగా సెబి ఛైర్‌పర్సన్ స్వయానా అదానీ కంపెనీలలో దేశాంతర మార్గాలలో పెట్టుబడులు పెట్టిన కారణంగా అదానీ వ్యవహారంలో విచారణార్హత కోల్పోయారని హిండెన్ బర్గ్ సాక్ష్యాధారాలు విడుదల చేసింది. ఈ ఆరోపణలు ప్రత్యారోపణల పర్వం ద్వారా భారతీయ సంపన్న వర్గాలు ఒక ప్రత్యేక లోకంలో జీవిస్తున్నాయని స్పష్టమవుతున్నది.

ఇదే సమయంలో అదానీ, బొగ్గుగనుల తవ్వకం ప్రాజెక్టు కోసం స్థానికుల నిరసనలు ఖాతరు చెయ్యకుండా, న్యాయవ్యవస్థను ప్రభావితం చేసి మరీ హస్‌డియో అడవులలో చెట్లు నరికివేతను ప్రారంభించాడు. రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఛత్తీస్‌ఘడ్‌లోని భాజపా ప్రభుత్వం – రెండూ కూడా అదానీ హస్‌డియో అడవుల నరికివేతకు సహకరించాయి.

ఉక్రెయిన్ మీద యుద్ధానికి దిగిన కారణాన రష్యా మీద పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. ఈ ఆంక్షలను లెక్కవెయ్యకుండా రష్యా నుండి చౌకగా చమురు దిగుమతి చేసుకుని అధిక ధరకు ఐరోపా దేశాలకు అమ్ముకోవడం

> **❝ దేశంలో సంపన్నులు అపరకుబేరులు అయిపోతున్నారు. సంపద విపరీతంగా పోగే సుకుంటున్నారు. కానీ సామాజి కాభివృద్ధికి తోడ్పడే విద్య, వైద్యరంగాల మీద అంతులేని నిర్ల క్ష్యం కొనసాగుతోంది. కోవిడ్ అనంతర విద్యా ప్రమాణాలు కోవిడ్ ముందు కాలం నాటి కన్నా పడిపోయాయి అన్న ప్రథమ్ నివేదికాంశం కూడా ప్రభుత్వాలకు పట్టకుండా పోయింది. ❞**

ద్వారా రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మరింత సంపద్వంతుడు కావడానికి మోడీ సర్కారు సహకరించింది. అంబానీ తన కొడుకు అనంత్ పెళ్ళి పూర్వవేడుకల కోసం 1200కోట్ల రూపాయలు ఖర్చు చేసాడు. తదనంతరం మోడీ మూడవసారి ప్రమాణ స్వీకారోత్సవానికి అనంత్ హాజరయ్యాడు. ప్రధాని హోదాలో మోడీ అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ వివాహోత్సవానికి స్వయంగా హాజరయ్యారు. భారతీయ సమాజంలో రాజకీయాలు, అధికారం, డబ్బు, సినిమా గ్లామర్ అన్నీ ఒకటిగా పెనవేసుకు పోయాయి.

దేశంలో సంపన్నులు అపరకుబేరులు అయిపోతున్నారు. సంపద విపరీతంగా పోగేసుకుంటున్నారు. కానీ సామాజికాభివృద్ధికి తోడ్పడే విద్య, వైద్యరంగాల మీద అంతులేని నిర్లక్ష్యం కొనసాగుతోంది. కోవిడ్ అనంతర విద్యా ప్రమాణాలు కోవిడ్ ముందు కాలం నాటి కన్నా పడిపోయాయి అన్న ప్రథమ్ నివేదికాంశం కూడా ప్రభుత్వాలకు పట్టకుండా పోయింది.

## హైలెట్స్

భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ ఫలితంగా కార్మిక వ్యతిరేక సిద్ధాంతం బలపడింది. సల్వాజుడుం ఇందుకు ఒక ఉదాహరణ. పెట్టుబడిదారీ అనుకూల_సిద్ధాంతం సవాలు చేయ వీలులేనంత మొరటుగా తయారయ్యింది.

ఈ జాడ్యం ఉన్నత విద్యకు కూడా పాకుతోంది. మనదేశంలో కొన్ని విశ్వవిద్యాలయాలు విద్యా ప్రమాణాలలో అత్యున్నత స్థాయిని కలిగి ఉన్నాగానీ మెజారిటీ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు విద్యాప్రమాణాల లేమితో నిరుద్యోగులుగా పనికి వచ్చే విద్యార్థులను తయారుచేసి పంపుతున్నాయి. అలహాబాద్ విశ్వవిద్యాలయ పతనం ఇప్పుడు ఢిల్లీ విశ్వవిద్యాలయానికి కూడా పాకింది. 'ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని ప్రణాళికా బద్ధంగా ధ్వంసం చెయ్యడం సంపన్న వర్గాల కుట్ర' అని కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నాడు ప్రముఖ చరిత్రకారుడు ముకుల్ కేశవన్. బడా సంపన్న వర్గాలకు చెందిన వారు వాళ్ళ పిల్లలని ఖరీదైన ప్రైవేటు కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లోనో లేక విదేశీ విద్య కోసమో పంపిస్తున్నారు. కాబట్టి వాళ్ళకి విద్యారంగంలో ప్రమాణాలు క్షీణిస్తున్నా పట్టనట్లు ఉండిపోయారు. ఈ పరిస్థితుల రీత్యానే ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా కొంతమంది 'విద్యారుణాలు' తీసుకుని మరీ విదేశాలకు వెళ్ళి చదువుకొంటున్నారు.

సంపన్నులు ప్రజోపయోగ సేవల నుండి తప్పుకుంటూ వున్నారు. అయితే ఆకాశహర్మ్యాల్లో లేకుంటే కమ్యూనిటీలలో నివసిస్తున్నారు. మురుగునీటి పారుదల సౌకర్యం, మంచినీటి సరఫరా సహా వాళ్ళకు ప్రత్యేక వసతులు ఉన్నాయి. ఇళ్ళలో గాలిశుద్ధి ఏర్పాట్లు ఉంటాయి. వైద్యం కోసం బడా కార్పొరేట్ ఆసుపత్రులు ఉన్నాయి లేకుంటే విదేశాలకు వెళ్ళే అవకాశాలూ దండిగా ఉన్నాయి. లక్షల్లో ఫీజులు ఇచ్చి ఖరీదైన లాయర్లను పెట్టుకుని కోర్టుల నుండి సత్వర న్యాయం రాబట్టుకుంటున్నారు. అదే న్యాయవ్యవస్థ లక్షలాదిగా ఉన్న విచారణ ఖైదీల కేసులకు ఏళ్ళ తరబడిగా పరిష్కారం చూపడం లేదు.

'నిజమే మన జనాభా సంఖ్యతో పోలిస్తే ఈ సంపన్న వర్గాల సంఖ్య బహుస్వల్పం, కానీ చట్టసభలు చేసే విధాన నిర్ణయాలు, ప్రాధాన్యతలను నిర్ధారించడంలో వీళ్ళు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంటారు. వాళ్ళు ఎంతకీ పన్నుల తగ్గింపు, నియంత్రణల సడలింపు, భూ చట్టాలు, కార్మిక చట్టాల్లో సంస్కరణలు తీసుకురావడం - వీటి గురించే మాట్లాడుతుంటారు. ఎందుకంటే వాళ్ళ ప్రయోజనాలు ఈ అంశాలతోనే ముడిపడి ఉన్నాయి. అందుకే ఈ దేశంలో విద్యా వ్యవస్థ చట్టుబండలు అవుతున్నా, ప్రజోపయోగ సేవలు, సౌకర్యాలు మెజార్టీ ప్రజానీకానికి అందుబాటులో లేగుండా పోయినా వాళ్ళకు పట్టదు' అని వివరిస్తాడు కేశవన్.

ఉపాధి కల్పనకు సంబంధించి రెండు గణాంకాలు, పరిస్థితి తీవ్రతను తెలియ చేస్తున్నాయి. 2018-2023 మధ్య కాలంలో ఉపాధి కోసం వ్యవసాయ రంగం మీద ఆధారపడిన వారి సంఖ్య 2018 కన్నా 2023 నాటికి 70 లక్షలకు పైగా పెరిగింది. ఇది మహా విపత్తుకు దారి తీసే తిరోగమనం. ఆర్థిక వ్యవస్థలో అత్యల్ప ఉత్పాదకరంగమైన వ్యవసాయం మీద ఇన్ని లక్షల మంది అదనంగా వచ్చి ఆధారపడడం తీవ్ర సంక్షోభానికి సంకేతం. పారిశ్రామిక, సేవా రంగాలలో తగినన్ని ఉపాధి సౌకర్యాలు లభించక పోవడమే ఈ తిరోగమనానికి కారణం. కానీ ప్రభుత్వ అధికారులు, వారి వకాల్తాదారులు మాత్రం మొత్తం శ్రామిక శక్తిలో శ్రామిక మహిళల శాతం ఎంత గణనీయంగ పెరిగిందో చూసారా అని భుజాలు ఎగరేస్తున్నారు. 'ఇంటి చాకిరీ' ని మహిళా శ్రామికులుగా గుర్తించడం మూలంగా వారి ప్రాతినిధ్యం పెరిగింది అన్న వాస్తవాన్ని తెలివిగా దాచి పెడుతున్నారు.

భారతదేశం సాంకేతిక నైపుణ్యానికి పెట్టింది పేరు అని తరచూ చెబుతుంటారు. అయితే ఇక్కడ మనం గణాంక వివరాల్లోకి పోవడం లేదు. పని చెయ్యడానికి తగిన కనీస వయసు ఉన్న వాళ్ళు మనదేశంలో కోటి మందికి పైగా ఉన్నారు. కానీ 60 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలలో, ఉద్యోగార్థులై గానీ ఉన్నారు. అంతర్జాతీయంగా సాంకేతిక నిపుణులకు భారీ అవకాశాలు లభిస్తున్న నేపథ్యంలో మనదేశంలోని ఐ.టి. రంగం కేవలం ఐదు లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించింది. ఐ.టి.రంగం కళ కోల్పోతూ, కృత్రిమ మేథ రంగం మీదకి రావడంతో ఈ రంగంలో కొత్తగా ఉద్యోగం దొరక బుచ్చుకోవడం దుర్లభంగా మారింది. ఐటి రంగంలో బేసిక్ కోడింగ్, సపోర్ట్, మెయింటెనెన్స్ వంటి విభాగాలు క్రమంగా అదృశ్యమై పోతున్నాయి. కాబట్టి మరింత నైపుణ్యంతో ఉంటేగానీ ఉపాధి దొరికే పరిస్థితిలేదు. మరింత నైపుణ్యం సంతరించుకోవాలంటే మన విద్యావ్యవస్థ ఇలాంటి నిపుణతను అందించేలా మార్పు చెందాలి. స్వాతంత్ర్యం వచ్చిన కాలం నుండి వరుసవారీ ప్రభుత్వాలు ప్రజోపయోగ సేవలు అందుబాటులోకి తీసుకురావడం, ఉపాధి అవకాశాలు కల్పించడానికి తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో పూర్తి నిర్లక్ష్యం వహించాయి.

నూతన రాజకీయ సంవిధానం ప్రకారం

> **❝ పేదలకు, బడుగు బలహీనవర్గాలకు అహారధాన్యాలు, విద్యుత్, తాగునీరు, వంట గ్యాస్ వంటి నిత్యావసరాలలో కల్పించే రాయితీ లమూలంగా లక్షలాది మంది ప్రజానీకానికి తక్షణ ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ ఉపశమనాలు వాళ్ళకు పేదరికం నుండి బయటపడవెయ్యలేవు. ఆదాయ అంత రాలను సరిచెయ్యలేవు. నిజానికి ఇవి నొప్పి నుండి ఉపశమనం కలిగించే ఆస్ప్రిన్ మాత్రల వంటివే తప్ప నొప్పికి మూలకారణ మైన రోగాన్ని పరిష్కరించలేవు. ❞**

సంపన్న వర్గాలకు ప్రయోజనం చేకూర్చే కళ్ళకు కనిపించే భారీ ప్రాజెక్టులు అందరినీ సంతుష్ట పరుస్తాయి అన్న పాలసీ స్థిరపడిపోయింది.

నిర్మాణంలో ఉన్న బెంగుళూరు – చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే మీద 2023 జనవరి 5న బెంగుళూరుకు సమీపంలో హెలికాప్టర్‌ను దించారు. ఇది పెద్ద వేడుకగా సాగింది ఎక్స్ ప్రెస్ హైవేలు, ఫ్లైఓవర్లు వంటి మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులకు ఆర్థిక విలువ కన్నా రాజకీయ విలువ పదింతలు ఎక్కువగా ఉ ంటుంది. ఈ అభివృద్ధి విలువ సందేహాస్పదమ యినా గానీ ప్రజలలో 'అబ్బా భలే బాగా కట్టిం చార్రా' అన్న సంతుష్టకర భావన నెలకొంటుంది.

చారిత్రకంగా చూస్తే విద్యకు ఆర్థికాభి వృద్ధికి గాఢమైన సంబంధం ఉన్నదని స్పష్టం అవుతుందిగానీ మౌలిక సౌకర్యాల కల్పనా ప్రాజెక్టులు ప్రజల జీవితాలను, జీవనోపాధిని మెరుగు పరుస్తాయనడానికి ఎటువంటి ఆధారాలూలేవు.

కంటికి కనిపించే మరో ముఖ్య కార్యా చరణ పేదలకు, బడుగు బలహీనవర్గాలకు అహారధాన్యాలు, విద్యుత్, తాగునీరు, వంట గ్యాస్ వంటి నిత్యావసరాలలో కల్పించే రాయితీలు. దీనిమూలంగా లక్షలాది మంది ప్రజానీకానికి తక్షణ ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ ఉపశమనాలు వాళ్ళకు పేదరికం నుండి బయటపడవెయ్యలేవు. ఆదాయ అంత రాలను సరిచెయ్యలేవు. ఈ వాస్తవం తెలిసి కూడా కొంతమంది ఈ చర్యలను ప్రజాసంక్షే మానికి తోడ్పడే చర్యలుగా అభివర్ణిస్తుంటారు నిజానికి ఇవి నొప్పి నుండి ఉపశమనం కలిగించే ఆస్ప్రిన్ మాత్రల వంటివే తప్ప నొప్పికి మూలకారణమైన రోగాన్ని పరిష్కరించలేవు. ప్రధానంగా ఇవి పైకి పేదలను ఉద్ధరించే చర్యలుగా చెప్పుకోవడానికి ఉపయోగపడే చర్యలే తప్ప వారి జీవితాలలొ సమగ్రమైన సమూలమైన మార్పులకు ఎంతమాత్రం దోహదపడవు.

### రాయితీలు ఇవ్వడం పన్నుల మోత మోపడం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమం పేరిట ఎంత ఖర్చు చేస్తాయో అంతకు అంతా పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేస్తాయి. భారతదేశం ఆధునిక, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆకాంక్షిస్తోంది. స్థూల జాతీయోత్పత్తిలో పన్నుల శాతంలో మాత్రం అవినీతికరమైన, బలహీనమైన ఆస్తి హక్కులు ఉన్న ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడు తోంది. జాతీయ స్థాయిలో ఈ నిష్పత్తి 10 నుండి 12 శాతంగా ఉంటే రాష్ట్రాల స్థాయిలో 5 నుండీ 6 శాతంగా ఉన్నది. ఈ పన్నులు కూడా 2/3వ వంతు పరోక్ష పన్నుల రూపంలో ఉన్నాయి. సంపన్న వర్గాలు చెల్లించే ఆదాయపు పన్నులు గానీ వ్యాపార, వాణిజ్యవేత్తలు చెల్లించే కార్పొరేట్ పన్నులు గానీ స్వల్పంగా ఉంటు న్నాయి అంటే పరోక్ష పన్నుల రూపంలో మెజా రిటీ ప్రజానికం మీద భారాలు మోపుతున్నారు.

దీనికి తోడు ఆస్తిపన్నులు నామ మాత్రం కావడంతో నివాస ప్రాంతాలు, పట్టణాల అభివృద్ధికి తగిన ఆర్థిక వనరులు కరువవుతు న్నాయి. చాలా దేశాలలో వసూలు చేసే ఆస్తి పన్ను మొత్తాలను ప్రజల నివాసప్రాంతాలు పరిశుభ్రమైన, సురక్షితమైన రీతిలో నిర్వహిం చేందుకు ఖర్చు చెయ్యడంతో పాటు ప్రభుత్వ విద్య కోసం కూడా ఖర్చు చేస్తున్నాయి. ఆస్తి పన్ను పెంపుదలను రాజకీయ వర్గాలు ఒక అంశంగానే పరిగణించడం లేదు. ప్రభుత్వాలకే పట్టని విషయాలను ఇంకా ఆస్తిపరవర్గాలు ఎందుకు పట్టించుకుంటాయి.

దానాదీనా ఏం జరుగుతుందంటే – ప్రభు త్వం గడించే పన్నుల ఆదాయాన్ని మౌలిక సౌకర్యాల ప్రాజెక్టుల మీదా, బలహీనవర్గాల ప్రజలకు అందించే సబ్సిడీలమీద సింహభాగం ఖర్చు చెయ్యడంతో ప్రజల జీవితాలు మెరుగు పడి, ఉన్నతస్థితిని అందుకునేందుకు మౌలికం గా అవసరమైన సరుకులు, సేవలు కల్పించేం దుకు తగిన మొత్తంలో నిధులు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

నాణ్యమైన విద్యా, వైద్య సౌకర్యాలు, నివాస యోగ్యమైన పట్టణాలు, నగరాలు, న్యాయమైన జవాబుదారీ కోర్టుల వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ వంటివి అభివృద్ధి చెయ్య టం ద్వారా సమాజం పురోగమిస్తుంది. అయితే ఈ రంగాల మీద చేసే ఖర్చు ఫలితాలు తక్షణమే కళ్ళకు కనిపించక పోవచ్చు, కొన్నేళ్ళ పట్టవచ్చు. అందుకే రాజకీయ నాయకులు వీటిని లాయకీ అయిన వ్యవహారంగా చూడడం ఏనాడో మానేసారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఫ్లైఓవర్లు, విమానాశ్రయాల వంటి ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు చెయ్యడమో, ప్రారంభోత్సవాల్లో పాల్గొనడానికి అలవాటు పడిపోయారు. ఆ రకంగా ప్రచార, ప్రసార సాధనాలద్వారా ప్రజల కళ్ళుబడొచ్చు, రాజకీయలబ్ధి కోసం ఈ కార్యక్రమాలను ఉపయోగ పెట్టుకోవచ్చు.

ఈ కారణానే ఇవాళ నాణ్యత లేని విద్య, వైద్య సౌకర్యాలతో, నత్త నడకన సాగుతున్న న్యాయవ్యవస్థతో, సమస్యలు పేరుకుపోయిన నగరాలు పట్టణాలతో ప్రజల జీవితాలు అస్థవ్య స్థంగా తయారయ్యాయి.

ఇవాళ రాజకీయ సమతుల్యంలో సంపన్న వర్గాల పక్షపాతం కొట్టొచ్చినట్లు కనబడుతు న్నది. ఓటర్లకు రాజకీయ నాయకులు అభివృద్ధి సాధిస్తారనే నమ్మకం లేకుండా పోయింది. కాబట్టి వచ్చిన కాడికి ఉచితాలుతో సరిపెట్టుకుం దాం అనే ధోరణి ప్రబలిపోయింది. అందుకే ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీ సహా అన్ని రాజకీయ పక్షాలూ ఉచితాలు వాగ్దానం చెయ్యడంలో పోటీ పడ్డాయి వాస్తవానికి ఈ పార్టీల వద్ద దేశసమగ్రా భివృద్ధికి తగిన ప్రణాళికలు కూడా లేకపోవడం ఉచితాల మీద ఆధారపడడానికి మరో కారణం. ప్రజలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం రాజకీయ నాయకులకు కష్టం గానీ గంభీరమైన ప్రకటనలు ఇవ్వడం ఎంతపని. సమాజగతిని మార్చేందుకు కృషిచేస్తే ఎవరు మెచ్చి మేకతోలు కప్పుతున్నారు ఈ రోజుల్లో? అన్న ధోరణి రాజకీయ నాయకులలో ప్రబలిపోయింది.

బ్రిటన్‌లో మార్గరెట్ థాచర్, అమెరికాలో రీగన్, యూరప్ దేశాలు అన్నీ కలిసి 1993లో ఐరోపా యూనియన్‌గా ఏర్పడిన దరిమిలా ఆయాదేశాల్లో సోషల్ డెమోక్రసీ విధానాలకు మంగళం పాడి సంపన్న వర్గాల అనుకూల సిద్ధాంతాల ప్రాబల్యాన్ని తలకెత్తుకుని అందుకు తగిన విధానాలకు అనుసరిస్తా వస్తున్నాయి. భారతదేశం కూడా ప్రస్తుతం వీటి బాటనే

అనుసరిస్తోంది.

అమెరికాలో డెమోక్రటిక్ పార్టీనే సోషల్ డెమోక్రసీ విధానాలకు స్వస్తి చెప్పడంతో ట్రంప్ కులీనవర్గాల ప్రయోజనాల కోసం చాలా ఉదారంగా పన్నులు తగ్గించాడు, పెట్టుబడిదారీ విధానాల విషమ ఫలితాలను అదుపు చేసేందుకు ఉద్దేశించిన అన్ని నియంత్రణలను, పర్యావరణ పరిరక్షణ అంశం సహా తుంగలో తొక్కేసాడు.

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు నమూనాగా తరచూ అమెరికాను ప్రస్తావిస్తుంటారు. కానీ ఇవాళ ఆదేశ భవిష్యత్తు మీద నీలినీడలు కమ్ముకుంటున్నాయి. స్కూళ్ళు మూత పడుతున్నాయి. అధ్యాపకుల ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. స్కూళ్ళలో విద్యార్థుల గైర్హాజరీ శాతం పెరిగిపోతా ఉన్నది. ఈ పరిస్థితులలో అమెరికన్ విద్యావ్యవస్థను చక్కదిద్దే ఆలోచనే పాలకులలో లేకుండా పోయింది.

**పతనమవుతున్న సమిష్టి సామాజిక, నైతిక విలువలు**

అమెరికాలో రానున్న రోజులలో ఏం జరగనున్నది అనేదాన్ని బట్టి ప్రపంచ వ్యాప్తి ఆర్థికాభివృద్ధి నమూనాలు, విధానాల నిర్ణయాలలో మార్పులు సంభవిస్తాయి. రెండు చట్టసభలలో బైడన్ తీసుకునే నిర్ణయాలకు తగిన మద్దతు లభించక పోవడంతో పలుమార్లు ప్రతిష్టంభనకు దారి తీసింది. సుప్రీంకోర్టు రాజ్యనియంత్రణలను బలహీన పరచడంతో పని ప్రదేశంలో కార్మికులకు భద్రత కరవయ్యింది. పర్యావరణ పరిరక్షణ ఒక అంశమే కాకుండా పోయింది.

విద్య, వైద్యం, గృహవసతి, ఉపాధి కల్పనల కోసం పాటుపడడమే తన కర్తవ్యం అని డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ ప్రకటించారు.

అయినా కమలాహారిస్ ఓటమి చవి చూసి, ట్రంప్ మరోసారి అధ్యక్ష పదవికి ఎంపికయ్యారు. ఇది నిజంగా అమెరికాకు, మన భూగోళానికి గడ్డుకాలమే. భారతదేశం ఇందుకు మినహాయింపు కాదు.

థాచరిజం, రీగరిజం పేరిట చాలా కాలంగా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు అమలవుతా ఉన్నాయి. ఈ విధానాలకు తిరుగు ఉండదు అని భావించారు కానీ ఇంగ్లాండ్, అమెరికాలలో మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో ప్రజలు అనేక నిరసనోద్యమాల్లో పాల్గొన్నారు. పాలకుల విధానాల పట్ల తమ అసంతృప్తిని బాహాటంగానే తెలియచెప్పారు.

ఫ్రాన్స్‌లో, శ్రీలంకలో జరిగిన ఎన్నికలలో పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అనుసరించే పాలక పార్టీలను ప్రజలు ఘోరంగా ఓడించారు. బంగ్లాదేశ్ లో చెలరేగిన నిరసనోద్యమం అక్కడి ప్రభుత్వాన్ని కూలగొట్టింది.

భారతదేశం ముంగిట ఇప్పుడు రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. భగవద్గీతలో చెప్పినట్లు ఏ అవతారపురుషుడో దిగివచ్చి సమస్యలను దైవశక్తితో పరిష్కరించాలి లేదా లెక్కకు మిక్కుటంగా ఉన్న నిరుద్యోగులు తిరగబడి సామాజిక విప్లవాన్ని సృష్టించవచ్చు. ఈ రెండూ మినహా మరో ప్రత్యామ్నాయం కాన రావడంలేదు.

**(అనువాదం: కె.సత్యరంజన్)**

---

# ప్రకృతికి సంబంధించి కొత్త తాత్విక భావనలు

**(21వ పేజీ తరువాయి)**

డార్విన్ పరిణామవాదం జీవుల ఆవిర్భావాన్ని అవగాహన చేసుకోవడంలో గొప్ప విప్లవాత్మక మార్పు తెచ్చింది.

డార్విన్ పరిణామవాదం మాదిరిగానే లూయీపాశ్చర్ బాక్టీరియాలజీ కూడా వ్యాధులకు సంబంధించి మానవుని పాత ఆలోచనలతో తీవ్రంగా ఘర్షించి సరికొత్త భావాలకు అంకురార్పణ చేసింది.

లూయన్ హక్ అనే శాస్త్రవేత్త మైక్రోస్కోపు కనుగొనడంతోనే కణాలు, కణ జాలాలపై పరిశోధనలు ఊపందుకున్నాయి. జీవుల శరీరం 'కణం' అనే ఇటుకతో నిర్మితమవుతుందని కనుగొన్నారు. అయితే ఈ ఆవిష్కరణ వ్యాధులకు సంబంధించిన అవగాహనలో మాత్రం పెద్ద మార్పు తేలేదు. కాని మద్యం తయారీ రంగంలో రసాయనిక పరిశోధనలు చేస్తున్న ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ మానవ శరీరంలో అనేక రకాల వ్యాధులకు బాక్టీరియా క్రిములు కారణమని తొలిసారిగా నిర్ధారించాడు. అంతేకాదు అప్పటి వరకు ప్రకృతిలో జీవులు సద్యోజననం *(Spontanious generation)* చెందుతాయని శాస్త్ర ప్రపంచం నమ్మేది. ఈ రకమైన నమ్మకానికి కారణం లేకపోలేదు. నిల్వ ఉన్న పేడలో నుండి పురుగులు వస్తాయి. మరణించే జంతు కళేబరం అంతరించిపోతుంది. దాని నుండి పురుగులు ఉత్పత్తి అవుతున్నాయి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, ద్రవాలలో పురుగులు జన్మించడం, మట్టిలో నుంచి జీవులు రావటం చూస్తున్నదే. సూక్ష్మజీవ ప్రపంచం గురించి అవగాహన లేని ఆ కాలంలో జీవుల సద్యోజనన వాదం – అంటే జీవులు వాటంతటవి పుడతాయనే భావన ప్రబలంగా వుండేది. అయితే పాశ్చర్ తన పరిశోధనలో ఈ వాదనను పూర్వ పక్షం గావించాడు. ఆహార పదార్థాలున్న జాడీలో గల గాలిలోని సూక్ష్మజీవులను గనుక బాగా వేడిచేసి చంపేసి బిరడా బిగిస్తే ఇంకా ఎన్నాళ్ళున్నా ఆ ఆహారం చెడిపోవడం, పురుగు పట్టడం జరగదు. దీన్నే పాశ్చరైజేషన్ అంటున్నారు. ఈనాడు పాశ్చరైజ్డ్ ఆహారం సర్వత్రా వాడుకలో ఉన్న విషయం మనకు తెలిసిందే.

పాశ్చర్ సూక్ష్మజీవి ప్రపంచాన్ని కనుగొనడమే కాదు ప్రధానంగా మానవునికి వచ్చే అంటు రోగాల గురించి అప్పటికి వేల సంవత్సరాలుగా ఉన్న భావాలను పటాపంచలు చేశాడు. తిరుగులేని పరిశోధనలతో మానవుని రోగాలలో అత్యధికం సూక్ష్మజీవుల వల్ల వస్తాయని తేల్చాడు. దాంతో వైద్యరంగం విప్లవాత్మకంగా మారిపోయింది. వ్యాక్సిన్‌లు, వ్యాధి నిరోధక టీకాలు వచ్చాయి. వ్యాధులు ఎలా వస్తాయో, వాటినెలా నయంచేయాలో మానవుడు తెలుసుకున్నాడు. వ్యాధులను నిరోధించడం ఎలాగో కూడా తెలుసుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే రోగంపై మనిషి విజయం సాధించాడు. అయితే ఆనాటి వైద్యరంగంలో పాశ్చర్ తీవ్రమైన వ్యతిరేకతను అధిగమించిన తరువాత మాత్రమే ఈ విజయం లభించిందని గుర్తుంచుకోవాలి.

❇

# డా॥ ముత్తు లక్ష్మీరెడ్డి

(2వ పేజీ తరువాయి)

నిశ్చయించుకున్నారు. ముత్తులక్ష్మి 28 ఏళ్ల వయసులో 1914లో తన సహధ్యాయి, తెలుగు వ్యక్తి అయిన సుందరరాంరెడ్డిని వివాహం చేసుకున్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానులే, సమానంగా చూడాలని, తన కలల సాధనలో అడ్డుకోరాదని, పరస్పరం గౌరవించుకునే షరతు మీద వివాహం చేసుకున్నారు. ముత్తులక్ష్మి తన భర్త ఇంటి పేరులోని ''రెడ్డి''ని తీసుకున్నారు. అప్పటినుండి ఆమె డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి గానే పిలువబడుతున్నారు. సామాజిక, ఆర్థిక ,రాజకీయ రంగాలలో మహిళల హక్కుల కోసం ఆమె పోరాటం చేశారు. అన్ని రకాల అసమానతలకు వ్యతిరేకంగా తెగువతో పోరాడిన మగువ. 1918లో ఉమెన్స్ ఇండియా అసోసియేషన్ ప్రారంభించారు. 1923లో తన సోదరి అయిన "సుందరం బాల్"క్యాన్సర్ బారిన పడి చనిపోయింది. ఆ సంఘటన ముత్తు లక్ష్మీరెడ్డికి బాధ, వేదనను మిగిల్చింది. ఎప్పటికైనా క్యాన్సర్ రోగుల కొరకు ఒక ఆసుపత్రి నిర్మించాలని ఆమె మనసులో దృఢంగా నిశ్చయించుకున్నారు. దాని పర్యవసానమే తరువాతి కాలంలో "అడయార్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్" నిర్మాణం. 1925లో ఇంగ్లాండ్ వెళ్లి అక్కడ క్యాన్సర్ రోగుల కోసం ఉన్న "రాయల్ మెర్సీడన్ హాస్పటల్" లో ఆంకాలజీ లో శిక్షణ పొంది ఇండియాకి తిరిగి వచ్చారు. 1926లో ఉమెన్స్ ఇండియా అసోసియేషన్ సిఫారసుతో ముత్తు లక్ష్మీరెడ్డి సేవలకు మెచ్చిన మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం ఆమెను శాసన మండలిలో సభ్యురాలుగా నామినేట్ చేసింది. బ్రిటిష్ ఇండియాలో మొట్టమొదటి మహిళా శాసన సభ్యురాలు ఆమె. మరి కొన్నాళ్లకు శాసనమండలి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆ సమయంలోనే మహిళలు, చిన్నారులు, అనాథ పిల్లల సంక్షేమం కొరకు కృషి చేశారు. భారతదేశంలో మహిళల కొరకు ప్రత్యేక ప్రసూతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పబ్లిక్ ప్రాంతాలలో మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాలని మొదటిసారి ప్రతిపాదన తీసుకొచ్చిన వ్యక్తి డాక్టర్ ముత్తులక్ష్మీరెడ్డి. ముఖ్యంగా దేవదాసి వ్యవస్థ రద్దు కోసం మద్రాసు ప్రెసిడెన్సీలో బిల్లు పాస్ చేయించడంలో, చట్టం తీసుకురావటంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అనేకమంది దేవదాసీలతో స్వయంగా మాట్లాడి, ఆ రొంపి నుండి వారు బయటపడేలా చేశారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో హిందూ దేవాలయాలకు మహిళలను అంకితం చేయటాన్ని నిరోధించటం"అనే బిల్లును ముత్తు లక్ష్మీరెడ్డి 1930లో శాసనమండలిలో ప్రవేశపెట్టారు. చివరకు1947లో దేవదాసి సంప్రదాయాన్ని నిషేధిస్తూ మద్రాస్ ప్రభుత్వం ఒక శాసనాన్ని తీసుకువచ్చింది. ఏళ్ల తరబడి ముత్తులక్ష్మీరెడ్డి సాగించిన ఉద్యమ ఫలితమే ఆ చట్టం. ఆ చట్టం తెచ్చే క్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులైన రాజాజీ, ఎస్ సత్యమూర్తి లాంటి వారు శాసనమండలిలో దేవదాసి వ్యవస్థ పురాతన మతాచారమని, సాంప్రదాయక కళలకు దేవదాసీలు సంరక్షకులుగా ఉన్నారని, దేవదాసి వ్యవస్థ ఉండటం తప్పు కాదని వాదించినప్పుడు, ఆ సంరక్షణ బాధ్యతను బ్రాహ్మణ మహిళలు ఎందుకు చేపట్టకూడదు? అని తిప్పి కొట్టారు ముత్తు లక్ష్మీరెడ్డి. దానితో వారు తలవంచుకోవాల్సి వచ్చింది. ఆమె తను చేసే ధర్మ యుద్ధంలో ఎప్పుడూ అలసిపోలేదు. నిబద్ధత కలిగిన పోరాట యోధురాలిగా, సంఘ సంస్కర్తగా తన కర్తవ్యాన్ని నిర్వహించారు. ముత్తు లక్ష్మీరెడ్డి స్త్రీ వాదానికి ప్రతిబింబంగా ఉన్నారు. స్త్రీలు విద్య ద్వారానే లింగ సమానత్వం సాధించగలరని ఆమె విశ్వసించారు.

బాల్య వివాహాల చట్ట సవరణ, మహిళల వివాహ వయస్సు పెంపు, వితంతు పునర్వివాహం లాంటి అంశాలను శాసనమండలిలో ప్రస్తావించి వాటికి పరిష్కారం చూపేవారు. బహు భార్యత్వ నిరోధక బిల్లును శాసన మండలిలో ప్రవేశపెట్టారు.1930లో ఆ బిల్లు ఆమోదం పొందింది.

మహాత్మా గాంధీ పిలుపుతో ముత్తు లక్ష్మీరెడ్డి స్వాతంత్ర సమరంలో పాల్గొన్నారు. దక్షిణ భారతంలో అతి కొద్ది మంది మహిళా నాయకురాండ్రలో ఒకరు. వలసవాద అణిచివేత నుండి భారతదేశ విముక్తి కోసం అహరహం శ్రమించారు. 1931లో అఖిల భారత మహిళా సదస్సుకు అధ్యక్షత వహించారు. 1932లో గాంధీజీతో కలిసి లండన్‌లో జరిగిన మూడవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై విశేష గుర్తింపు పొందారు. 1930లో లండన్ లోను, 1932లో చికాగోలోనూ జరిగిన ప్రపంచ స్థాయి మహిళా సాధికారిక వేదికల నుండి భారతీయ మహిళల కడగళ్ల గురించి ప్రపంచానికి చాటారు. గాంధీజీ అరెస్టుతో ఆమె శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు. మహిళాభ్యుదయం కొరకు తన సంపాదకత్వంలో "స్త్రీ ధర్మ" అనే పత్రికను ప్రారంభించారు. ఈ బహుభాషా పత్రికలో ఇంగ్లీషు, తెలుగు, తమిళం, హిందీలో అనేక వ్యాసాలు ప్రచురించబడేవి.

నిరాశ్రయులైన యువ వితంతువులు, భర్తలు వదిలేయటంతో చిన్నపిల్లలతో ఇబ్బందులు పడుతున్న మహిళలు, అనాథ బాలికలు, పెళ్లి కాకుండానే తల్లులైన వారు, వ్యభిచార గృహాల నుండి రక్షించబడిన మహిళలు, సాలెగూడు లాంటి సమాజంలో దగా పడిన మహిళలు, దేవదాసి వృత్తి నుండి బయటపడిన వారు తదితరుల కోసం "అవ్వాయి హెూం" పేరుతో అనాథ శరణాలయం నిర్మించారు. బాధితులను అక్కున చేర్చుకున్నారు. విద్య, ఆత్మగౌరవంతో మహిళలు స్వతంత్రంగా బ్రతికేందుకు "అవ్వాయి హెూం " ఎంతగానో ఉపయోగపడింది. అనాథలకు అది అభయహస్తంగా మారింది. అంతేకాదు ముస్లిం బాలికల కొరకు హాస్టల్, హరిజన బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించారు.

1937లో డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి మద్రాసు శాసనసభకు ఎన్నికై ప్రజారోగ్య మంత్రిగా మరుపురాని సేవలు అందించారు. భారతదేశంలోనే క్యాబినెట్ హెూదాలో పదవిని నిర్వహించిన 'మొట్టమొదటి మహిళ"గా ఆమె నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉంటూ, తమిళాన్ని అధికార భాషగా మరింతగా ప్రోత్సహించేందుకు కృషి చేశారు. 1923లో ముత్తు లక్ష్మీరెడ్డి గారి సోదరి క్యాన్సర్‌తో మృత్యువాత పడినప్పుడు ఎప్పటికైనా ఒక క్యాన్సర్ హాస్పటల్ నిర్మించాలి అన్న తన దృఢమైన నిర్ణయం 1952 నాటికి సాకారమయింది. అదే "అడయార్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్". పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1952లో ఆ హాస్పటల్‌కు పునాదిరాయి వేశారు.

1954లో ఆ ఇన్స్టిట్యూట్‌ను 12 పడకలతో ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో ఆమె కొడుకు డాక్టర్ ఎస్ .కృష్ణమూర్తి, హాస్పటల్ అభివృద్ధికి మార్గదర్శకత్వం వహించిన డాక్టర్ వి శాంత అందులోనే పనిచేశారు. ఈనాడు దేశవ్యాప్తంగా రెండవ అతిపెద్ద క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ గా, 80,000 మంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నది.

1953 నుండి 57 వరకు మద్రాసు ప్రెసిడెన్సీ సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్‌గా పనిచేశారు డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి. వెనుకబడిన తరగతుల మహిళల విద్య, ఆరోగ్య సంరక్షణకు ఆమె ఎంతగానో పాటుపడ్డారు.

భారతదేశంలో సంఘ సంస్కరణలకు ఆద్యుడుగా, భారత పునరుజ్జీవన పితామహుడుగా రాజా రామ్మోహన్ రాయ్ పేరెన్నిక గన్నారు. అలానే డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి దక్షిణ భారతంలోని మొదటి మహిళా సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారు. 1956లో భారత ప్రభుత్వం ఆమెకు "పద్మభూషణ్" అవార్డు ఇచ్చి సత్కరించింది. ఆమె విగ్రహం అడయార్‌లోని క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో ఉంది. 1985లో అప్పటి రాష్ట్రపతి ఆర్. వెంకట్‌రామన్ విగ్రహాన్ని ఆవిష్క రించారు. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 7 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# మధ్య యుగాలనాటి ఆర్థిక, సామాజిక జీవితం

**(17వ పేజీ తరువాయి)**

రోమన్ సామ్రాజ్య పతనంతో ఉత్తర భారత దేశంలో అంతర్జాతీయ వాణిజ్యం బలహీనపడడం, అనంతరం, క్రీ.శ,8–12 శతాబ్దాల నడుమ ఆగ్నేయ ఆసియా, చైనా ప్రాంతాలతో వాణిజ్యం బలపడడంతో ముఖ్యం గా దక్షిణ భారతం ఎక్కువగా అభివృద్ధి చెందడానికి దోహదపడింది.

**భూస్వామ్య వ్యవస్థ అభివృద్ధి**

మధ్య యుగాలలో ఈ కాలంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. చక్రవర్తి కి, గ్రామాలకు మధ్య ఉన్న పాలనా దొంతరలలో ఒక స్థాయికి చెందిన అధికారులు క్రమంగా తమ అధికారాలను పెంచుకో సాగారు. సామంతులు, మండలాధీశులు, రాజ ప్రతినిధులూ ఇలా వివిధ ప్రాంతాలలో వివిధ రకాల పేర్లతో వీరిని పిలిచేవారు. వీరిలో కొందరు ప్రభుత్వ అధికారులు ఉండేవారు. మరి కొందరు చక్రవర్తితో యుద్ధంలో ఓడిపోయి తమ పాత రాజ్యంలోనే పరిమిత అధికారాలతో ఆ చక్రవర్తికి ప్రతినిధులుగా ఉండేవారు. మరికొందరు చక్రవర్తి కుటుంబ సభ్యులు, సమీప బంధువులు ఉండేవారు. యుద్ధాల్లో చక్రవర్తికి తోడుగా నిలిచి సైన్యాలను నడిపిం చిన దండనాయకులు కూడా ఉండేవారు.

కేంద్రీకృత పాలనా వ్యవస్థలో మాదిరిగా కాకుండా వికేంద్రీకరణ జరిగిన కారణంగా, ఆ యా ప్రాంతాలమీద పన్నులు వసూలు చేయడం, అక్కడి స్థానిక పరిస్థితులను అదుపు చేయడం వంటి అధికారాలను ఈ మధ్య దొంతరలోని అధికారులకు అప్పజెప్పారు. వారికి జీతం రూపంలో కాకుండా. వారి అధికా రం చెల్లుబాటు అయే ప్రాంతంలో వసూలయే శిస్తులో కొంత భాగం వారు అనుభవించే ఏర్పాటు జరిగింది. దీంతో ఈ అధికారులు తమ తమ అధికారం చెలామణీ అయే ప్రాంతా న్ని విస్తృత పరచుకోవడం, ఈ క్రమంలో ఒకరితో మరొకరు పోటీ పడడం జరిగేది. క్రమంగా ఈ అధికారాలు వారి వారసులకు దఖలు పడడం పెరిగింది. చక్రవర్తికి విశ్వా సంగా ఉండే కుటుంబాలవడం దీనికి కారణం.

క్రమంగా చక్రవర్తి ఈ మధ్య స్థాయి పాలకులమీదే ప్రధానంగా ఆధారపడడం పెరిగింది. ఇది చక్రవర్తి అధికారాలు బలహీన పడడానికి దారి తీసింది. స్వంత సైన్యాలు కల వారు చక్రవర్తి మీద తిరుగుబాటు చేసి స్వతంత్రులుగా ప్రకటించుకున్నారు. ఇది చిన్న చిన్న రాజ్యాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పడడానికి దారి తీసింది. మన ఉపఖండం మీదకు దాడులకు ఇతర ప్రాంతాలనుండి వచ్చినవారిని ప్రతిఘటించే బలమైన శక్తి లేని పరిస్థితిని ఆ తర్వాత కాలంలో ఇది కల్పించింది.

అదే సమయంలో కొందరు చిన్న రాజులు తమ ప్రాంతాలలో ఆదాయాన్ని పెంచుకోడానికి వ్యవసాయం, చేతివృత్తులు అభివృద్ధి కావడానికి దోహదం చేసిన సందర్భా లు కూడా ఉన్నాయి. ఐతే చిన్న చిన్న రాజ్యా లుగా అయిపోయిన తర్వాత తమ దేశాలకు వెలుపల జరిగే వాణిజ్యాన్ని ఈ చిన్న రాజులు చాలా వరకూ నిరుత్సాహపరిచారు. వర్తకులు అనేక చిన్న చిన్న రాజ్యాలగుండా ప్రయాణం చేయవలసివచ్చింది. దాని వలన చెల్లించ వలసిన సుంకాలు కూడా పెరిగిపోయాయి. ఈ అన్ని ప్రభావాల వలన వర్తకం బాగా క్షీణించింది.

(తరువాయి వచ్చే సంచికలో)

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..........................................................

**వీధి** ..........................................................

**గ్రామం** ..........................................................

**మండలం లేదా పట్టణం** ..........................................

**జిల్లా** ..........................................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.